ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 3 డిసెంబరు 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20






## గురజాడ గౌరవ యాత్ర

సాహితీస్రవంతి




# విజయనగరంలో గురజాడ గౌరవ యాత్ర

మహాకవి గురజాడ అప్పారావు విశిష్ట పురస్కారం ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు ప్రకటించడాన్ని నిరసిస్తూ పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు 27.11.2022 ఆదివారం విజయనగరంలో గురజాడ గౌరవ యాత్ర చేపట్టారు. మూడు లాంతర్ల కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గంటస్తంభం, ఎమ్మార్ కాలేజీ మీదుగా గురజాడ స్వగృహం వరకు ఈ ప్రదర్శన సాగింది. ప్రదేశమును ప్రేమించుమన్నా... మంచి అనేది పెంచుమన్నా... వట్టి మాటలు కట్టిపెట్టవోయ్ గట్టి మేల్ తలపెట్టవోయ్...' అంటూ దేశభక్తి గేయాన్ని ఆలపిస్తూ ప్రదర్శకులు ముందుకు సాగారు. మార్గమధ్యంలో గురజాడ విగ్రహానికి అసమ్మతి పత్రం సమర్పించారు.

కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత అట్టాడ అప్పలనాయుడు, ప్రజాకవి గంటేడ గౌరు నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య, ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్, రత్నాల బాలకృష్ణ, జిఎస్ చలం, దప్పు శీను, ఇంకా అనేకమంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు. గురజాడకు విరుద్ధమైన భావాలు ప్రచారం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య వారు గురజాడ పురస్కారం ఇవ్వడం తగదని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో సాహితీ స్రవంతి, అరసం, సహజ విశ్వసాహితి, స్నేహ కళా సాహితి, వెలుగు, రాజాం రచయితల సంఘం, ప్రజాసాహితి, జన విజ్ఞాన వేదిక తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# భూతకాలపు సరీసృపాలు

**2022** నిష్క్రమిస్తూ విలువైన పాఠాలూ, తీవ్రమైన హెచ్చరికలూ చేస్తున్నది. తెలుగుజాతి వైతాళికుడైన గురజాడ అప్పారావు స్మారక పురస్కారాన్ని నిత్య ఛాందస ప్రబోధకులకు ఇవ్వడం ఇందుకో ప్రత్యక్ష నిదర్శనం. ఆధునికతకూ, విశాల సౌభ్రాతృత్వ భావనకూ ప్రతీకగా వెలుగొందే గురజాడను కరుడుగట్టిన సనాతనత్వంతో ముడివేసి చూపడం కన్నా దారుణం మరొకటి వుండదు. గోవా చిత్రోత్సవంలో కాశ్మీర్ ఫైల్స్ చిత్రం నిజస్వరూపాన్ని నిరసించిన అంతర్జాతీయ దర్శకుడు, ఆ జ్యూరీ చైర్మన్ నిగర్‌లపిడ్‌పై కొన్ని శక్తులు విరుచుకుపడటం కూడా ఇలాటిదే. డిసెంబరు ఆరున బాబరీ మసీదు విధ్వంసం మూడు దశాబ్దాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో.. ఇది ప్రత్యేకించి చెప్పుకోవలసి వస్తోంది. కీలకమైన కొన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత దేశగమనంపై కొన్ని సంకేతాలు రానున్నాయి. మతతత్వ రాజకీయాలూ, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులూ, కేంద్ర సంస్థల సాకుతో నచ్చని రాష్ట్రాలపై దాడులూ, ఆఖరుకు న్యాయవ్యవస్థపైనా కేంద్ర పాలకుల ప్రత్యక్ష విమర్శలూ, రాష్ట్రాలకు నిధుల నిరాకరణ, హిందీని దేశమంతటా రుద్దే యోచన ... ఇవన్నీ ఒకే పరిణామ క్రమంలో భాగాలు.

తెలంగాణలో వరుసగా కేంద్ర సంస్థల దాడులు, ఆపరేషన్ ఫామ్‌హౌస్ ప్రహసనలూ! ఏపిలో రాజధాని ప్రతిష్టంభన సుప్రీం కోర్టు ముందు విచారణలో వుంది. మూడు రాజధానుల రాజకీయ సమీకరణ కొత్త వైరుధ్యాలకు దారితీస్తున్నది. ఇన్నిటి మధ్యనా కార్మిక, ఉద్యోగ వర్గాల హక్కులు, జీత భత్యాల కోసం తీవ్ర పోరాటాలు అనివార్యమవుతున్నాయి. తెలుగు మీడియాలో నిట్టనిలువునా రాజకీయ విభజన సాగుతోంది. జాతీయ మీడియాపై కేంద్ర గుత్తాధిపత్యం కారణంగా ఏది నిజమో తెలుసుకోవడం పెద్ద సవాలవుతున్నది. మహిళలపై అత్యాచారాలు, వివక్షలూ మానవతనే ప్రశ్నిస్తున్నాయి. సామాజిక న్యాయం దిశగా అడుగులు పడకుండా అభివృద్ధినిరోధకులూ ఆర్థికాధిపత్య శక్తులూ నిరంతరం అడ్డుపడుతున్న స్థితి. ఇలాటి సమయంలో అడుగుజాడ గురజాడది అంటూ భావికి బాట వేసుకోవడం అవసరం. అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగటం అవసరం. దేశ చరిత్రనే నచ్చినట్టు తిరగరాయాలనే వాళ్లూ, అభ్యుదయానికి విపరీతార్థాలు చెప్పి వెనక్కు నడిపించేవాళ్లు దీనికి బద్ధ విరోధులు. అన్ని రకాలైన భూతకాలపు సరీసృపాలను పాత రాతియుగంలో పాతేయ్యాల్సిందే! మందగించకుండా ముందుకు సాగాల్సిందే. భావి కాలానికి అదే వెలుగుజాడ. ■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
**◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి**
మేనేజర్ : **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజీ**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

ఈ సంచికలో ... **సాహిత్య ప్రస్థానం** డిసెంబరు 2022

## కథలు


**తుపాను** : కన్నడ మూలం : కుం.వీరభద్రప్ప
అనువాదం : రంగనాథ రామచంద్రరావు 5
**నల్లరంగు ఇల్లు** : వి రెడ్డెప్ప రెడ్డి ............. 20
**టర్నింగ్ పాయింట్** : బంగార్రాజు కంఠ ......... 31
**ముక్తిధనం** : ప్రేమచంద్/ డా.వెన్నా వల్లభరావు 42
**కావిలి** : రజిత కొండసాని .........59


## కవితలు


మహాస్వప్నం : మల్లారెడ్డి మురళీమోహన్ 13
వాళ్లంతేనా? : పద్మావతి రాంభక్త ...... 14
అక్షరాలు తిరగబడితే ... : డా.టేకుమళ్ల వెంకటప్పయ్య 14
రాసుకో .. నేను భారతీయుడ్ని : అను : పి.శ్రీనివాస్ గౌడ్ .. 15
ఫీనిక్స్ : డా.దార్ల విజయకుమారి .. 19
దాతలూ అన్నదాతలూ : కోటం చంద్రశేఖర్ ......... 25
వెతుకులాట : అను :డా. జివి రత్నాకర్ 29
రొట్టె : డాక్టర్ ఎన్.గోపి ........... 30
మిరపకాయ బజ్జీ : పుట్టి గిరిధర్ ............. 33
నేనెక్కడున్నాను? : డా.విజయలక్ష్మి పండిత్ .... 33
నాగజెముడు ముళ్ల పదును: అవ్వారు శ్రీధర్ బాబు ..... 37
కేక : కోసూరి రవికుమార్ ..... 40
నా దేశ ముఖచిత్రం : కోలా రాము ............ 41
వానచినుకు : కన్నెగంటి నాగేశ్వరరావు 41
బాల్యం రెక్కలు విరిచిందెవరో :వైష్ణవి శ్రీ ................. 48
నా దారెటు? : గిరి ప్రసాద్ చెలమల్లు ... 51
ఇల్లు కూడా మనిషి లాంటిదే! : డా.దేవరాజు మహారాజు ... 52
చివరి నవ్వు : సునీత గంగవరపు ...... 57
వారు పాడుతుంటే ... : కంచరాన భుజంగరావు ... 58
నయా దేశభక్తి ..! :డా.జివిఎస్ జయపాలరావు 61


## వ్యాసాలు


**ఓ చరిత్రకారుని జీవిత విజయ పతాక!**
– తెలకపల్లి రవి .................... 11
**వాస్తవిక వ్యథలు .. ఊరిమర్ల కథలు**
– కెంగార మోహన్ ................. 16
**ప్రశ్నలను లేవనెత్తే కవిత్వం**
– అనూరాధ ...................... 24
**ముఖాముఖి : సమాజ అవసరాలను తీర్చే కవిత్వం కావాలి!**
–ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ 26
**సాహితీ ప్రజ్ఞ**
– నిర్వహణ: **పిళ్లా కుమార స్వామి** 34
**రాజీ లేని విమర్శకుడు .. శిల్పమెరిగిన కథకుడు**
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ... 35
**రావిశాస్త్రి మామిడిచెట్టు కథ – ఒక పరిశీలన**
– డాక్టర్ కసప నరేందర్ .......... 38
**వర్తమానం : సిజెఐ చంద్రచూడ్.. న్యాయవ్యవస్థ పరిణామాలు**
– తెలకపల్లి రవి .................... 49
**రాయలసీమ తొలి రాజకీయ నవల**
– డా.పొదిలి నాగరాజు .......... 53
**డైరీ** ..........................................................62
**ఇది గురజాడను గౌరవించడమా?**
– గంటేడ గౌరునాయుడు ...... 65



**ISSN No: 2581 - 7477**


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# తుపాను

కన్నడ మూలం : **కుం.వీరభద్రప్ప**
అనువాదం : **రంగనాథ రామచంద్రరావు**
**90597 79289**

**అ**తను మెల్లగా కళ్ళు విప్పాడు. ముందు తెరలాగినట్టు కనిపించింది. శరీరం మురికిలాంటి బురదలో కూరుకుని పోయింది. తల మాత్రమే బయటవుంది. బురదలోంచి చేతులు లాక్కోవటానికి ప్రయత్నించాడు. లాక్కోవటానికి సాధ్యం కాలేదు. ఆయాసం కలిగినట్టయ్యింది. దేకసాగాడు. ఊపిరి పీల్చటంతో ముక్కు పుటాలకు అంటుకున్న కొద్దిపాటి బురద ఎగిరింది. అంతా పరావర్తిత ప్రతిస్పందన. తాను బతికాడో, చచ్చాడో అతనికి తెలియదు. ఎవరో నోట్లో పెట్టుకుని మింగుతున్నట్టు అనిపించింది. కదిలాడు. బురద పిచక్ పిచక్ అంది. మస్తిష్కంలో వివేకం తలెత్తసాగింది. కళ్ళు తెరిస్తే ఏమీ కనిపించలేదు. తలమీది నుంచి బురద జలజలమని కిందికి జారింది. కళ్ళకు అంటిన బురదను తుడుచుకోవటానికి కుడిచేతిని లేపటానికి ప్రయత్నించాడు. కాస్త కష్టపడ్డ తరువాత చేయి బురద నుంచి బయటికి వచ్చింది. శుక్లపటలం ముందున్న బురదను తుడుచుకున్నాడు. కాస్త వెలుతురు కనిపించింది. పదేపదే కళ్ళు విప్పార్చాడు. ఎదుట కొద్ది దూరంలో ఏదో ఒక చెట్టు తలకిందులుగా పడివుండటం కనిపించింది. రెప్ప కదిల్చాడు. నరాల్లా అల్లుకున్న చెట్టువేళ్ళల్లో రాబందులు కూర్చుని వుండటం చూసి కొంచెం బెదిరాడు. ఊపిరి తీసుకోవటంతో శక్తి వచ్చినట్టు అనిపించింది. బురద నెత్తికెక్కిందో ఏమో? తుమ్ము వచ్చింది. రెండు మూడుసార్లు తుమ్మాడు. కళ్ళు తేటపడ్డాయి. చుట్టూ చూపులు సారించాడు.అడ్డంగా పడివున్న కొబ్బరి చెట్టుకు అతుక్కునివున్న నగ్న శవాన్ని చూశాడు. దాని పక్కన గ్రద్ద కూర్చుని ముక్కుతో పొడవాలా వద్దా అని ఆలోచిస్తున్నట్టు ఉండటం చూసి తాను ఎలా బతికాడా అని ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఎక్కడ పడివున్నాడు. ఒంట్లో ఐదారు శవాలు దూరుకున్నట్టు చాలా భారంగా ఉంది. ఇకపైనైనా బతుకుతాడో? లేదో? బతకటం కోసం పోరాటం జరపటం ఒక విధంగా అసహ్యకరమైన పని. బతకకుండా ఉండాల్సింది. అందరిలాగే చనిపోయివుంటే బాగుండేది. ఇప్పుడైతే తాను బతికి వుండటం కచ్చితం. ఈ బురద నుంచి శరీరాన్ని లాగి నడుచుకుంటూ గట్టినేలను చేరాలి. గట్టినేల ఎక్కడుందో ఏమో? బురదలో కాళ్ళయినా వున్నాయో? లేవో? అనే అనుమానం అతడిని వేధించింది. చూపులు కిందికి సారించాడు. ఛాతీ మట్టం వరకు ఎర్రమట్టి బురద. ఇందులో కాళ్ళను ఎలా వెతకాలి? శరీరాన్ని మరోసారి కదిలించాడు. అంత గట్టి బురద కాదు. అయినా నడుము దగ్గర ఏదో అడ్డంగా పడివున్నట్టు అర్థమైంది. చేతులను బురదలో దూర్చి లాగాడు. బుడబుడమని శబ్దం చేస్తూ బయటికి వచ్చిన వస్తువును చూశాడు. ఏదో ఒక చిన్న పరిమాణపు జంతువు. దానికి మెడ లేదు. ఒళ్ళంతా గాయాలు. అసహ్యంగా అనిపించింది. విసిరేశాడు. పచక్మని శబ్దం చేస్తూ బురదలో దూరంగా పడింది. ఈ బురద లోపల ఏమేమి ఉన్నాయో ఏమో, తన కాళ్ళను ఏదైనా జంతువు తినివుంటే, లేదా వరద ప్రవాహంలో కొట్టుకుని పోయివుంటే అనిపించింది. శ్వాసకోశం లోపలి నుంచి ఊపిరితో పాటు గొంతు వరకు చిక్కుకున్న బురద అతను దగ్గినపుడు బయటికి వచ్చింది. ఉమ్మాడు. ఒంట్లో ఉండగలిగిన శక్తినంతా కూడదీసుకుని కాళ్ళను కదిలించాడు. కాళ్ళు ఉండొచ్చనే నమ్మకం కలిగింది. కాళ్లూ చేతులు విరగలేదు. ఉన్నదున్నట్టుగానే ఉన్నాయి. ఇక పొట్టలో ఏమేమి చేరుకున్నాయో ఏమో? నీళ్ళు చేరుకుని ఉండటం కచ్చితం. గట్టి నేలను చేరగానే నీళ్ళు కక్కాలి. ఈ ప్రాంతం వదిలి దూరంగా వెళ్ళి బతకాలి. ఇలా ఆలోచిస్తున్న అతని కలలో కేవలం శవాలు నిండివున్న ప్రపంచం సృష్టింపబడింది. తన గ్రామంలోని రాఘవయ్య, చలువయ్య, శేషగిరి, పాపు, పుట్ట అందరూ చనిపోయి ఇప్పుడు ఎక్కడో పడివుంటారని అనుకున్నాడు. ఛైర్మన్ రామలింగయ్య కూతురు కమల శవాన్ని రాబందు

లు తిని కేవలం ఎముకలు ఎక్కడ వదిలివుండొచ్చు?

బర్రుమనే శబ్దానికి తల పైకెత్తాడు. హెలికాప్టర్ ఆకాశంలో ఎగిరిపోతుండటం కనిపించింది. గ్రద్దలు, రాబందులు, కాకులతో పాటు హెలికాప్టర్, విమానాలు ఆకాశంలో గస్తీ తిరుగుతున్నాయి. ఇక్కడ ఈ బురదలో శవాల మధ్య నేను ప్రాణాలతో కదులుతూ ఉండటం ఆకాశంలో తిరిగేవారికి ఎలా కనిపిస్తుంది? నేను ప్రాణాలతో వుండటం లేదా బతుకుతో పోరాడుతూ వుండటం వారికి సరిగ్గా కనిపించకపోవచ్చు. నా అంతట నేను బతకాలి. గట్టి నేలను చేరుకోవాలని అనుకుంటూ కాళ్ళను బలంగా కదిలించాడు. బురద నీళ్ళలోంచి కాళ్ళను లాగడానికి సాధ్యం కావటం లేదు. చుట్టూ చూశాడు. చేతులను బురదలో దూర్చి గెదిరాడు. గట్టి వస్తువు ఒక్కటీ చేతికి దొరకలేదు. బతకటానికి ప్రయత్నిస్తున్నట్టల్లా చావు భయంకరమనిపిస్తోంది. బతికే ప్రయత్నం వల్ల ఒంట్లో ఏదో శక్తి వచ్చినట్టుంది. ముందు పడివున్న లావాటి శవాన్ని పట్టుకుని, దాని ఆధారంతో తన కాళ్ళను బయటికి లాక్కోవటం అనివార్యం అనిపించింది. చేతులు చాపాడు. కాస్త తనకలాడిన తరువాత దొరికిన శవాన్ని రెండు చేతులతో 'ఊఁ' అని శక్తినంతా ఉపయోగించి తన కాళ్ళను లాక్కున్నాడు. బురదతో కూడిన మురికి నీళ్ళు ఒంటి మీదంతా వృత్తాకారపు గీతను ఏర్పరించింది. ఆయాసంతో శవాన్ని కరుచుకునే ముందుకు దేకాడు. ఆ ఆయాసంలో శవం నుంచి వస్తున్న దుర్వాసన అసహ్యాన్ని కలిగించలేదు. తాను పట్టుకున్న శవం లక్ష్మిది కావచ్చని అనిపించి, శవం ఒంటికి అంటిన బురదను తుడిచి పరీక్షించాడు. జుట్టు రాలిన తల, రంధ్రాలు పడిన కళ్ళు, వికారంగా తెరుచుకున్న నోరు, ఉబ్బిన దేహం. జాడించి దూరంగా తోశాడు. అంత దూరం కాకపోయిన కొద్ది దూరానికి జరిగింది. బురదమురికి నీటిలోనే పచక్ పచక్‌మని శబ్దం చేస్తూ తెల్లగా కనిపిస్తున్న దిబ్బ వైపు దేకాడు. ఆ దిబ్బ నిదానంగా కదులుతున్నట్టు అనిపించింది. చివరికి గట్టి నేలను చేరి బోరగిలా పడి ముందుకు దేకసాగాడు. బలంగా ఊపిరి తీసుకుంటూ ఉండటం వల్ల ముక్కు దగ్గర ఉన్న మట్టి ముందు వెనుకలకు చెదిరింది.

**మ**నస్సు జ్ఞాపకాలను జతకూర్చసాగింది.

పదిఇరవై కాయలను కలిగిన వందలాది కొబ్బరిచెట్ల మధ్య రెండంతస్తుల ఇంట్లో వియ్యంకుల సందడి. విజయవాడ వాళ్ళు ఎనిమిది వేలు అడ్వాన్స్ తీసుకుని వేసిన పందిరి కింద, జగ్గయ్య పేటకు చెందిన బ్యాండ్ మేళం వాళ్ళు వాయిస్తున్న సంగీతం వింటూ నోట పైపు పెట్టుకుని వాలుకుర్చీలో ఒరిగిన కోటేశ్వర రావుతో అల్లూరి నుంచి వచ్చిన సూర్యబాబు– 'మామగారూ, ఈ రోజు ప్రాంతీయ వార్తలు విన్నారా?' అని అడిగాడు. గుడివాడ జమీందారు శ్రీపతి కోడలు ఒంటిమీద వజ్రాలతోపాటు కనీసం నలభై తులాల బంగారం వేయమని అడగటం అతిగా ఉందని ఆలోచిస్తున్న కోటేశ్వరరావు– లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు. ముఖాన్ని ఆవరించుకున్న దిగులును దాచటానికి కుడి మీసాలు దువ్వుతూ బాబు ఒక సిగరెట్ కాల్చి బూడిదను యాష్ట్రేలో రాల్చుతూ, 'బంగాళా ఖాతంలో మూడువందల కిలో మీటర్ల దూరంలో తుపాను ఉందట. మరో రెండు రోజుల్లో దివిసీమ వైపు తొంభై కిలోమీటర్ల వేగంతో వీస్తుందట. ఇరవై నాలుగు గంటల్లో ఊళ్ళు ఖాళీ చేయాలని చెప్తున్నారు' అన్నాడు. అప్పటికే గుడివాడ నుంచి వియ్యంకుల వారి నూటా ఇరవై ఎద్దుల బండ్లు వచ్చాయని నడుం వంచి చెబుతూ నిలుచున్న పాపయ్యకు తోట యింటివైపు తోలుకుంటూ పొమ్మని చెప్పాడు. కోటేశ్వరరావు తలెత్తి బిగ్గరగా నవ్వుతూ 'ఏమిటి బాబు, ఇలా చెబితే ఎలా? తుపాను మనకు కొత్తదా? అది ప్రతి సంవత్సరం వస్తూనే వుంటుంది. అక్కడే మనం ఉండే నంగిగడ్డ సముద్రం నుంచి పదిహేను మైళ్ళ దూరంలో ఉంది' అని చెప్పి, లేచి ఘంటసాల నుంచి పురోహితులను తీసుకుని రావటానికి వెళ్ళిన క్యాడిలాక్ కారు వచ్చిందో లేదో అని తెలుసుకోవటానికి కోటేశ్వరరావు లోపలికి వెళ్ళాడు. మామగారు చెప్పినది సరైనదని సూరిబాబుకు అనిపించింది. అతను మంత్రులు బస చేసిన విడిదింటికి బయలుదేరినా మనస్సులో సముద్రపుటలలను ఊహించుకోకుండా ఉండలేదు.

**లే**చి కూర్చుని ఆలోచిస్తున్న అతని కళ్ళ నుంచి రెండు కన్నీటి బొట్లు మోకాలి మీద రాలాయి. బ్యాండువారు వాయించిన 'అమ్మ తోడు అబ్బ తోడు' పాట ఇంకా చెవుల్లో గింగురుమంటోంది. చెవులను రెండు చేతులతో ఒత్తి పట్టుకున్నాడు. ఎన్నో శవాలను తన కిరణాలతో కాల్చుతున్న సూర్యుడి తీక్షణమైన ఎండకు అంటుకున్న బురద ఎండిపోయి అట్టలు కట్టింది. ఏదో పొంగి పొంగి వస్తున్నట్టున్న కడుపు లోతుల్లోంచి వెక్కిళ్ళు పుట్టుకొచ్చాయి. నీళ్ళ కోసం తహతహలాడుతూ చుట్టూ చూశాడు. కంటిచూపు దూరంలో పడివున్న నానా రకాల ప్రాణులను గ్రద్దలు, కుక్కలు, నక్కలు తింటున్నాయి. చనిపోయివుంటే తననూ ఇదే విధంగా తినేసేవని ఆలోచిస్తున్నప్పుడు వణుకు పుట్టుకొచ్చింది. ఎక్కడి నుంచో ఏవో శబ్దాలు తోసుకొచ్చి చెవులను తాకి కలవర పరిచాయి. మొదట్లో తుపాను దగ్గరవుతున్నప్పుడు ఇదే విధమైన శబ్దాలు వినిపించాయి. ఇప్పుడేమైన మళ్ళీ తుపాన్ వీచి తనను గోదావరి ప్రవాహంలోకి తోసేస్తే అని ఆలోచిస్తూ లేచాడు. దూరంలో పచ్చదనం కనిపిస్తున్న దిశలో అడుగులు వేయసాగాడు. అప్పుడు 'ఉప్పొంగి పోయింది గోదావరి! తాను తెప్పన్న ఎగిసింది గోదావరి' అని గుసగుసగా అని నవ్వకూడని తీరులో నవ్వాడు.

నాలుగైదు గ్రద్దల నీడలు తన చుట్టూ గస్తీ తిరుగుతుండటం చూసి వేగంగా నడవబోయి నేలమీద కూలబడ్డాడు. మళ్ళీ కుదుట పడి నడవసాగాడు. అతనికి కొద్ది దూరంలోనే ఏదో ఒక పాడుబడ్డ బావి, దాని నిండ వరద తెచ్చిన ఎర్రటి నీళ్ళు నిలబడ్డాయి.

నీళ్ళు దొరికాయని అరుస్తూ, నీరసంతో తూగుతున్న శరీరంతో నెమ్మదిగా ఒక్కొక్క మెట్టు కిందికి దిగి ఒకసారి మునిగిలేచాడు. ఒంటికంటిన బురద నీళ్ళలో కలిసింది. అతని ఒంట్లో ఎక్కడ చిక్కుకున్నాయో ఏమో ఒకటి రెండు చచ్చిన చిన్న చేపలు, కొండీలు

లేని పీతలు, సగం తెగిన జఱ్ఱిపోతు. అన్ని నీళ్ళల్లో తేలి క్రమంగా మునిగాయి. నాలుగైదుసార్లు మునిగి లేచే సమయానికి చావు నుంచి బయటపడిన ఒక కొత్త అనుభవం కలిగింది. గొంతులో కఫంతోపాటు ఉన్న బురదను నీటి సహాయంతో క్యాకరించి బయటికి ఉమ్మాడు. మూడుసార్లు బిగ్గరగా తుమ్మి, చీదిన తరువాత ముక్కు వాయు సంచారాన్ని నిరాటంకంగా నిర్వహించసాగింది. కొంతసేపు అలాగే వంగి తేటపడుతున్న నీటిలో తన ప్రతిబింబాన్ని తాను చూసుకున్నాడు. ఇప్పుడు బతికివున్నది తానేనా అనే అనుమానం కలిగింది. జమీందారి గారి కొడుకుని వరద పీల్చి పిప్పి చేసిందని అనుకుంటూ ఒక్కొక్క మెట్టెక్కి పైకి వచ్చాడు. కళ్ళను ఆక్రమించిన శవాలు రాశి. కుళ్ళిన శవాల వాసన ముక్కును తాకినట్టయి వాంతికి వచ్చినట్టయ్యింది. పొట్టలో ఏమైనా ఉండివుంటే వాంతి అయ్యేదేమో?

**సూ**రిబాబు మాటలు విని నాన్న పెళ్ళిని ఆపాల్సింది. చలువయ్య కూతురు కమలను నా నుంచి దూరంగా పెట్టడం కోసం, హడావుడిగా నా పెళ్ళి చేయబోయి నాన్న అందరిని మృత్యువు నోట తోశాడు. రెండేళ్ళ క్రితం తుపాను వస్తుందని రేడియోలు అప్పట్లో ప్రకటించినా కొంచెం కూడా గాలి వీచలేదు. దాన్ని గుర్తుచేసుకుని నాన్న ఇప్పటి తుపానును నిర్లక్ష్యం చేసివుండొచ్చు. లడ్డు, జిలేబీల కోసం తమ ఒకటిన్నర ఎకరాల ఇంటి ముంగిట్లో గుమిగూడిన ఐదు గ్రామాల పిల్లల గుంపు, ఆడవాళ్ళు, మగవాళ్ళు, పండు ముసలివాళ్ళు, నది పిచ్చి ప్రవాహంలో కొట్టుకునిపోయి ప్రాణాలు వదిలేటప్పుడు ఎంతగా తిట్టుకున్నారో ఏమో? నాన్న జనాన్ని చావు నోటికి తోశాడు. తాను ప్రాణాలతో వుండటం పట్ల అతనికి జుగుప్స కలిగింది. తాను బతికి ఉండకూడదని అనుకున్నాడు.

పొలంలోని కల్లంలో తూర్పారబట్టిన నాలుగైదు వందల సంచుల వడ్లు సముద్రం పాలై ఇప్పుడు చిగురు వేస్తుండవచ్చు. జొన్నలు, గోధుమలు అన్నీ నేలపాలు. నేల నుంచి వచ్చింది నేలను చేరింది, అంతే! పెళ్ళయిన తరువాత గుంటూరు సాగించ వచ్చునని తోటలో నలభైవేల కొబ్బరికాయలను మొన్ననే లెక్కపెట్టడం జరిగింది. 'చట్నీ చేసుకుంటాం.. ఒక్క కాయ ఇవ్వు దొర' అని అడిగిన పొలంలో పనిచేసే కురుప నల్లటి ఒంటిమీద నాన్న 'ఒక్కటెందుకు ఇరవై ఇస్తాను తీసుకో' అని తన చేతిలోని బెత్తంతో లెక్కపెట్టి కొట్టాడు. 'నాన్నా ఐదారు పల్లెల రైతులను దోచుకుని నువ్వు కూడబెట్టిన సొమ్ము ఇప్పుడెక్కడ ఉంది?' అని తనపాటికి తాను మనసులో బిగ్గరగా అరిచాడు.

జేబులో పిస్తోలు పెట్టుకుని గుర్రం మీద గాసగాళ్ళను వణికిస్తూ తిరుగుతున్న ఆరడగులకన్నా ఎత్తుగా ఉన్న తన తండ్రి ఇప్పుడు ఈ బురదలో ఎక్కడ ఉన్నాడో? క్రౌర్యంతో దృఢంగా పెంచిన అతని దేహాన్ని గ్రద్దలు తిన్నాయో లేదా సముద్రపు మొసళ్ళ, తిమింగిలాలు మింగాయో? హింసతో పోషించింది హింసతోటే నాశనమవుతుందని అతను ఆలోచిస్తూ గాలికి దొర్లిన ఏదో ఒక చెట్టు కింద నిట్టూర్పు విడుస్తూ కూర్చుని పైకి చూశాడు. అక్కడ ఒక కొమ్మ మీద కూర్చున్న గ్రద్ద ఒకటి తన ముక్కును కొమ్మకేసి రాస్తోంది. శవాన్ని కడుపు నిండా తిని మొద్దుబారిన ముక్కును చెట్టుకొమ్మకు రుద్దుతూ తిన్నది అరగించుకుంటూ మళ్ళీ శవం వైపు ఎగరటానికి సిద్ధమవుతోంది. ఒకవేళ అది తననూ శవంగా భావించి తనపైకెగిరితే దానితో పోరాడటానికి తనవల్ల సాధ్యం కాదని అతను లేచి మళ్ళీ ముందుకు నడిచాడు. చావు పట్ల భయం వున్నప్పుడు చెట్లు నీడ కన్నా మండే ఎండే చల్లగా అనిపిస్తుంది.

■■■

**ని**జానికి ఆ స్థలం మనుషులతో కిటికిటలాడుతోంది. లెక్క లేనన్ని బస్సులు, జీపులు, కార్లు దుమ్ము రేపుతూ తిరుగుతున్నాయి. బురదలో కుళ్ళి ఉబ్బుతున్న శవాల మధ్య బతికి వచ్చిన అతనికి ఉన్నట్టుండి ప్రాణాలున్న మనుషుల దగ్గరికి వెళ్ళటానికి భయం వేసింది. పొట్టలో ఏదో తీవ్రమైన ఆకలి. తినడానికి ఏదైనా ఇవ్వమని అడగటానికి అతని మనస్సు అంగీకరించలేదు. చెట్టుమొద్దు పక్కన ముడుచుకుని కూర్చున్న జనం వైపు చూపులు సారించాడు. వాళ్ళు బరబరా లాగి పారేస్తున్నారు. అది ఏమైవుండొచ్చని ఆలోచించినప్పటికీ అర్థం కాలేదు. కొంచెం దగ్గరికి వెళ్ళి చూస్తే అర్థమవుతుంది. వారి కంట పడితే తననూ బరబరా లాగిపారేయవచ్చు. ఇన్ని చావుల మధ్య నువ్వు ఎలా బతికావు అని అడిగితే ఏమని చెప్పాలి? వాళ్ళు తనను చావటానికి ఒత్తిడి పెట్టవచ్చు. అలా ఏమైనా జరిగితే అది నాన్న చేసిన ఎన్నో హత్యల ప్రతిఫలం అనుకోవాలి. తనకు నచ్చనివారిని అతను ఎంత సులభంగా చంపించి వేసేవాడు! 'ఈ కోటేశ్వర రావు ఎదుట తలెత్తుకుని తిరిగే మగవాడు ఎవరు?' అని తాగిన మత్తులో ఆయన అనటం స్వయంగా ఈ చెవులు విన్నాయి. తాను భయపడుతూ ప్రతిఘటించినప్పుడల్లా అతను వీపు నిమురుతూ "బుజ్జినాన్నా, మనది జమీందారుల వంశం. హత్యాగిత్య చేయకుండా ఉంటే, ఎనిమిది, పదిమంది వేశ్యలను ఉంచుకోకపోతే మనకు గౌరవం ఉండదు. మన గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే ఇలాంటివన్నీ చేయాల్సిందే. నా తాత సీతారామరాజు హేమాహేమీలను చంపి సెహబాష్ అనిపించుకున్నాడు. ఇలాంటివాటికంతా భయపడే పిరికివాళ్ళు మన వంశంలో పుట్టకూడద'ని అనేవాడు. అందువల్ల నాన్న ముఖాన్ని చాలా రోజులకొకసారి చూసేవాడు. ఎంతోమందిని బెదిరించి వణికించేవాడు. అదే నాన్నకు ఊళ్ళను ముంచేస్తూ, సమస్తాన్ని కొట్టుకునిపోతూ, తోసుకునిపోతూ ఉధృతంగా వచ్చిన దివిసీమ వరదను ఎదుర్కోవటానికి ఎందుకు సాధ్యం కాలేదు?

**జ్ఞా**పకాల దాడికి నవ్వు వచ్చింది. నవ్వాడు. తాతముత్తాతలు చేసిన ఎన్నో పాపాల కారణంగా పుట్టినవాడు తాను. తన ఒంట్లో ప్రవహిస్తున్నది అదే పాపపు రక్తం. క్రౌర్యపు రక్తం అనుకునే సమయం వచ్చింది. ఏదో భయపు దాడికి చెమర్చుతున్న ముఖాన్ని

తుడుచుకున్నాడు.

అంతా అన్‌లోడ్ చేసి వ్యాన్ అక్కడి నుంచి కదిలింది. ఏమై వుండొచ్చని రాశి ఉన్న స్థలానికి వెళ్ళి చూశాడు. అక్కడ ఉన్నవన్నీ కేవలం శవాలు. దుర్వాసనను భరించలేక ముక్కు మూసుకుని కళ్ళను మరింత విశాలంగా తెరిచి చూశాడు. ఉబ్బిపోయిన వేలాది శవాల కుప్ప ఒకటి భారీ వ్రణంలా కనిపించింది. సాయంకాలపు మసక వెలుతురులో నోరు తెరుచుకున్న అవి మరింత వికారంగా కనిపించాయి. చూడలేక కళ్ళు మూసుకున్నాడు. శవాల చోటు నుంచి ప్రాణాలతో తిరిగివచ్చిన తాను ఇప్పుడు శవాలకు బెదిరితే, అసహ్యపడితే, అపహాస్యానికి గురికావలసి వస్తుందని గుండెను రాయి చేసుకుని కళ్ళు తెరిచాడు. తాను బతికినట్టే, ఈ శవాలకు ఇప్పుడు ప్రాణం వచ్చి అవి బతికితే తన దేహంలో ఉన్న ప్రాణానికి విలువే లేనట్టు అవుతుందని అనిపించింది. ఈ శవాల రాశిలో తన వారి శవాలను వెతకాలనిపించింది. కమ్ముకుంటున్న చీకటి నడుమ శవాల రాశిలో తనకు కావలసిన శవాలను వెతకటం సమంజసం కాదనిపించింది. శవాలు దొరికితే తీసుకుని ఏం చేయాలి? లక్ష్మి శవం దొరికితే? లక్ష్మి గుర్తుకొచ్చినపుడు అతని కళ్ళ వెండి టపటపమని కన్నీళ్ళు రాలాయి.

**పు**రోహితులు మంత్రాలు చెప్పేటప్పుడు పెళ్ళికొడుకుగా కూర్చున్న తాను ఓరకంట తలొంచుకుని పక్కనే కూర్చున్న లక్ష్మి వైపు చూశాడు. వంగిన విల్లులాంటి కనుబొమల కింద పెద్దపెద్ద కళ్ళు వందలాది సుందర స్వప్నాలను నింపుకున్నాయి. అందు కోసమే ఆమె నిండు బుగ్గల్లో చేరుతున్న రక్తం కిందికి దిగటం లేదు. అక్షతలు వేసే సాకుతో తొడను గిల్లినప్పుడైతే ఆమె లావాటి ఎర్రటి పెదవులు కంపించి కోరికలకు కొమ్ములు ఏర్పరుస్తున్నాయి. అప్పుడు ఆ కోరికలన్నీ గోదావరి వరదపాలై సముద్రపు ఉప్పునీటిలో చేరిపోయాయి. ఇలా ఆలోచిస్తూ అతను మళ్ళీ కోరికలను అణచివేస్తున్నట్టు శవాలను చూశాడు. ఒక్కొక్క శవంలోనూ ఎన్నో కోరికలు, వ్రణాలై వుండొచ్చని అనిపించింది. ఇప్పుడు తన పొట్టలో భయంకరంగా మారుతున్న ఆకలిని వీలైనంత తొందరగా తీర్చకపోతే బతికివుండే సంభవం మరీ తక్కువని ఒక్కొక్క శవాన్ని దాటుకుంటూ మాటలు వినిపిస్తున్న వైపు నడవసాగాడు.

పిరమిడ్ ఆకారపు ఏడెనిమిది గుడారాలు భయంకరమైన శబ్దాలతో నిండి వుండటం గమనిస్తూ అతను ఓడిపోయిన ముఖాల మధ్య పాలిపోయిన ముఖాన్ని చేర్చాడు. నంగిగడ్డ జమీందారు కోటేశ్వరరావు గారి చిరంజీవులు, చిన్నదొర అని ఎవరూ గుర్తించరు. ఇది ఏ ఊరో ఏమో? ఇది అపరిచితుల జనుల మధ్య ఉండటం ఉత్తమం అనిపించి నిరాశ్రితుల ముఖాలను చూశాడు. గంజి కోసం ఎదురుచూస్తూ నిలుచున్న వారిలో ఎంతోమంది ధనవంతులు ఉండొచ్చు. జమీందారులు ఉండొచ్చు. బీదాబిక్కి ఉండొచ్చు. అందరూ ఒకే దిగులుతో బాధ పడుతున్నారు. తుపాను ఇలాంటి సమానత్వాన్నయినా కల్పించింది కదా! అంతే చాలు. మొత్తానికి అందరూ ఏదో ఒకటి పోగొట్టుకున్నవారు. అందరి ఖాళీ పొట్టల నిండా కాల్చే దుఃఖం నిండివుంది. మైళ్ళకొద్దీ నిలిచిన బురదలో ఇక్కడున్నవారి భార్యల శవాలు వుండొచ్చు. కాళ్ళుచేతులు కదల్చని పసిబిడ్డలు ఉండొచ్చు. మొరగని, కరవని ప్రియమైన కుక్కలు ఉండొచ్చు. బక్కెట్ల కొద్దీ పాలు ఇచ్చే గేదెలుండొచ్చు. తూర్పు సీమ వృషభాలు ఉండొచ్చు. తరాలకు చేతికర్రల్లాంటి వృద్ధుల శవాలు. అంతేకాకుండా మూసిన పెట్టెలు, చెరువులు, ఇళ్ళు, మఠాలు ఉన్నాయి. పాములు, తేళ్ళు బురద లోపల ఊపిరి తీసుకుంటున్నాయి. తానూ అదే చల్లటి బురద నుంచి బతికి రావటం గుర్తు చేసుకుని వణికాడు. బతికి బయట పడ్డ తరువాత అతను ఆంధ్రకు చెందిన తీర ప్రాంతం నుంచి దూరంలోని ఎడారికి వెళ్ళి ఉష్ట్రపక్షిలా ఉన్నచోటనే భయం లేకుండా ఉండాలని కుదుటపడ్డాడు. గుడ్డపీలికల్లాంటి జనం గబగబా పరుగెత్తి వరుసగా నిలబడేవారు. వెనుక ఖాళీ డ్రెస్సు తొడుక్కున్న నలుగురైదుగురు తమతమ చేతుల్లో ఉన్న లాఠీకర్రతో తోస్తున్నారు. వీళ్ళు పోలీసులు కావచ్చనుకుంటూ తానూ వరుసలోని ఒక చివరన నిలబడి ఎదురుచూడసాగాడు. వరుస కదలసాగింది. గుడారం తలుపు దగ్గర కూర్చున్న ఒకడు పేర్లు రాసుకుంటున్నాడు. మరొకడు సిల్వర్ ప్లేటు, చెంబు ఇస్తున్నాడు. తాను వెళ్ళాలా? వద్దా అని ఆలోచిస్తున్నాడు. వెనుక వరుస పెరుగుతూనే ఉంది. ఇష్టంలేని మనస్సుతో తలుపు దగ్గరికి వచ్చినపుడు రాసుకుంటున్న వ్యక్తి పేరేమిటని అడిగితే మౌనంగా కళ్ళప్పగించి చూశాడు, అంతే. మూగవాడు అని తమలో తాము గొణుక్కున్నారు. ప్లేటు, చెంబు ఇచ్చారు. క్యూలో నిలుచున్నాడు. రెండు కప్పుల గంజి తాగిన వెంటనే ఒంట్లో ఎవరో చేరుకున్నట్టు పొట్ట శాంతించింది.

■■■

**ఎం**తసేపటి చీకటో? ఏమో? అతను నిద్రపట్టకుండా దొర్లాడు. కట్టుకున్న పంచె విప్పి ఒళ్ళు ముడుచుకుని కప్పుకున్నా దోమలు కరవకుండా వదిలేవి కావు. పటపటమని కొడుతూ, పరపరమని గీరుకుంటూ, పక్కకు దొర్లసాగాడు. తను ఎన్నడూ ఇంత అనాథలా పడుకున్నవాడు కాడు. కళ్ళల్లో ఏవో చిత్రాలు రూపొంది కదిలిపోతున్నాయి. పండు ముసలివాళ్ళ మాదిరి మసకబారుతున్న కళ్ళు. ఒళ్ళంతా అపరిచితమైన బాధ తనను తాను పరిచయం చేసుకోసాగింది. చిన్నగా నొప్పితోపాటు పొట్టను తొలచివేసినట్టు గుడగుడమని శబ్దం వినిపించసాగింది. కింద చల్లగా కోసే నేల. ఐదు నిముషాలు వర్షం కురిసి, ఆగిపోవటంతో ఇంతటి చలి!

ఆవులిస్తూ లేచి కూర్చుని నిర్జీవమైన చీకట్లో కళ్ళు వెడల్పు చేసుకుని చూశాడు. ఎన్నో మానవాకృతులు గోనెసంచులను కప్పుకుని వెచ్చగా పడుకునివుండటం కనిపించింది. అయ్యో... అమ్మా.. ఈ ఊం... ఊం... శబ్దాలు వింటూ అటువైపు చూశాడు. చెదిరిన మబ్బుల మధ్య మరీ వడలిపోయినట్టు, టి.బి. పేషంటు లాంటి చంద్రుడు కుంటుతూ సాగుతున్నాడు. కప్పుల బెకబెక

అసహనీయంగా  చెవులను గుచ్చుతున్నాయి. అతనికి తెలియకుండానే అతని ముక్కు నుంచి అనేక నిట్టూర్పులు ఊస్ ఉస్మంటూ జారి చీకట్లో కరిగిపోయాయి.

**మ**ధ్యాహ్నం తాను చెప్పినట్టు వినివుంటే ఇంతమంది ఇలా ఎముకలు కొరికే చలిలో ఒట్టి శరీరంతో పడుకునేవారు కాదని తనలో తాను అనుకున్నాడు. ఆ రోజు ఏదో ఒక దేశం ప్రవాహ పీడితులకు ఫ్రీగా పంచటానికి పంపిన వేలాది ఉన్ని శాలువాలు పంచే కార్యం పెద్ద గుడారంలో జరిగింది. అధికారి 'కడుపు కాలి చస్తుంటే ఈ ఉన్ని శాలువాలు తీసుకుని ఏం చేస్తారు? ఐదు రూపాయలు ఇస్తాం. తీసుకుని బొటనవేలి ముద్ర ఒత్తండి. ఆ మాటలు విని అందరూ గుసగుసగా మాట్లాడుకోసాగారు. గుంపులో ఉన్న అతను 'వాళ్ళు ఇచ్చే అయిదు రూపాయలు దేనికి సరిపోతాయి? ఈ చలిలో  ఒట్టి శరీరంతో పడుకోవటానికి కాదు. ఆందుకే ఐదు రూపాయలు ఇప్పించుకోకండి. శాలువా ఇస్తే సంతకం చేయండి' అని గొంతు చిరిగేలా అరిచినా జనం చెవిన వేసుకోలేదు. ఐదు రూపాయలు తీసుకుని శాలువా తీసుకున్నట్టు సంతకం చేశారు. ఆ అధికారులు రెండు లారీలలో శాలువాలు నింపుకుని గుంటూరు బట్టల కొట్టులో అమ్మేశారు. పరిహార సమితి అధ్యక్షులైన ఎంఎల్ఏ (రాజకీయ నాయకుడి) చేతివాటం ఉందని విన్నాడు. బంగాళాఖాతంలోని మనిషెత్తు అలలకన్నా, గోదావరి వరద కన్నా, గంటకు వందమైళ్ళ వేగంతో వచ్చే తుపానుకన్నా నష్టపరిహారం సాకుతో ఇక్కడ వేసుకున్న గుడారాలలో జరుగుతున్న లంచగొండితనం చాలా ప్రమాదకరమని అతనికి అనిపించింది. తమలాంటి లక్షలాదిమంది నిరాశ్రితుల గురించి మొసలి కన్నీళ్ళు కార్చి జేబులు నింపుకునే వారిపట్ల అతను పటపటమని పళ్ళుకొరికాడు. లక్షలాది మంది వరద బాధితులు కొద్దిమందికి మాత్రమే అపారమైన లాభదాయకమైన రీతిలో చనిపోతున్నారని  అనుకున్నాడు.

ఈ సమస్యల మధ్య ఉంటే నిద్ర పట్టదు. వ్యథచెందటంలోనే తెల్లవారింది అనుకుంటూ పశ్చిమం వైపు చీకట్లో అడుగులు వేశాడు. పదడుగులు నడవలేదు. 'వద్దు...వద్దు...' అని ఏడుస్తున్న స్త్రీతో 'సూడు పిల్లా' అంటున్న మగవాడి కంఠమూ వినిపించింది. ఈ సమయంలో ఏం జరిగివుంటుందా అనుకుంటూ అటువైపు నడిచాడు. కొద్దిదూరంలో దిబ్బ ఒక్కన మండుతున్న మంట వెలుతురులో ఇద్దరు మగవాళ్ళు ఏడుస్తున్న ఆడదానితో ఏదో బేరమాడుతున్నాడు. లాంతరు పట్టుకున్న ఒకడు దిక్కులు చూస్తూ నిలుచున్నాడు. మరొకడు ఏడుస్తున్న ఆడదాని భుజం పట్టుకుని లాగుతూ, 'ఒప్పుకో.... నీ కెవరూ దిక్కులేదు. దొర నీకు కడుపు నిండా అన్నం పెట్టి చేతి నిండా డబ్బులు ఇస్తాడు. లేకపోతే నువ్వూ ఈ శవాల్లా కొట్టుకుని పోతావు' అని అంటున్నాడు. ఆమె విదిల్చుకుంటూ  'వద్దు వద్దు' అని ఏడుస్తోంది. ఆమె సుమారు ఇరవై ఇరవై రెండేళ్ళ యువతి. ఒంటిమీద సరిగ్గా బట్టలు లేవు. వారి పక్కన శవాల రాశి ఉంది. మరుగున నిలబడి చూస్తున్న అతనికి తాను వెళ్ళి ఆమెను ఆ విషవలయం నుంచి విడిపించాలనిపించింది. వెళ్ళాలా వద్దా అని ముందూ వెనుకలు చూస్తున్నంతలో ఆమె ఒళ్ళు అప్పగించటానికి అంగీకారం తెలిపినట్టు అనిపించింది. ఆమెను లాంతరు వెలుతురులో కొంత దూరం నడిపిస్తూ, చీకట్లో కరిగిపోయారు. ఇదంతా చూస్తున్న అతనికి ఈ గుడారాలకు నిప్పు పెట్టాలన్నంత కోపం వచ్చింది. పిడికిలి బిగించి, పళ్ళు బిగపట్టి వెలుతురు కక్కుతున్న గుడారాన్ని చూశాడు. తన తండ్రి తోటయింటిలో ఎంతోమంది ఆడకూలీలను పాడుచేయడం చూసి కూడా చూడనట్టు వెళ్ళిపోయిన తనపట్ల తనకే అసహ్యం వేసింది. తండ్రి క్రూరత్వం, వ్యభిచారం, పీడనకు వ్యతిరేకంగా గొంతు ఎత్తకుండా బతికిన తాను చనిపోయివుంటే బాగుండేదని అనుకున్నాడు. చావు మడుగులోంచి బతికి బయటికి రావడం వల్ల ఈ ప్రపంచాన్ని భరించాలని నడవసాగాడు. ఇక్కడ శవాలకన్నా బతికివున్న జనమే ఎక్కువ భయంకరమని అతనికి అనిపించింది. ఈ గుడారాల నుంచి చాలా దూరం వెళ్ళి పడుకోవాలని వేగంగా నడిచాడు. కొద్దిసేపు నడిచిన తరువాత ఆయాసంగా అనిపించింది. అక్కడే గట్టినేలను చూసి నేలమీద వాలాడు. చప్పున నిద్ర కమ్ముకుంది.

■■■

**క**ళ్ళు తెరిచి బురదను చెక్కలు కట్టించేలా నెత్తిని  సమీపించిన సూర్యుడు భగభగమండుతున్నాడు. ఇంతసేపటి వరకూ చచ్చిన వాడిలా పడుకున్నాడుకదా అని లేచి కూర్చుని ఆవులిస్తూ చుట్టూ చూశాడు. నిరాశ్రితుల కోసం వేసిన గుడారాల నుంచి చాలా దూరం వచ్చినట్టు అతనికి అనిపించింది. పొట్టలోపల ఆకలి దాడి చేసి ఎంత సేపయిందో? లేచి నిల్చున్నాడు. ఒక్క క్షణం ఒళ్ళు గిరగిరా తిరిగి మళ్ళీ సర్దుకుంది. ఏదో దిక్కులో నడవసాగాడు. కాలు కొరికే జవుగుమట్టి నేలలో అప్పుడప్పుడు ఆగి ఆగి నడిచాడు. పశ్చిమ దిశలో వీస్తున్న గాలి అంతటా కాకులు, గ్రద్దల శబ్దాలు, ఒక విధమైన వాసన, శవాలు! అటువైపు కొన్ని అడుగులు వేస్తే వందలాది శవాలను చూడొచ్చు. అమ్మా, నాన్న, లక్ష్మి, చలువయ్య... ఇంకా ఎన్నో శవాలు గుర్తు దొరకనట్టు కుళ్ళిపోతుండవచ్చు. తూర్పు వైపు తిరిగి నడవసాగాడు. ఇంకా ఎంత దూరం నడవాలి? మామ ఉన్న ఘంటసాల చేరితే బతకవచ్చు. అయితే ఆ ఘంటసాల ఎటువైపు ఉందో ఏమో? ఈ స్థితిలో నన్ను ఎవరూ బస్సు ఎక్కించుకోరు. కేవలం నడిచే వెళ్ళాలి. దొర్లిపడివున్న ఒకటి రెండు చెట్ల మొద్దుల దగ్గర నిల్చుని ఎలా దాటాలా అని ఆలోచిస్తున్నాడు. బర్రుమనే శబ్దం విని తిరిగి చూశాడు. ఒక జీపు దగ్గరికి రావటం చూసి చెట్లు చాటుకు జరిగి దాక్కున్నాడు. అతనికి ఒకటిరెండు బారల దూరంలో అది గబుక్కున నిలిచింది. అందులోంచి ఒకరిద్దరు కిందికి దూకారు. వాళ్ళు వేసుకున్న తెల్లటి బట్టలు చూస్తే డాక్టర్ల మాదిరి కనిపిస్తున్నారు. ఈ నిర్జన ప్రదేశంలో వాళ్ళేం చేయడానికి వచ్చారనే కుతూహలం కలిగింది. ఒకడు డ్రైవర్‌కు ఏదో చెప్పిన తరువాత జీపు బురదలో జలతారు చీరబార్డర్‌లా రెండు సమానాంతర

గుర్తులను ఏర్పరుస్తూ దక్షిణం వైపు పరుగుతీసింది. కుతూహలంతో కళ్ళు విప్పార్చుకుని అటు వైపు దృష్టి పెట్టాడు. అంతలో వాళ్ళిద్దరూ ప్యాంటులు విప్పి ఒక బండ మీద పెట్టారు. కేవలం డ్రాయర్‌తో ఉన్న వాళ్ళు తమ చేతుల్లో ఉన్న పొడవైన కర్రల సహాయంతో బురదలో నడవసాగారు. ఆ బురదలో వాళ్ళు ఏదో వెతుకుతుండవచ్చని చెట్టు మొద్దు పక్కన నిల్చుని చూస్తున్న అతను ఆలోచించసాగాడు. అయితే అర్థం కాలేదు. శవాల దగ్గర డాక్టర్లకేమి పని?

కొద్ది దూరం మోకాలు మట్టం ఉన్న బురదలో వెళ్ళిన వాళ్ళు బురదలో కర్రను గుచ్చి ఏదో తీస్తున్నారు. బురద నుంచి కొన్ని శవాలను లాగి ముట్టి ముట్టి చూశారు. మళ్ళీ బురదలోంచి శవాలను లాగుతూ – ఇలా పదిహేను నిముషాలు గడిచి వుండొచ్చు. బురద నుంచి ఒక శవాన్ని లాగి, ముట్టి చూసి, 'దొరికిందిరా ఇక్కడ... రా...రా... త్వరగా రా' అని అరిచి కొంత దూరం పోయిన మరొకడిని పిలిచాడు. వాడు పిలవటం విని మరొకడు బురదలో పడుతూ లేస్తూ పరుగెత్తుకొచ్చి సగం మునిగిన శవాన్ని తానూ ముట్టి చూసి ముఖం విప్పార్చుకున్నాడు.

ఆ శవాన్ని బురద నుంచి లాక్కుని రావటం చూశాడు. ఆ శవాన్ని బురద నుంచి లాగటానికి వాళ్ళు కష్టపడుతున్నారని అనుకున్నాడు. వాళ్ళకు సహాయం చేయాలని అతనికి అనిపించింది. వారి ముఖాల్లో ఉన్న కలవరం చూస్తే తనను బురదలో తొక్కినా తొక్కవచ్చు. వాళ్ళ కంట పడకుండా, ఇలాగే ఆలోచిస్తూ అతను భయం, కుతూహలాలతో మునివేళ్ళపై నిలబడి చూస్తుండగా వాళ్ళు శవాన్ని గట్టినేలకు లాక్కుని వచ్చేసారు. అది ఎవరి శవం అయివుండొచ్చని తొంగి, తొంగి చూశాడు. వాళ్ళు శవాన్ని వెల్లికిలా పడుకోబెట్టి ఒళ్ళంతా అంటుకున్న బురదను తొలగించటం స్పష్టంగా కనిపించింది. అది లక్ష్మి శవమా? లేదా చలువయ్య కూతురు కమలదా? లేదా ఇంకెవరిదోనా? మొత్తానికి వయసులో ఉన్న ఒక యువతి శవం అనటంలో సందేహం లేదు. వాళ్ళిద్దరూ ఆ ఆడమనిషి ఉబ్బిన శవం మీద ఆత్రంగా చేతులు కదిలిస్తున్నప్పుడు కొన్ని గద్దల నీడలు వర్తులాకారంలో నేలమీద తిరగసాగాయి. చూడటంలో మైమరిచిన అతను తనకు తెలియకుండానే కాస్త ముందే కళ్ళను పూర్తిగా తెరిచాడు. వాళ్ళిద్దరూ శవం చెవుల నుంచి, మెడలోంచి ఏదో తీస్తుండటం కనిపించింది. వాటిని వాళ్ళు మట్టిలో కసకసమని రుద్ది బట్టలకు తుడుచుకోగానే బంగారం తళతళ మెరవసాగింది. శవాల ఒంటి మీదున్న బంగారం కోసం ఆ దుర్మార్గులిద్దరూ ఈ కార్యానికి పూనుకున్నారని అనుకున్నాడు. చెవులు, మెడలో ఉన్న నగలను తీసుకున్నంత సులభంగా ముక్కుకున్న నతును తీయటం సాధ్యం కాలేదు. ఒకడు గట్టిగా లాగిన ఫలితంగా తెగిన ముక్కుతో పాటు నత్తు ఊడి వచ్చింది. వర్తులాకారంలో తిరుగుతున్న గ్రద్దల నీడ పెద్దదవుతూ పోయింది. బర్రుమని వీస్తున్న గాలిలో అదోలాంటి శబ్దాలు. సముద్రపు దిక్కులో నల్లటి పెద్దపెద్ద మబ్బులు ఏదో దురుద్దేశంతో గుంపులు గుంపులుగా వస్తున్నాయి. ఏదో విధంగా కష్టపడి చేతులకు ఉన్న బంగారు గాజులను అప్పటికే ఊడబెరికి జేబులో తోసుకున్నారు. కొద్ది దూరంలో కూర్చున్న గుడ్లగూబ 'గూగుక్...' అని వికారంగా అరిచి టపటపమని రెక్కలు కొట్టుకుంటూ ఎగిరిపోయింది. దాని వైపు వారి దృష్టి పోయినట్టు కనిపించలేదు. బాగా అలసిపోయిన వాళ్ళు శవాన్ని దొర్లించసాగారు. శవం నడుముకు కట్టివున్న పట్టీని లాగటంలో విఫలమైన ఒకడు మరొకటి ముఖాన్ని చూశాడు. ఉబ్బిపోయి వికారంగా తయారైన శవం అంత సులభంగా నడుము పట్టీని విడదీయగలిగే స్థితిలో లేదు. ఇద్దరూ ఎంత ప్రయత్నించినా రాలేదు. దాంతో ఇద్దరూ శవానికి చెరో వైపున నిలబడి శవానికి తలా ఒక కాలును ఊన్చి, పట్టీని పట్టుకుని 'హూఁ హూఁ ' అంటూ బలంగా లాగసాగారు. అతను కళ్ళను తెరిచినట్టే నోరు తెరిచాడు. వాళ్ళిద్దరూ తమ తమ శరీరంలోని శక్తినంతా ఉపయోగించి గట్టిగా లాగారు. టపాసు పేలినట్టు పెద్ద శబ్దం వినిపించింది. అతను 'అబ్బా' అని అరిచి ఒక్క క్షణం కళ్ళు మూసుకుని తెరిచాడు. చీములాంటి ద్రవం శవం పొట్టలోంచి వారి ముఖాల మీదికి చిమ్మింది. పట్టీని పట్టుకున్న వాళ్ళు ముఖం మీద పడిన ద్రవాన్ని తుడుచుకుంటూ బిగ్గరగా అరిచిన అతనివైపు చూసి బెదిరిపోయారు. తనను పట్టుకోవాలని తన వైపు పరుగెత్తుకొస్తున్న ఆ రాక్షసులను చూసి అతను తూర్పు దిక్కులో పరుగెత్తసాగాడు. కొంత దూరం పరుగెత్తి అతను 'అబ్బా' అని అరిచి పడిపోయాడు.

ఆకాశాన్ని కౌలుకు తీసుకున్నవాటిలా మబ్బులు అప్పటికే ఎక్కడ పడితే అక్కడ గుమిగూడాయి. ■


## తెలుగు భారతి కథల పోటీ

తెలుగు భారతి సంస్థ నిర్వహిస్తున్న కథావిరించి కథల పోటీ నిర్వహిస్తోంది. కథల్లో కొత్తదనంతో పాటు కథా కథనమూ, చదివించే గుణమూ వుండాలి. కథాంశం, కథ నిడివి విషయంలో ఎలాంటి పరిమితులూ లేవు. అయితే ఏ వర్గాన్ని కించపరిచే కథలు స్వీకరించబడవు. బహుమతుల వివరాలు : ప్రథమ బహుమతి : లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి : రూ.50 వేలు, తృతీయ బహుమతి : రూ.30 వేలు. పాల్గనే వారు కథలను ఈ కింది ఈమెయిల్ కు 05 -01-2023వ తేదీ లోపు పంపాలి.

email : telugubharathi2021@gmail.com






# ఓ చరిత్రకారుని జీవిత ప్రగతి పతాక

- తెలకపల్లి రవి

తెలుగునాట ప్రగతిశీల చరిత్రకారుల్లో ప్రసిద్ధులైన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ తన సంక్షిప్త ఆత్మకథకు 'నన్ను నడిపించిన చరిత్ర' అని పేరు పెట్టుకున్నారు. తను నడచిన చరిత్ర అనీ, చరిత్రతోనే తన నడక ముడిపడివుందని ఆయన భావన. వాస్తవానికి నడిపించినది లలిత అన్న కృతజ్ఞత ఈ పుస్తకం పొడుగునా కనిపిస్తుంది. ఆయన రాసిన రాయించిన అనేక చరిత్ర పరిశోధన పుస్తకాలే గాక ఈ ఆత్మకథా శకలాలు కూడా ఆమె ఆకాంక్ష మేరకే రాశానన్నారు. మిత్రులూ, శ్రేయోభిలాషులూ, పరిచయస్తులనే తనకున్న వెల కట్టలేని సంపదగా అభివర్ణించిన రచయిత – ప్రతి ఘట్టంలో వారిని పునర్దర్శనం చేయించారు. చరిత్ర రచనలో ఆరితేరినవారు గనక వాటిని వ్యక్తిగత అనుబంధాలుగానే గాక చరిత్రగతి తోనూ, సామాజిక పరిణామాలతోనూ కలగలిపి చెప్పగలిగారు. పెద్దగా వనరులు లేని ఒక సంప్రదాయ కుటుంబ యువకుడు ఆశయబలంతో ఉన్నత విద్యాశిఖరాలు అధిరోహించడం, అందుకు సహకరించిన జీవిత భాగస్వామిని లలిత ప్రేమాస్పద శ్రమాస్పద పాత్రనూ ఇందులో చూస్తాం. మేధావులను నిరుత్పాదక పాత్రధారులుగానూ, కుహనా జీవులుగానూ చెప్పే అసహన వాతావరణం నిండిన ఈ రోజుల్లో ఇరవయ్యో శతాబ్దిని ముందుకు నడిపేందుకు దోహదపడిన ప్రగతిశీల బుద్ధిజీవుల విలక్షణ పాత్రకు ఈ పుస్తకంలో విషయాలు అద్దం పడతాయి. ఎన్ని ఉన్నత స్థానాలు అధిరోహించినా తమకు తొలి ప్రేరణ అయిన అరుణ పతాకాన్ని, ఆ ఉద్యమాల స్ఫూర్తిని మరచిపోకపోవడం ఈ పుస్తకంలో మనం చూసే మరో విశేషం.

ప్రకాశం జిల్లా దర్శి తాలూకా రామభద్రాపురం కుగ్రామంలో 1938లో వకుళాభరణం రామకృష్ణ పుట్టారు. తాత, తండ్రి అర్చకులు. సంపాదన జీవికకు సరిపోక తండ్రి అప్పటి నెల్లూరు జిల్లాలోని పాకాల గ్రామానికి తరలివెళ్లారు. ఊళ్లో వున్న ఒక మాష్టారు దగ్గర చదువుకుంటుంటే అనుకోని ఘటనలతో కక్ష గట్టిన ఆయన చదువుకునే అవకాశం లేకుండా చేశాడు. దగ్గర్లోని కందుకూరుకు మారి అన్నయ్యతో పాటు తనూ చదువుకున్నారు. నాటి గ్రామీణ వాతావరణం, వృత్తి వ్యవసాయాలు సామాజిక జీవనం నుంచి జానపద కళల వరకూ చెప్పడం ఆయన పరిశీలనను, ఆసక్తిని తెల్పుతుంది. నాటి ఆటపాటలనూ అంతే ముచ్చటగా రాశారు. పెద్దవార య్యాక విదేశాలకు, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలకూ వెళ్లినప్పుడు కూడా ప్రత్యేకతలు అక్షరీకరిస్తూనే వచ్చారు. ఆచార వ్యవహారాల నుంచి కులమతాల సంబంధాలు అందరినీ గౌరవించాలనే నాన్నగారి నిర్దేశం కూడా గుర్తుచేసుకున్నారు. నెల్లూరులో రెండేళ్లపాటు చదువుకున్న 1948–50 కాలంలో సమాజాన్ని అర్థం చేసుకోవడం మొదలెట్టారు. అది కమ్యూనిస్టు పార్టీపై నిషేధం నడుస్తున్న కాలం. అన్నయ్య నరసింహా చార్యులు కూడా రహస్య యంత్రాంగంతో సంబంధంలో వున్నట్టు కనిపిస్తుంది. స్వాతంత్ర్య పోరాటం, సాహిత్య వికాసం వంటివాటికి పెట్టింది పేరైన నెల్లూరు జిల్లాలో నాటకాలకు, సినిమాలకు ఆదరణ ఎక్కువ. ఈ ప్రభావం కూడా పడింది. సింగరాయకొండలో ఆయన ప్రజానాట్య మండలి కళారూపా లు చూడగలిగారు. ఉపాధ్యాయ నేతలైన సింగరాజు రామ కృష్ణయ్య, చెన్నుపాటి లక్ష్మయ్య అక్కడే ఆయనకు కలిశారు. కమ్యూనిస్టు పార్టీకి అగ్నిపరీక్షా కాలమైన ఆ దశలో చారిత్రికాం శాలు, సైద్ధాంతిక పరిణామాలు కూడా గుర్తు చేశారు. కమ్యూ నిస్టు అభిమాని అయిన వారి నాన్న మూడో కుమారుడిని జోషీ అని పిలుచుకున్నారు.

తదుపరి దశలో ఆయన చైతన్యశీలమైన కావలి కాలేజీలో చేరడం జీవితంలో కీలక ఘట్టం. ఆచరణ, చైతన్యం, కొత్త

శక్తి సంతరించుకున్నాయి. విశ్వోదయ తర్వాత జవహర్ భారతిగాపేరు గాంచిన ఆ సంస్థ వ్యవస్థాపకుడైన డిఆర్ (దొడ్ల రామచంద్రారెడ్డి) కవి భుజంగరాయ శర్మ, కెవి రమణారెడ్డి వంటివారితో ఆయన మమేకమైంది అక్కడే. కళాభిరుచి మరింత ప్రగాఢమైంది. ఆ క్రమంలో ఆయన ప్రస్తావించే పేర్లు కళారూపాలు వింటే అభిరుచి వున్నవారెవరైనా తలలూప కుండా వుండలేరు. వీలైనంత ఎక్కువ మంది వ్యక్తులు, వారి పాత్ర పేర్కొనడం ఆయనలోని చరిత్రకారుణ్ని చూపిస్తుంది. 1952లో కమ్యూనిస్టుల ఘన విజయాలూ, 1955 మధ్యంతర ఎన్నికలు కమ్యూనిస్టు ప్రభుత్వ అవతరణపై ఆశలూ ఆశా భంగం.. ఆ పైన ఆంధ్ర యూనివర్సిటీలో రెండేళ్ల చదువు. విద్యార్థి ఫెడరేషన్ తరపున యూనియన్ ఎన్నికల్లో గెలుపు. సంరంభంగా సాగిన కార్యక్రమాలు వచ్చిన అభ్యుదయ వాదుల విశేషాలు ప్రతిదీ ఒక సినిమాలో ఫ్లాష్‌బ్యాక్‌లా సాగిపోతాయి. తర్వాత కావలి కాలేజీలోనే లెక్చరర్‌గా చేరడం ఒక ప్రత్యేకత. అప్పట్లో తన అధ్యాపకుడుగా వుండిన కెవి రమణారెడ్డి ఇప్పుడు బాగా సన్నిహితమయ్యారు. పెద్దగా తోడు నిలిచారు. ఈ పుస్తకంలో లలిత తర్వాత ఎక్కువగా కనిపించే పేరు ఆయనదే. ఆమె మొదటి కూతురు విద్యను మోస్తున్నపుడు విద్యా సంబంధమైన ఆహ్వానంపై వకుళాభరణం అమెరికా వెళ్లారు. అక్కడా ఇదేవిధమైన పరిశీలన. సిపిఎంలో నగ్జలైట్ చీలిక వచ్చినపుడు కెవిఆర్ అటువైపు మొగ్గగా వకుళాభరణం రామకృష్ణ తటస్థంగా ఉండిపోయారు. అప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలో చేరడం కన్నా తమ రంగంలో పనిచేస్తూ సహకరించ డమే మంచిదన్న సుందరయ్య గారి సలహాతో బోధనా రంగంలోనే కొనసాగారు. ఆ సందర్భంగా ఒక జాతీయ సెమినార్‌లో గొప్ప చరిత్ర పరిశోధకురాలైన రొమిలా థాపర్ ఆయనను బిపిన్ చంద్రకు పరిచయం చేస్తే, ఆయన జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చేరాలని సూచించారు. తగు సలహాలూ ఇచ్చారు. ముగ్గురు పిల్లల తండ్రిగా బోలెడు బాధ్యతలు మోస్తున్న వకుళాభరణం భార్య ప్రోత్సాహంతో 1972లో ఢిల్లీ బయల్దేరారు.

జెఎన్‌యు కాలాన్ని గురించి వకుళాభరణం రాసిన అంశాలు మరింత ప్రత్యేకమైనవి. కేంద్రంలోని బిజెపి పాల కులు అదో దేశద్రోహ శిబిరంలా చిత్రించడానికి కారణమేమి టో కూడా అర్థమవుతుంది. బిపిన్‌చంద్ర, ఫణిక్కర్, సతీశ్‌చంద్ర, హర్బన్స్ ముఖియా, థాపర్, ఇంకా ఎందరో ఉద్దండులు. భారతదేశ చరిత్ర అధ్యయానికి బాటలు వేసిన వారు. అవన్నీ గొప్పగావున్నా తిండితిప్పలు విషయంలో ఇబ్బందులు, థాపర్ సాయంతో ఒక తమిళ పరిశోధకుడికి తెలుగు చెప్పి 200 తెచ్చుకోవడం. అక్కడ అధ్యయనం వినూత్న బోధనా పద్ధతులు ,వామపక్ష వాతావరణం ఆయనను అమితంగా ఆకర్షించాయి. అక్కడ కందుకూరి వీరేశలింగం అండ్ హిజ్ టైమ్స్ ఎంఫిల్ థీసిస్ రాసి ఆ తర్వాత ఆపేద్దామనుకుంటే పెద్దల ఒత్తిడితో సర్వేపల్లి గోపాల్ పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంస్కరణ ఉద్యమాలు అన్న పిహెచ్‌డి పరిశోధన. ఇవి రెండూ కూడా తెలుగు వారి ప్రామాణిక గ్రంథాలుగా నిలిచిపోయాయి. ఈ సమయంలో పిల్లలను ఉద్యోగాన్ని చూసుకుంటూనే లలిత గారు కూడా లవణం హేమలత దంపతుల ప్రోత్సాహం సహాయంతో నేరస్త జాతులపై పరిశోధన పూర్తి చేశారు. విశేషమేమంటే కావలి జవహర్ భారతిలో లాగే జెఎన్‌యులో కూడా ఒక ఏడాది ఆయన బోధనా బాధ్యతలు నిర్వహించాల్సి రావడం. రెండేళ్ల తర్వాత ఆయన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రీడర్‌గా, తర్వాత ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈ కాలంలో రాజకీయ పరిణామాలు తెలుగుదేశం అధికారం లోకి రావడం, కేంద్రంలో పరిణామాలు పొందుపర్చారు. ఈకాలంలో పాలనాపరంగానూ, విద్యారంగంలోనూ అనేక కొత్త సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. తన పరిశోధక విద్యార్థులతోనూ వామపక్ష సాంస్కృతిక ఉద్యమాలపై అధ్యయనం చేయించడానికి దోహదపడ్డారు. పదవీ విరమణా నంతరం కొత్తగా స్థాపించిన నల్సార్ న్యాయ విద్యాలయాన్ని తీర్చిదిద్దడంలో భాగం పంచుకున్నారు. పూసల్లో దారంలా ఈ కాలమంతటా వచ్చిన రాజకీయ పరిణామాలు కూడా తన అభిప్రాయాలతో సహా రేఖామాత్రంగా చెప్పేశారు. మరో వైపున లలిత కలకత్తా విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఆమెకు తెలుగు అకాడమీలో ప్రత్యేక అవకాశం రావడంతో చాలాకాలం తర్వాత వారిద్దరూ ఒకే చోట వుండగలిగారు. నేరస్త జాతులు, దేవదాసి, మాతంగి, జోగిని వ్యవస్థ వంటి వాటిపై సాధికారిక గ్రంథాలు అందించారు. ఇంకా అనేక జీవిత చరిత్రలతో సహా నిరంతర వ్యాసంగం సాగిస్తూ వచ్చారు. 2010 నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ 2017లో కన్నుమూయడం వకుళాభరణంకు తీరని వెలితిగా మిగిలింది. వకుళాభరణం పెద్ద కుమారుడు రాజగోపాల్.. వెల్చేరు నారాయణరావు పర్యవేక్షణలో స్వీయ చరిత్రలు వలస కాలపు ఆంధ్ర సమాజంపై పరిశోధన చేసి ప్రస్తుతం నాన్న పనిచేసిన హెచ్‌సియులోనే అధ్యాపకులుగా ఉన్నారు. రెండో కుమార్తె విద్య భాషాశాస్త్రం అభ్యసించారు. చిన్న కుమారుడు వంశీచరణ్ అర్థశాస్త్రంలో పిహెచ్‌డి. వీరూ ఉద్యమాలతో సంబంధం వున్నవారే.

ప్రకాశం జిల్లాలో ఎక్కడో మారుమూల పేద అర్చక

కుటుంబంలో పుట్టిన వకుళాభరణం కుటుంబమంతా ఇంతటి అధ్యయన ప్రస్థానం సాగించడం, అందుకు లలిత గారు చూపిన దీక్షాదక్షతలు ఉత్తేజమిస్తాయి. ఇన్ని పరిస్థితుల మధ్యనా వారు ప్రగతిశీల లౌకిక వరవడిని చెక్కు చెదరనివ్వ కుండా చూడటం, రంజాన్ నాడు పుట్టిన మనవడికి ఇర్ఫాన్ అని పేరు పెట్టుకోవడం ఆకట్టుకుంటుంది. నాటి విద్యార్థులైన బివి రాఘవులు, మాజీ ఎంపి మాల్యాద్రి, శారద వంటి వారిని గుర్తు చేసుకోవడం, పరిశోధక శిష్యులు, సన్నిహితుల గరించి ఆర్ద్రంగా రాయడం వకుళాభరణంలో మానవీయ పార్శ్వాన్ని చూపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌లో ఆయన పాత్ర సుపరిచితమే! 1998లో పదవీ విరమణ తర్వాత రాష్ట్ర విభజన తెలంగాణ ఏర్పాటు వరకూ – మిత్రులు పరిశోధకుల సంస్థల ప్రోత్సాహంతో తెలుగు వారి సమగ్ర చరిత్ర ఎనిమిది సంపుటాలుగా ప్రచురించడం వకుళాభరణం కృషికి తారాస్థాయి.

ప్రగతిశీల మేధావుల ఆత్మకథలు తెలుగులో తక్కువే. వకుళాభరణం రామకృష్ణ అనుభవంతో అధ్యయనంతో జీవిత పోరాటంతో పండిన దశలో రాసిన ఈ జ్ఞాపకాలు, ఆయన భాష శైలి అన్నిటినీ మించి ఆయా దశల్లోని తన ఆలోచనలను ఘర్షణలను యథాతథంగా గుదిగుచ్చి నెమరేసుకోవడం చదువరులకూ అనుభూతినిస్తుంది. అనుకున్నవి సాధించ డానికి, దాంపత్య జీవితంలో పరస్పరం సహకరించు కోవడానికి, సామాజిక నిబద్ధత నిలుపుకోవడానికి కూడా వకుళాభరణం రామకృష్ణ లలిత దంపతుల గాథ పఠనీయ మవుతుంది. ■

## మద్దూరి నగేష్ బాబు స్మారక కవితా పురస్కారం

**ధి**క్కార కవి మద్దూరి నగేష్ బాబు జనవరి 10న వర్థంతి సందర్భంగా ప్రతి సంవత్సరం కవిత్వానికి పురస్కారాలు ఇవ్వదలిచాము. ప్రధాన పురస్కారానికి రూ.5 వేలు, మరో మూడు ప్రోత్సాహక పురస్కారాలకు వేయి చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక, సత్కారం వుంటాయి. కవులు 2020 – 22 మధ్య ప్రచురించిన తమ కవితా సంపుటాలను 4 కాపీలు డిసెంబర్ 20 లోగా ఈ కింది చిరునామాకు పంపాలి. జనవరి 10న విజయవాడలో పురస్కార ప్రదాన సభ వుంటుంది. పుస్తకాలు పంపాల్సిన చిరునామా : కన్వీనర్, తంగిరాల సోని, ఇంటి నెం. 12–45/1, జెడ్పీ హైస్కూలు దగ్గర, కంచికచర్ల (పోస్ట్, మండలం), ఎన్టీఆర్ జిల్లా – 521 180. సెల్ : 96766 09234



## మహాస్వప్నం

**అ**క్కడ
నెత్తురు కథలు చెబుతుంది
బిగిసిన పిడికిళ్లతో వినాలి మరి!

అక్కడ
మర్రి ఊడలు చెప్పే ఊసులెన్నో...
ఉష్ణం పుట్టించే ఊపిరి తీస్తూ
'ఊ..!' కొట్టాలి

అక్కడి మట్టిమీద పాదముద్రలు
కొత్తదారులు చిత్రిస్తాయి
చిరునామాలు చెరిపేసి
నడవడం నేర్చుకోవాలి!

అక్కడి గడపలకు వేలాడే తోరణాలు
మరో ప్రపంచంలోకి తలుపులు తెరుస్తాయి
సమూహం ఎంచుకున్న
మహాస్వప్నాన్ని మోసేందుకు సిద్ధపడాలి

అక్కడి రుద్రభూమిలో
చిటికెడు చితాభస్మం
ముగింపులేని సంకల్పాల
పరంపరకు ఎరువవుతుంది
కంటిధారతో కలిపి సేద్యం చేసేందుకు
నాగళ్లుగా మారాలి!

**- మల్లారెడ్డి మురళీ మోహన్**
**88611 84899**

## వాళ్ళంతేనా ..!

వాళ్ళంతేనా ...
ప్రాణాలడ్డుపెట్టి మరీ
ఊపిరి పోసిన సంగతి
ఏకధాటిగా తుపాన్లు కురుస్తున్నపుడు
సముద్రాన్ని దాటించిన సంగతి
జాలరి వలలో చిక్కి చేపపిల్లలా కొట్టుకున్నపుడు
నదిని బహుమతిగా ఇచ్చిన సంగతి
ముళ్ళ నడుమ ప్రయాణిస్తూ
రక్తసిక్తమవుతున్నపుడు
గాయాలకు కట్టుకట్టిన సంగతి
ఎడారి నిశ్శబ్దంలో
చల్లని గీతాలను వర్షించిన సంగతి

మాటల ప్రవాహంలో పదునైన పలుకు బాణాలు
ఎన్నిమార్లు సంధించినా
కన్నీటిని దిగమింగుతూ
వారధి విరిగిపోకుండా నిలబెట్టిన వైనం
నడివేసవిలో ఉక్కపోతల నడుమ
తల్లడిల్లుతున్నపుడు
అమ్మ చీరచెంగై ముఖం తుడిచిన వైనం
ఎలా మూలకు నెట్టేస్తారు!

వాళ్ళంతేనా
ఏరు దాటాక తెప్పను మరుస్తారా
నిచ్చెన ఎక్కుతుంటే కాళ్ళు పట్టుకుని లాగేస్తారా
కొండచిలువలై నోళ్ళు తెరుస్తారా

వెన్నెలనంతా సంపూర్ణంగా ఆస్వాదించాక
చందమామ ముక్కలతో
చలిమంటేసుకుని ఆనందిస్తారా?
వాళ్ళంతేనా ...!?

- పద్మావతి రాంభక్త
99663 07777



## అక్షరాలు తిరగబడితే ...

- డా.టేకుమళ్ల వెంకటప్పయ్య
94904 00858

అక్షరాలు అన్యాయాలపై ఆక్రోశిస్తాయి
అక్రమార్కుల అంతం చూస్తాయి
నిప్పులుకక్కే అక్షరాలు నిజాలనే చెప్తాయి
నిరసన వ్యక్తం చేస్తే నిలువరిస్తాయ్
పుంఖాను పుంఖాలుగా పురస్కారాలిచ్చి
శాలువాలు కప్పి శాంతపరుద్దామనుకోకు
తిరగబడ్డాయా! అంతే సంగతులు.

తప్పిదాలను కప్పిపుచ్చుకుందామని
చెప్పిన మాటలను చేరిపివేద్దామని
అధికారమదంతో అణచివేద్దామని
అప్రజాస్వామికంగా అడుగులేద్దామనుకోకు
అక్షరాలు తిరగబడ్డాయా! అంతే సంగతులు.

కళ్ళెదుటజరిగే కఠిన వాస్తవాలను
బలహీనవర్గాలపై బలప్రయోగాలను
అదేమిటని ప్రశ్నిస్తే? గొంతువిప్పితే?
ఉక్కుపాదమ్మోపి ఉసురుతీస్తావా?

విషసంస్కృతిని విచ్చలవిడిగా వ్యాప్తిజేస్తూ
గోబెల్స్ తరహా పద్ధతులకు తెరలేపే ముందు
అక్షరాల ఆవేశం గమనించు!
హాలాహలాన్ని గొంతులో దాచుకున్న అంతఃకరులు వాళ్ళు
బయటకు వదిలారా? భస్మీ పటలమే!



# రాసుకో.. నేను భారతీయుడిని ..!

మూలం : **అజ్మల్ ఖాన్** (జ.1992)
**మళయాళీ కవి.**
తెలుగు : **పి.శ్రీనివాస్ గౌడ్**
**99494 29449**

**రా**సుకో.. నేను భారతీయుడిని
రాసుకో.. నా పేరు అజ్మల్
నేనొక ముస్లింని
నేను భారతీయ పౌరుడిని.
ఇంటి దగ్గర మేము
మొత్తం ఏడుగురిమి
పుట్టుకతో మేమంతా భారతీయులం.
మీకు పత్రాలు కావాలా?

రాసుకో.. నేను భారతీయుడనని
నేను మప్పిలలి ముస్లింని
నా పూర్వీకులు అంటరానివాళ్లు
మీ భాషలో హిందువులు
శతాబ్దాల క్రితమే
మీ పూర్వ సిద్ధాంతకర్తలు పుట్టక మునుపే
మనువు ముఖం మీద చెంపదెబ్బ చరిచి
తమకు తగిన గౌరవం లభించినపుడు
వాళ్లు పేర్లు మార్చుకున్నారు.
మీకు అనుమానంగా వుందా?

రాసుకో.. నేను భారతీయుడిని
నా పూర్వీకులు ఇక్కడి భూమిని సాగు చేశారు
వాళ్లు ఇక్కడే జీవించారు మరణించారు
ఇక్కడి కొబ్బరి,మర్రి చెట్ల వేర్ల కన్నా
వాళ్ల వేర్లు లోతయినవి.
వాళ్లు భూస్వాములు కాకపోయినప్పటికీ
రైతులు మాత్రమే అయినప్పటికీ
ఈ భూమే వారి మూలం
వాళ్ల మూలాల పరిమళమే
ఈ నేల పరిమళం
వాళ్ల చర్మపు రంగే
ఈ నేల రంగు
మీకు దస్తావేజులు కావాలా?

రాసుకో..నేను భారతీయుడిని
ఇంకా మీకు పత్రాలు కావాలా?
మలబార్‌లోని చాలామంది సమాధులు తవ్వి,
బ్రిటిష్ వాళ్ల దౌష్ట్యానికి నేలకొరిగిన
వాళ్ల గుండెల మీద బూటు కాళ్ల ముద్రలు, బుల్లెట్లు
మీకు చూపించదలుచుకున్నాను
ఇంకా మీకు పత్రాలు,దస్తావేజులు కావాలా?
మీ దగ్గర ఏం పత్రాలు వున్నాయో నాకు తెలుసు
'సెల్యులార్ జైలు' ఒప్పుకోలు పత్రమూ,
నీ చేతి మీద గాంధీ రక్తపు మరకలు..
ఇంకా అటువంటివి గుర్తు చేయమంటావా?
పత్రాల గురించి మీరు అడిగితే
నేనంటాను..
'నోర్మూసుకు పో' అని.

రాసుకో.. నేను భారతీయుడిని.
మసీదుని కూల్చడానికి మీరు
మనుషుల్ని పంపడాన్ని నేను మర్చిపోలేదు
ఈ నేలతల్లి ఆత్మ – భారత రాజ్యాంగాన్ని
కూల్చుతున్నావు
నేను కోపంగా వున్నాను.
ఎంత ధైర్యం మీకు? ఎంత ధైర్యం?

రాసుకో.. నేను భారతీయుడిని.
ఇది నా నేల
నేను ఇక్కడే పుడితే..
ఇక్కడే చనిపోతాను
NRC పుస్తకం పైఎత్తున
పెద్ద పెద్ద లావుపాటి అక్షరాలతో
స్పష్టంగా రాసుకో..
నేను భారతీయుడనని ..!

**మప్పిలలి : దక్షిణ భారతదేశంలో కేరళ, లక్షద్వీప్ ప్రాంతాల్లో ఒక ముస్లిమ్ తెగ. జొనక/ చొనక /మురోస్ మలబార్స్ అని చారిత్రక పేర్లతో పిలుస్తారు.**
**సెల్యులార్ జైలు : అండమాన్ నికోబార్ దీవిలోని సావర్కర్‌ని ఖైదు చేసిన జైలు..**
NRC : **జాతీయ పౌరుల నమోదు జాబితా)**




# వాస్తవిక వ్యథలు 'ఊరిమర్లు' కథలు

- కెంగార మోహన్

రాయలసీమ కథాసాహిత్యంలో కర్నూలు వెనక బడిందన్న దగ్గర్నుంచి సజీవమైన కథలను వర్తమాన కథాసాహిత్యానికి సగర్వంగా అందించే కృషి నేడు కర్నూలు జిల్లాలో జరుగుతోంది. విస్తారంగా కథాసృజన జరుగుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందుతుంది. ఎవరికి వాళ్ళు రాసుకుని ప్రచురణకు పంపుకునే పరిస్థితి కొనసాగుతున్న రోజుల్లో 2018లో వచ్చిన నీళ్ళింకని నేల కథ తెలుగు కథాసాహిత్యంలో ఓ మంచి ప్రయత్నం. ఆ కథ రాసిన కథకుడు తెలుగు కథాసాహిత్యంలో అప్పటికీ పెద్దగా తెలియని మారుతీ పౌరోహితం. అదే కథతో కూడిన శీర్షికతో 2019లో రాయలసీమ ప్రచురణలు తొలి కథల సంకలనంగా తీసుకువచ్చి ఇరు రాష్ట్రాల కథకుల దృష్టిని ఆకర్షించారు. 2020లో మనస్విని ప్రచురణలు దళిత కథల సంకలనం నిప్పులవాన, అనంతరం 2021లో రాయలసీమ ప్రచురణలు వాన మెతుకులు .. ఇలా వైవిధ్యమైన కథలతో కర్నూలు నుంచి నాణ్యమైన కథా ఉత్పత్తి ప్రారంభమైంది.

ఊరిమర్లు వైవిధ్యమైన కథల సంకలనం. ఈ కథలకు స్థానికభాషే ఊపిరి పోసింది. వొక ప్రాంతం చుట్టూ అల్లుకున్న సమాజంలో జీవధారగా ప్రవహించే సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, మానవీయ విలువలు, అంతరాలు ఒక్కొక్కటిగా కథల్లో పెనవేసుకుని ఉంటాయి. జన సంస్కృతిలో మమేకమైన సామూహిక మానవ చర్యలు ఈ కథలకు జీవం పోస్తాయి. కొన్ని కథలను కన్నీళ్ళు తడిపితే మరికొన్ని కథల్లో నైతికతతో కూడిన విలువల కాలువలు ప్రవహిస్తాయి. స్థానికభాష దృశ్యమై మన కళ్ళముందు సాక్షాత్కారమౌతుంది. ప్రతి కథలో కథావస్తువు పటిష్టంగానూ, శిల్పం వేయివెలుగుల కాంతి జ్వాలలా మలచబడింది. భాషలో భావవ్యక్తీకరణలో రాయలసీమప్రాంతంలోని యాస మాండలికం ప్రతిధ్వనిస్తుంది.

కరువు కొందరికి వరమైతే కొందరికి శాపమని అంటారు ప్రముఖ జర్నలిస్ట్ పాలగుమ్మి సాయినాథ్. ఈ కథల్లో కథకుడు కరవు గూర్చే, నీళ్ళ కష్టాల గూర్చే, వర్షాభావ పరిస్థితి అశువుల బాసే రైతన్న దీనస్థితినే కాక రైతు బతుకుకు కుడిభుజంగా నిలిచే రైతుకూలీ బతుకును కూడా ఆవిష్కరిస్తాడు. రాయలసీమ కథకులు రాయలసీమ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని రాయలసీమ కష్టాలనే కాదు, సౌందర్యాన్నీ కథల్లో పరుస్తున్నారు. అందులో ముందు వరసలో నిలబడ్డ కథకుడు మారుతీ పౌరోహితం. జీవితాన్ని భాషను కథల్లో శిల్పంగా మలచడం ఈ కథకుడి ప్రత్యేకశైలి. పొలాలే కాదు, బతుకులూ పచ్చటి పైరులవ్వాలన్నది ఈ కథకుడి ఆశ. ప్రతి కథలోనూ ఒక ఓదార్పు, ఒక నిట్టూర్పు, అప్పటికప్పుడు మొలకెత్తే ఆశ కంటి పొరలపై మేఘంలా కమ్ముకుంటుంది. ప్రతి కథలో ఒక బలమైన సంఘటన చుట్టూరా కథ తిరుగుతుంటుంది. ఆ సంఘటన ఊహో, భ్రమో కాదు; వాస్తవ జీవిత ముఖచిత్రం. కథలన్నీ మాండలిక మాధ్యమంలో సాగడం వల్ల ఈ కథల్లో సృజనకు అవకాశం తక్కువే.

మారుతీ పౌరోహితం రాసిన కథలన్నీ మనిషి, ఆ మనిషితో ముడిపడిన సమాజం, ఆ సమాజంలో అంతర్భాగమైన సంస్కృతి, ఆ సంస్కృతిని నడిపించే వ్యవస్థ, ఆ వ్యవస్థకు ప్రాణం పోసే జీవనశైలి, జీవనశైలికి ఆహార్యమై నిలిచే వ్యక్తిత్వం, ఆ వ్యక్తిత్వానికి రెండు కళ్ళైన నైతిక మానవతా విలువలు ఈ కథలనిండా పరచుకున్నాయి. ఆత్మాభిమానం గల మనిషి, ఆత్మగౌరవంతో బతికే బతుకునూ కొన్ని కథల్లోని పాత్రల్లో చూడవచ్చు. పల్లె జీవితాన్ని మనోహరంగానూ, కల్మషం లేని మనషుల బాంధవ్యాలను,కులాలకతీకతంగా, మతాలకతీతంగా మనిషి భరోసానిచ్చే ఒక గొప్ప మానవతా సమాజం ఈ కథల్లో

కథకుడు నిర్మించాడు.

కథాసాహిత్య సాగరంలోకి దూకిపడ్డ జలపాతం మారుతీ పౌరోహితం. ఇలా రావడానికి, రాయడానికి కారణం విశేషమైన జీవితానుభవం ఉండటమే. దాన్ని అక్షరరూపం పెట్టగలగడం, మరింత పదునుగా అలవరచుకొని వైవిధ్యమైన కథాశిల్పంగా మలచడం ఈ కథకుడి ప్రత్యేకత. తనకున్న జీవితానుభవాలు తన జీవన గమనంలో తన హృదయాన్ని తాకిన ఘటనలూ ప్రత్యక్షంగా చూసిన అనుభవాలు, అను భూతులు కథలై ఈ సంపుటినిండా ప్రవహించాయి. సామాజిక మాధ్యమాల్లో చిన్న చిన్న అనుభవాలతో రాయడం మొదలెట్టిన మారుతీ పౌరోహితం ఇవాళ కథాసాహిత్యంలో తనకంటూ ఒక పుటను ఏర్పరచుకున్న కథకులయ్యారు. ఇది రాయలసీమ సాహిత్యం సాధించిన విజయంగా చెప్పవచ్చు. ఈ సంకలనంలో దాదాపు అన్నీ కథలూ ప్రముఖ పత్రికల్లోనూ సంకలనాల్లోనూ ప్రచురితమైనవే ఉన్నాయి.ఆ కథలన్నీ కథకుడి జీవితానుభవాలే కాక సాహిత్యానుభవాలుగా అక్షరబద్ధం చేయబడ్డాయి. ఈ సంకలనంలోని ప్రతి కథలో ఒక కొత్త విషయం పరిశోధనా త్మకంగా చెప్పకనే చెప్పాడు. కొన్ని కథల్లో వస్తువు ప్రధానమైతే, మరికొన్ని కథల్లో శిల్పం, ఇంకొన్ని కథల్లో యాసభాషాభివ్యక్తి. నీళ్ళింకని నేల కథ ప్రస్తావించదలిస్తే.. ఒక పాత్రలో ఒకే ఒక పాత్ర చిత్రణలో జీవితాన్ని కన్నీళ్ళతో తడిపేస్తాడు.

"ఎముకలు దొరికితే అవే ఆయమ్మవని ఈ కుండల పెట్టిచ్చిరి. ఈ కుండలో సచ్చిపోయిన నా పెండ్లాము ఎముకలుండాయి. మన్ను చేసేకి మా ఊరికి తీసుకపోతున్నా. మా యత్తకి మామకి నానేమని సెప్పాల!"

ఈ కథలనిండా మాండలికానికి అగ్రతాంబూలమిచ్చాడు కథకుడు. ఈ సంపుటికి భాష అదనపు సౌందర్యాన్నిచ్చింది. ఒక ప్రాంతానికి పరిమితమైన యాసే అయినా శిల్ప నిర్మాణంలో అర్థవంతమైన భావోద్రేకాల పాత్రలకు తగిన భాషను అందించి కథకుడు గొప్ప కథలకు పురుడుబోశాడు. ఈ కథల్లో సాంస్కృతికాంశాలు ప్రత్యేకంగా కనబడతాయి. ఆధునిక సమాజం ఆవిర్భవిస్తున్న సందర్భంలో అవన్నీ కనుమరుగౌతున్నప్పటికీ ఇప్పటికీ ఈ కార్పొరేట్ యుగంలోనూ పల్లెల్లో అక్కడక్కడా కనబడుతున్నాయి. వాటిని జాగ్రత్తగా కథల్లో రికార్డు చేయగలగుతున్నాడు. అవి ఆచారాలుగా, సాంప్ర దాయాలుగా సాగుతున్నప్పటికీ అందులోని సమైక్యతా విలువల్ని వెలికితీసే ప్రయత్నం చేశారు. ఇలా చేయగలిగినపుడే కథకుడు విజయం సాధించగలుగుతాడన్నది దృఢమైన అభిప్రాయం. సంస్కృతి, సాంప్రదాయాల్లోనూ విలువల ప్రతిష్ఠాపన, అది కూడా కొన్ని సందర్భాల్లో సామాజిక చైతన్యం కలిగిస్తుందని చెప్పకనే చెబుతాడు. కథల్లో కల్పనలకు అవకాశమివ్వకుండా ప్రతి కథలో సహజత్వంతో కూడిన సజీవత్వం అంతర్లయగా పాఠకులకు బహిర్గతమౌతుంది. ప్రతి కథ ఎన్నిసార్లు కథకుడి మస్తిష్కంలో మూల్యాంకనమై, పునర్మూ ల్యాంకనమై మలచబడిందో ఈ సంపుటి చదివిన ప్రతి వొక్కరికీ అర్థమౌతుంది.

కథకుడు సమాజ గమనాన్ని పరిశీలించకుండా గొప్ప కథలు తెలుగు సాహిత్యానికి అందించలేడు. వర్తమాన సమాజంలోని ప్రతి మార్పును రెటీనాపై నిక్షిప్తం చేసుకోగలిగి నపుడే అటువంటి దృష్టిపథంలో కథా సాహిత్యం సాగినపుడే కథకుడు తనూహించిన సమాజాన్ని నిర్మించగలుగుతాడు. సమాజాన్ని మార్చే బలమైన ఆయుధాల్లో సాహిత్యం కూడా ఒక అస్త్రమని భావించాడు కాబట్టే ఈ పనిని త్రికరణశుద్ధిగా కథకుడు చేయగలుగుతున్నాడు. ఆ దిశగానే అతని పయన మిప్పుడు సాగుతున్నది. తను చేయగలిగినంత తన పరిమితికి లోబడి తన పరిధిలో ప్రత్యక్షంగా ఒకవైపు చేస్తూనే పరోక్షంగా సమాజాన్ని మేల్కొల్పుతూ సమాజం ఏం నష్టపోతుందో చెప్ప గలిగే ప్రయత్నమూ తన రచన ద్వారా చేస్తున్నారు. ఆధునిక సమాజంలో ఎదుర్కొంటున్న విలువల లేమి చెబుతూనే, కను మరుగౌతున్న మానవత్వం పున:ప్రతిష్టకు ఈ సంపుటి విత్తులు నాటుతోంది. ఈ మట్టిపై మమకారం, మట్టిని నమ్ముకుని భారంగా బతుకీడుస్తున్న రైతు, ఆ రైతు చుట్టూ ఉన్న దోపిడి, దానికనుబంధంగా కొనసాగుతున్న ఆర్థిక, మానవ సంబం ధాలు కథలకు బలమైన వాక్యాలుగా నిలిచాయి. ప్రతి కథ చదివిస్తుంది. ప్రతి కథలోని వస్తువుతో ప్రతి మనిషికి కాస్త సంబంధమో లేదా ప్రత్యక్షంగా చూసిన లేదా తెలుసుకున్న ఘటనగానే కళ్ళముందు కనిపించేలా కథల్ని సృజియించారు. గ్రామీణ భాషలోని హాస్యమూ గ్రామీణ జీవితంలోని కులాల కతీతంగా సాగుతున్న బంధుత్వ బంధాలు చదివిన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.

ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత (తిరస్కార గ్రహీత కూడా) కుం.వీరభద్రప్ప 'కథల్లో ఉ పయోగించిన భాష కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మాట్లాడుకొనే తెలుగు మాండలికం. ప్రపంచీకరణ కేవలం గ్రామీణ జీవితాన్ని దేశీయ సంస్కృతిని మాత్రమే పతనావస్థకు నెట్టదు. ప్రాంతీయ భాషలను కూడా కబళిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానపు నీడలో ప్రాంతీయ భాషల వినియోగం తగ్గిపోవడం దీని ప్రారంభ లక్షణం. అయితే మన రాయలసీమలోని సృజనశీల సాహిత్య కారులు అనేకమంది తమ రచనల్లో తమ ప్రాంత భాషలో రాయడం ద్వారా ఆ భాషలకు గౌరవాన్ని

పెంపొందిస్తూ ఉన్నారు' అంటారు. ఈ కథలకు ప్రాణం భాష. ఇంకా చెప్పాలంటే మాండలికం. ఇరి వాస్తవ జీవిత గాథలు. ఏ ఒక్క కథ సృజన అని చెప్పడానికి వీల్లేదు. ఈ సంపుటికి జి.వెంకటకృష్ణ 'ఊరిమర్లు-వర్తమాన రాజకీయ బతుకు చిత్రాలు' పేరుతో కొన్ని తడియారని అనుభవాల్ని వెచ్చవెచ్చని సీమ మానవీయ బంధాల్ని పల్లెచుట్టూ అల్లుకుపోయిన కథల వస్తుశిల్ప సాదృశ్యాలను రాశారు. "ఈ కథలను మారుతి రాయలసీమ కన్నీళ్ళను చూపెట్టడానికి మాత్రమే రాసినట్లుగా అపార్థం చేసుకునే అవసరం లేదు. కథల యితివృత్తాల అల్లికలో భాగంగా అవసరమైన ప్రతి సందర్భంలోనూ కరువునూ వలసనూ చిత్రించినా, దానికి ప్రతిగా మానవ సంబంధాల అల్లికలో భాగంగానే రాయలసీమ భవిష్యత్తు కోసం కూడా సూచనలు చేస్తాడు మారుతి. కాల్వ కథలో కథకుడికి ఊరి ముందర ఎదురైన తన మిత్రుడు అంజనేయులు, తన కొడుకు, కర్నూలులో డిగ్రీలో చేర్పిస్తే తన చదువేందో తాను చూసుకోకుండా రాయలసీమ కోసం పనిచేస్తున్న సంఘాల వెనుక తిరుగుతూ చెడిపోతున్నాడని చెప్పుకొని అంగలార్చుతాడు. ఆ సందర్భంలో కృష్ణా నది మీద సిద్ధేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం జరుగుతున్న ఉద్యమాన్ని గురించి కథకుడు మాట్లాడతాడు. ఆ అబ్బాయి చేస్తున్న పని వూరికి మంచి చేసేదే అని, ఆ ప్రయత్నాలు తమ వూరి కాల్వకు నీళ్లొచ్చేలా చేసేవేనని మిత్రుడిని సమాధాన పరుస్తాడు. చాలా కథల్లో మారుతి, వర్తమాన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి పాఠకులకు పరిచయం చేస్తూ వుంటాడు. సిద్ధేశ్వరం, వేదవతి, గుండ్రేవుల లాంటివి రాయలసీమలో కృష్ణా, తుంగభద్ర నదుల నీటిని నిలుపు కోవడానికి పనికి వచ్చే ప్రాజెక్టులు. ముప్పై ఏళ్లుగా ప్రజలు వీటిని కోరుతున్నా పట్టించుకునే పార్టీలు లేవు. ప్రభుత్వాలు లేవు. ఇవి నిర్మాణం కావల్సిన అవసరాన్ని ఈ కథల్లోని పాత్రలు వ్యక్తం చేస్తుంటాయి." అంటారు.

ఈ కథల్లో 'కుశలంబే గదా ఆంజనేయ' కథకు ఖమ్మం ఈస్థటిక్స్ బహుమతి లభించింది. వైవిధ్యంగా గ్రామీణ కళాజీవితాన్ని అందులోని సమైక్యతను, లౌకికత్వాన్ని చాటిన కథ. పాత్రచిత్రణలో పరిణతి సాధించడమే కాక సన్నివేశాన్ని మనోహరంగా దృశ్యంగా చిత్రించారు.

ఈ కథల ద్వారా వర్తమాన కథకులకు కథల ఎంపికలో ఏది అవసరమైన కథాంశమో బోధపడుతుంది. జీవమున్న కథలన్నీ మన చుట్టూనే పడిఉన్నా వాటిని ఏరుకుని కథాక్షేత్రంలో ఎలా విత్తగలమో ఈ సంపుటిలోని కథలు నేర్పిస్తాయి. మారుతి కథాసేద్యం నిరంతరం కొనసాగాలి. రాయలసీమ కథాసాహిత్యానికి మారుతీ పౌరోహితం ప్రామిస్డ్ రైటర్ అని ఘంటాపథంగా చెప్పొచ్చు. ■

## నువ్వే ఒక సమూహం!



నేనొక్కడినే ఒంటరినని
దిగులెందుకు ఎప్పుడూ..
అనంత విశ్వంలో
అలుపెరుగక పయనించే
సూర్యుడు కూడా ఒంటరే కదూ ...
నాకెవరున్నారని పదే పదే
బెంగపడతావెందుకు?
నిశి రాత్రికి వెన్నెలద్దే
జాబిలి సైతం ఒంటరే ..!

ఒంటరితనం నీ సొంతమనుకుంటున్నావేమో!
నది పుట్టుక కూడా ఒంటరిగానే మొదలవుతుంది
అవరోధాలనధిగమిస్తూ
తనను తాను విస్తరించుకుంటూ
జన్మ సార్థకం చేసుకుంటుంది!

ఒంటరినని ఇంకెప్పుడూ
కలనైనా కుంగిపోకు
ఒంటి దీపమే
వేల దీపాలకూ ఊపిరి పోస్తుంది

అయినా ..
నువ్వొంటరివని ఎవరన్నారిప్పుడు?
ఒక్కసారి నీ అంతస్సముద్రంలోకి
నీకై నీవు పారి చూడు..
అంతుచిక్కని సమూహాలెన్నో
నీ ఆజ్ఞ కోసం ఎదురు చూస్తుంటాయి..

**- డాక్టర్ మహమ్మద్ హసన్**
**99080 59234**

# ఫీనిక్స్

- డా.దారల విజయ కుమారి
91771 92275



ఒకసారి
అందరినీ వాత్సల్యంతో కనిపెట్టే చెట్టులా
ఎగిరేందుకే రెక్కలల్లాడించే పిట్టలా
విస్తరిస్తున్న ఆకాశంలా
స్వేచ్ఛగా విహరించే మేఘంలా
తనే నది.. తానే కడలి..
చెలియలికట్ట దాటిందీ తనే కట్టుబడిందీ తనే

ఆ ఒడిలో ఒక్కసారి పడుకోవాలంతే..!

ఆమె కౌగిలి.. ముద్దు.. సాహచర్యం.. సమక్షం
దొరకబుచ్చుకున్నాననుకుంటావ్
జీవితమంతా వెంపర్లాడుతూనే ఉన్నా..
ఆమె సొంతం అందదు
ఆమెను పూర్తిగా ఒంపుకోలేక
ఆమెలో నిన్ను నింపుకోలేక
నువ్విలా పడిగాపులు పడి.. పరితపిస్తుంటావ్!

తన ఎదలో అమృతముంది
అవసరం కొద్దీ ఆశపడినప్పుడూ ఇస్తుంది
అదే అదనుగా ఎదను చీలుస్తావు
దురాశ కాదంటావా?

నువ్వు సాగరానివైనప్పుడల్లా
తాను నదై నిత్యం.. నీతో సంగమిస్తూనే ఉంది
సంగమ అనుభూతుల వెల్లువలో
నువ్వు కొట్టుకుపోతున్నపుడు
నిను ఆపుకునేది తనే ...
ఆమె.. నిన్ను ఎత్తుకుని ముద్దాడినా
ఈమె నిన్ను అనుసరించి నడిచినవి
నీ రోజువారీ అనుభవాలే కాదా..!

నువ్వు కాస్త ఎత్తున నిలబడి
గడ్డిపోచలానో.. తలొంచుకున్న గొర్రెలానో..
ఎల్లాగైనా అనుకుంటావామెను
ఏనాటికానాడు
నిన్ను ఎత్తులకు ఎగదోసిందెవరో గుర్తుంచుకోవు!

విరిచేసినా.. అతుకులేసుకుని / పగలేసినా.. కట్టుకుని
కాల్చేసినా.. మరింతగా మెరుస్తూ / పూడ్చేసినా.. మొలిచేస్తూ ...

తనను నిర్మూలించలేవు.. నిర్మించనూ లేవు!

నీ చేతుల్లోకి తనను తాను ఇచ్చేసుకున్నప్పుడే
నువ్వు తీసుకోవాల్సింది
అదెప్పుడో నువ్వు కనిపెట్టాల్సిందే..
నీ చేతుల్లో ఒదిగేందుకు.. నీ కింద నలిగేందుకు
తేడా నీకింకా తెలియకపోవడం ఎంత విషాదం..!

గాయపరిచిన మాటలో.. చేతలో ఆలోచించు..
ఆమెతో నీకసలు గాయపడిన అనుభవముందా..!

గాయాలు.. గోసపడిన అనుభవాలు
తనలో ఇంకా ప్రవహిస్తూనే ఉన్నాయ్
అడ్డకట్టే ప్రయత్నమే.. నీవింకా నేర్చుకోని విద్య!

ఏ సాయంకాలమో.. ఇసుకపై నడుస్తుంటే../ నీకేమనిపిస్తుంది
ఏ సుడిగాలో నిన్ను చుట్టుముట్టినపుడు/ ఏ అనుభవ మొచ్చింది..
వడగాడ్పుల్లో చిక్కుకున్నపుడు/ ఎంతగా విలవిలలాడింది..
తెలుసా, నీ అనుభూతులు కూడా తానే చెబుతుంది!

నీకింకా తెలియదు..
అవన్నీ ఆమెకు నువ్వు మిగిల్చిన.. నిన్నటి నేటి జ్ఞాపకాలే!

నువ్వు ఎగసిపడు పర్లేదు
పడినా పట్టుకుందుకు తానుంటుంది
నువ్వు చుట్టేసినా.. తట్టుకుంటుంది
నిన్ను విసిరేసుకో.. ఏరుకుని కూర్చుకుంటుంది
ఎందుకంటే.. నీతో ఒద్దిక తనకిష్టం..!

ఆ చేతులు చేయాలనుకున్నవేవో చేయనివ్వు
ఆ నోరు మాట్లాడాలనుకున్నదేదో మాట్లాడనివ్వు
కమ్మదనపు.. సన్నిహితపు నైపుణ్యపు రెసిపీ తాను
ఆ కళ్ళను నీళ్ళతో నింపకు
తేటగా ఉండనివ్వు చూడాల్సింది ఎంతో ఉంది!

తెల్లారి పిట్టల ఉమ్మడి కూతల్లా ఆమె నవ్వు నవ్వింది కొంచెమే..
నీ వేకువలలో చల్లని మేలుకొలుపులా
ఇంకా నవ్వాల్సిఉంది!

నువ్వు కాల్చేసినా.. నీకోసమే తిరిగొస్తుంది
ఫీనిక్స్ తాను..
చిరకాలం చితిని సిద్ధం చేస్తూ ఉండకు..!



# నల్ల రంగు ఇల్లు

- వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి
9440044922

జ్ఞానేశ్వర్, భద్రలది యూనివర్సిటీలో అధ్యాపక వృత్తి, ప్రవృత్తి. అతడు ఆర్థిక శాస్త్రంలో, ఆమె వ్యాపార శాస్త్రంలో అధ్యాపకులు. ఒకర్నొకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ కలిపి నెలకు రెండు లకారాలకు మించిన జీతం. వీళ్ళ సంపా దనపై ఆధారపడే బంధువులు లేరు. అట్లని వీళ్ళకు సాయం చేస్తామని ముందుకొచ్చే వాళ్ళూ లేరు. ఆకులో గూడు గువ్వది, కొమ్మపై గూడు ఉడతది, తొర్రలో గూడు గూబది. ఆ మూడింటిలో ఏ జీవి మరో జీవికి ఏమీ కాదు. వీళ్ళింటి పెరట్లో ఉండే జివ్వి మానులో ఉండే ఆ మూడు జీవుల్లాగే వీళ్ళిద్దరి బంధువులు కూడా నాలుగైదు నగరాల్లో ఉన్నా సంబంధం లేనట్లుంటారు.

జ్ఞానేశ్వర్, భద్రల యూనివర్సిటీ క్వార్టర్స్ జీవితం బాగానే ఉంది. కానీ పదేళ్ళ గడువులో చుట్టుపక్కల క్వార్టర్స్ ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. కొత్త వారు చేరుతున్నారు. అలా చేరిన వారూ కొన్నాళ్ళకు సొంత ఇళ్లుకట్టుకుని వెళ్ళిపోతున్నారు. వీళ్ళ జువ్వి మాన్లో నుంచి కూడా పాత జీవులు పోతున్నాయి. కొత్తవి చేరుతున్నాయి. పిల్లలు రెసిడెన్షియల్ స్కూలులో చదువుతుండ టంతో వీళ్ళ క్వార్టర్స్ జీవితం ఒంటరి జీవితంలా తయారైంది. 'క్వార్టర్స్ జీవితం ఎన్నాళ్ళు? మనమూ ఇల్లు కట్టుకుందామండీ?' మురిపెంగా అడిగింది భద్ర. తన మనసులో మాటే భార్య నోటినుంచి రావడంతో 'సరే'నన్నాడు జ్ఞానేశ్వర్.

కడుతున్న అపార్టుమెంటు కొనాలా? చేరడానికి సిద్ధంగా ఉన్న అపార్టుమెంటు కొనాలా? సిద్ధంగా ఉన్న విల్లా కొనాలా? సైట్ కొని ఇల్లు కట్టుకోవాలా? సిద్ధంగా ఉన్న కొత్త ఇల్లు కొనాలా? పాత ఇల్లు కొనాలా? ఇద్దరూ కలిసి ఆలోచన మొదలెట్టారు.

వీళ్ళ ఆలోచనలకు ఇంకా రూపు రాకనే, ఓ ఏజెంటు వీళ్ళ చుట్టూ ప్రదక్షిణ చేస్తూ చెవిలో జోరీగలా నసపెడుతున్నాడు. వార్త ఎలా పాకిందో మరో పది జోరు ఈగలు సమయం సందర్భం లేకుండా చెవుల్లో రొద మొదలెట్టాయి. ఎట్టకేలకు ఓ జోరీగ సలహాతో 'విల్లా' కొనాలనుకున్నారు.

దిక్కులు చూసి, వాస్తు చూసి, పార్కింగ్ చూసి, గాలి అనుకూలం చూసి, ఎండపడే వాటం చూసి విల్లా సెలెక్ట్ చేసుకున్నారు. రేటు రెండున్నర కోట్లు. ఇరవై లక్షల అడ్వాన్సు, ఫలానా రోజు అగ్రిమెంటు అనుకున్నారు. ఇరవై లక్షల చెక్కు ఇవ్వడంతో అనుకున్న తేదీన అగ్రిమెంటు జరిగిపోయింది.

కడుతున్న విల్లా దగ్గరికి దంపతులిద్దరూ ప్రతిరోజూ వెళుతున్నారు. "అక్కడ మల్లెతీగె, ఇక్కడ సన్నజాజి, ఆ మూలకు సంపెంగ, ఈ మూలకు మందారం వేసుకుందామండీ. మందులు వేయకుండా కూరగాయలు మనమే పండించు కోవాలండీ." భద్ర రోజూ చెప్పే మాటలకు జ్ఞానేశ్వర్ తలూపేవాడు. "విల్లా చుట్టూ కాంపౌండ్ వాల్ మూడు అడుగులే కడతారట. మనం మరో రెండడుగులైనా పెంచుకోవాలి. లేదంటే కుక్క కాంపౌండ్ దాటి పోతుంది." జ్ఞానేశ్వర్ అనేవాడు. నాటని మొక్కల గురించి, పెంచని కుక్క గురించి ముచ్చటించుకోవడం అలవాటయి పోయింది వాళ్ళకు.

"తెల్లటి తెలుపురంగు వేసుకోవాలి. ఇంటికి తెలుపురంగు అందమే వేరు, పాల మీగడ లాగా ఉండాలి. ఇక్కడున్న అన్ని విల్లాలలో మనదే ప్రత్యేకంగా కనపడాలి" అనుకున్నారు ఆలుమగలు.

"అంత తెల్లటి తెలుపు వేస్తే దిష్టిబొమ్మ పెట్టికోవాల్సిందే" అని కూడా అనుకున్నారు. ఇంటి లోపల ఏమేమి డెకరేషన్ మొక్కలు పెట్టుకోవాలో కూడా చర్చించారు. "శ్రమతో గూడల్లుకుంటుంది జీనిబాయి. మనం డబ్బుతో విల్లా కొంటున్నాం. అంత గుత్తంగా, అందంగా కట్టుకోవాలి." కలల గూటిలో విహరించడం అలవాటయ్యింది వాళ్లకు.

విద్యార్థులకు తాము చెప్పిన సిద్ధాంతం 'పొదుపు చేసిన ప్రతి రూపాయి కష్టపడి సంపాదించిన రూపాయితో సమానం'

నిజమేనని నమ్మి రూపాయి మిగిలినా బ్యాంకులో వేస్తుండటంతో ఇద్దరి పేరున కలిపి రూ.యాభై లక్షల డిపాజిట్లు తేలాయి. "రెండు కోట్ల రూపాయల బ్యాంకులోను తీసుకుంటే సరిపోతుంది." ఆలుమగలు విశదీకరించుకున్నారు.

బ్యాంకుల ఏజెంట్లు సంవత్సరాలుగా 'లోను కావాలా?' అంటూ ఫోనులో గుయ్యిమంటూనే ఉన్నారు. 'కావాలి' అనగానే

వానాకాలంలో సగం చీకి పారేసిన మామిడిముట్టెకు ముసిరే ఈగల్లా వాళ్ళూ వాలారు. ఏ బ్యాంకులో వడ్డీ రేటు తక్కువో, ఏ బ్యాంకులో డాకుమెంటు ఫీజు తక్కువో కనుక్కున్నారు. ఫిక్సడ్ వడ్డీరేటు, ఫ్లోటింగ్ వడ్డీరేటు ఏది తక్కువ అవుతుందో తెలుసుకున్నారు. విద్యార్థులకు చెప్పిన పాఠాలు, చేసిన పరిశోధనా తెలివితేటలు వినియోగించారు. లెక్కలు వేసి ఓ బ్యాంకును ఎన్నుకున్నారు. వారం రోజుల్లో లోన్ శాంక్షన్ కావటమూ, వీళ్ళిద్దరి పేరునా జాయింటు అకౌంటు ఓపెన్ చేయించి అందులో డబ్బు వేసేయడమూ జరిగిపోయింది. మీరు విత్ డ్రా చేసిన రోజునుంచి మాత్రమే వడ్డీ పడుతుందని ఓ లెటర్ కూడా ఇచ్చారు. అన్నీ అనుకున్నట్లే జరుగుతుండటంతో ఆలుమగలు సంతోషపడ్డారు. "డబ్బుంటే ఇల్లు కొనడం ఇంత సులభమా?" అనుకున్నారు.

'బాంకు లోన్ శాంక్షన్ జరిగిందా?' అంటూ ప్రతిరోజు బాంకుకు వెళ్ళి కనుక్కుంటున్న విల్లాల కంపెనీ ఏజెంటు శాంక్షన్ జరిగిందని తెలియగానే వీళ్ళింటికి వచ్చాడు. "రిజిస్ట్రేషన్ ఇంకా రెండు నెలలుండగా ఇతడెందుకొచ్చాడా?" అని ఆలుమగలు ఆశ్చర్యపడ్డారు. ఏజెంటుకు కాఫీ ఇచ్చి ప్రశ్నార్థకంగా చూసింది భద్ర.

"అగ్రిమెంటు సమయంలో మీరిచ్చిన చెక్కు తీసుకొచ్చాను మేడం. బ్యాంకులో మీరే డ్రా చేసి కాష్ ఇస్తే తీసుకురమ్మన్నారు మా సార్." తనొచ్చిన పని వివరించాడు.

"చెక్ డ్రా చేయకుండా విల్లా అగ్రిమెంటు చేశారా?" అనుమానంగా అడిగాడు జ్ఞానేశ్వర్.

"మీరు రెండున్నర కోట్ల వ్యాపారం ఇస్తున్నపుడు, ఇరవై లక్షలకు మా సారు మిమ్మల్ని నమ్మకపోవడమేంటి సార్?"

డబ్బు ఇవ్వలేదనో, చెక్ చెల్లలేదనో అగ్రిమెంటు రద్దు చేసుకునే అవకాశం ఉందనే విషయం దంపతులకు తెలీదు. "మనమీద ధనుంజయరావు గారికి ఎంత నమ్మకం.." అనుకోకుండా ఉండలేకపోయారు దంపతులు.

బ్యాంకులో ఉన్నది మన డబ్బే అయినా రెండు లక్షలకు మించి డ్రా చేస్తే 'ఎందుకని' బ్యాంకుకు వివరాలు చెప్పాలి, అదనంగా రుసుం కట్టాలి. అదే విషయం ఆలోచించి, "కాష్ మేమెలా డ్రా చేసి ఇవ్వగలం. మీరే చేసుకోండి." దంపతులిద్దరూ ఒకే మాటగా జవాబిచ్చారు. ఆ ఏజెంటుకు మరో మాట మాట్లాడే అవకాశం లేకపోయింది. మరుసటిరోజు ఇరవై లక్షలు కంపెనీ అకౌంటుకు బదిలీ అయినట్లుగా ఇద్దరికి ఫోను మెసేజ్లు వచ్చాయి. "ఇంతలో మాత్రానికి ఏజెంటు ఎందుకొచ్చినట్లు?" అనుకున్నారు.

■■■

ముందే అనుకున్న రిజిస్ట్రేషన్ రోజు దగ్గర పడుతూ ఉంది. ఏజెంటు రాలేదు. ఫోనూ ఎత్తడం లేదు. దంపతులు కంపెనీ ఆఫీసుకు వెళ్ళారు. మొదటిసారి విల్లా చూడడానికి వెళ్ళినపుడు, ఏసి కారులో వెళ్ళినా ఎండలో వచ్చారని టెంకాయ నీళ్ళు తెప్పించి హడావిడి చేశారు. రేటు కుదుర్చుకోవడానికి వెళ్ళినపుడు కూల్ డ్రింకు తెప్పించారు. అగ్రిమెంటు కోసం వెళ్ళినపుడు కాఫీ ఇప్పించారు. ఇపుడు కనీసం కూర్చోమని కూడా చెప్పలేదు.

వీళ్ళే రిజిస్ట్రేషన్ విషయం ప్రస్తావించారు.

"అగ్రిమెంటు సమయంలో మీరు ఇబ్బంది పెట్టారు. కాష్ అడిగితే కుదరదన్నారు. చెక్ ఇచ్చి బ్యాంకులో వేసుకోమన్నారు. చెక్ ఇస్తే రిజిస్ట్రేషన్ చేయలేం. క్యాష్ ఇస్తే ఇప్పటికిప్పుడు రిజిస్టర్ చేసిస్తాం. లేదంటే మీ అగ్రిమెంటు రద్దు చేసుకోండి. మీ డబ్బులు వెనక్కిస్తాం." ఖరాఖండిగా చెప్పాడు మేనేజర్.

కంపెనీకి, దంపతులకు మధ్య జరిగిన అగ్రిమెంటు కాగితాల ఫొటోస్టాట్ చూపిస్తూ, "అగ్రిమెంటు చూడండి. డబ్బులు అందిన వెంటనే రిజిస్టర్ చేయిస్తామని రాసుకున్నాం. చెక్ ఇస్తే రిజిస్టర్ చేసిస్తామని రాసుకోలేదు. మేం ఇవ్వాల్సిన ప్రతి చోట కాష్ అడుగుతారు. సిమెంటు, స్టీలు, రాయి కొన్నా నాలుగో వంతయినా క్యాష్ ఇవ్వాలి. లేదంటే వాళ్ళు సరుకివ్వరు, పైగా స్టాక్ లేదంటారు. సైట్ అమ్మినోళ్లకు రిజిస్ట్రేషన్ విలువ తప్ప మిగతా అంతా క్యాష్ ఇవ్వాలి. కూలీలకయితే పూర్తిగా క్యాష్ ఇవ్వాలి. సైట్ అప్రూవల్, ప్లాన్ అప్రూవల్, బిల్డింగ్ అప్రూవల్, పవర్ కనెక్షన్, వాటర్ కనెక్షన్ ఇచ్చేటపుడు లంచం కూడా క్యాషే ఇవ్వాలి. విల్లా కొనే మీరేమో చెక్ ఇస్తామంటారు?" కంపనీ మేనేజర్ కంఠతా పట్టినట్లు చెప్పేశాడు. మాట పొడిగిస్తూ "మీరు చెక్కే ఇవ్వాలనుకుంటే మా సారు అమెరికాకు పోయారు, రేపు నెల వస్తారు. సారొచ్చాక మాట్లాడుకోండి." మీరెళ్ళచ్చు అన్నట్లు చూశాడతడు.

■■■

ధనంజయరావు నెల తరువాత రానే వచ్చాడు. వీళ్ళను పిలిపించాడు. "మా వాళ్ళు విషయం చెప్పారు. మీరు ఎపుడంటే అపుడు రిజిస్ట్రేషన్ పెట్టుకుందాం. అయితే డెబ్బై ఐదు లక్షలు క్యాష్ అరేంజ్ చేయండి. మిగతాది చెక్ ఇచ్చినా సర్దుకుంటాం." ఉపకారం చేస్తున్నట్లుగా సలహా చెప్పాడు.

"మేమిద్దరమూ ఉద్యోగస్తులం. మా జీతం బ్యాంకులో పడుతుంది. మేం తీసుకున్న లోను కూడా బ్యాంకు ఇచ్చిందే. మాకు క్యాష్ ఎలా వస్తుంది? మేం క్యాష్ ఇవ్వలేం, చెక్ ఇస్తాం. మీరు వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందే. లేకపోతే కోర్టులో కేసు ఎదుర్కోవాల్సి ఉంటుంది." ఖచ్చితంగా అనేసింది భద్ర. విషయం నాన్చకుండా అనడం ఆమె అలవాటు.

"సరే, కోర్టులోనే కలుసుకుందాం. మీ మంచికోసం చెపుతూ ఉంటే మీరు కోర్టు, రూల్స్ అంటున్నారు." నేనూ తగ్గేవాణ్ణి కాదని చెప్పకనే చెప్పాడు ధనుంజయరావు.

స్నేహితుల సలహా అడిగారు దంపతులు. "మీరు కోర్టుకు కొత్త, వాడు నెలలో వారం రోజులు కోర్టులోనే ఉంటాడు. కోర్టులో ఈ కేసు తేలడానికి ఏ ఇరవై యేళ్ళో పడుతుంది. అప్పటికి మీరు రిటైర్ అయ్యే ఉంటారు. వివాధం కోర్టుకెళ్ళకుండా

చూసుకోవడమే మంచిది." సలహా ఇచ్చారు స్వీయానుభవంతో పండిన స్నేహితులు.

కోర్టులో తేల్చుకుంటామని గొప్పలు పోయిన దంపతులు తిరిగి కంపెనీ వద్దకు రాయబారం పోక తప్పలేదు. "మా సమస్యకు మీరే పరిష్కారం చెప్పండి" అని ధనుంజయరావును రిక్వెస్ట్ చేశాడు.

"విల్లా రిజిస్ట్రేషన్ విలువ తొంబై లక్షలు. ఇతరులయితే ఆ మేర చెక్ తీసుకుని, మిగతా కోటి 60 లక్షలు క్యాష్ ఇవ్వాలనే వాళ్ళం. మీ జీతం బ్యాంకులో పడుతుందని తెలుసు గనక 75 లక్షలు మాత్రమే క్యాష్, మిగతాదంతా చెక్ అడిగాం. ఆ మొత్తం కూడా క్యాష్ ఇవ్వలేమంటే మేం మాత్రం ఏం చేయగలం? మార్కెట్లో మొత్తం అలానే నడుస్తున్నాయి. మీరు అవేమీ గుర్తించకుండా మొత్తం చెక్ ఇస్తామంటున్నారు. చెక్ ద్వారా చెల్లించాలనుకునే మీకు ఈ ఊళ్ళో ఎవరూ విల్లా అమ్మలేరు. భూములు, ఇండ్లు, ఇండ్ల సైట్లు, వ్యాపార స్థలాల్లాంటివి అమ్మినా, కొన్నా జరుగుతున్న వ్యాపారమిలాంటిదే. ఈ వ్యాపారం చేయడానికి భయపడేటట్లయితే మీరుగా అగ్రిమెంటు రద్దు చేసుకోండి. అడ్వాన్సు వెనక్కిచ్చి అగ్రిమెంటు పేపర్లు తీసుకుంటాం" అన్నాడు. ధనంజయరావు ఇచ్చిన సలహాను మించి మరో మార్గం కనపడలేదు దంపతులకు.

■■■

ఆరు నెలలైనా అడ్వాన్సు వెనక్కివ్వలేదు. పది సార్లు తిరిగారు. అదో ఇదో అన్నారు. రేపోమాపో అన్నారు. కానీ ఇవ్వలేదు. ఏం చేయాలో దంపతులకు తోచలేదు. మిత్రులను సలహా అడిగారు. ఆలోచించి చెపుతామన్నారు. నెలల గడిచినా ఆ ఆలోచనా పరులెవరూ సలహాలివ్వలేదు. అడక్కుండానే సలహాలిచ్చి కాలరెగరేసే కాలర్రాయుల్లు కూడా సలహా అడుగుతారేమోనని వీళ్ళకు దూరంగా తిరుగుతున్నారు. సలహాల కోసం ఎదురుచూసి ప్రయోజనం లేదని నమ్మి, తమ కొలీగ్ అన్న లాయర్ అని తెలిసి ఆయన్ని కలిశారు.

"ఇటువంటి విషయాలు కోర్టులో తెగవు. జడ్జీలు కూడా ఇలాంటి వాళ్ళ చేతుల్లో బాధితులే." ఉపదేశం చేశాడు లాయర్.

"రేపటినుంచి మాకు వేసవి సెలవులు. కంపెనీ ఎదురుగా నిరాహార దీక్ష చేస్తాం." అన్నారు దంపతులు.

"ఆ పొరపాటు చేస్తే చట్టాన్ని ధిక్కరించారని పోలీసులు పబ్లిక్ న్యూసెన్స్ కేసు పెడతారు. అదే జరిగితే యూనివర్సిటీ మిమ్మల్ని ఉద్యోగాలనుంచి సస్పెండు చేస్తుంది." చట్టంలో రక్షణ లేదని గుర్తుచేశాడు లాయర్. ఇంకెన్నో ఉచిత జీవిత సత్యాలు కూడా చెప్పాడు.

"నాకు తెలిసి ఎందరో ఇలాంటి దాష్టీకాలకు బలైపోతు న్నారు. కారణాలేంటని పరిశీలిస్తే ఏదయినా దారి దొరకొచ్చు. సైట్లు, ఇండ్లు, భూములు చాలావరకు బ్లాకులో కొనే పరిస్థితి. ఇదో గొలుసుకట్టు బ్లాకు మార్కెట్ వ్యవహారం. ఈ బ్లాకు మార్కెట్ ఆగే అవకాశాలు లేకుండా ప్రభుత్వాలు, వ్యాపారులు, దళారులు దారులు మూసేశారు."

"బ్లాక్ మనీని వైట్ మనీ చేసుకునే మార్గాలు లేక, ఇంట్లో డబ్బు పెట్టుకోలేక మధ్య తరగతి వారు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే వచ్చే వడ్డీ తక్కువ. ఆ వడ్డీపై కూడా పన్ను. అందుకే బ్యాంకుల బయటే పెట్టుబడులు పెడుతున్నారు. కొంతమంది హౌస్ సైట్లు కొంటున్నారు. వీళ్ళ సమస్యను డబ్బు చేసుకునే ఉద్దేశంతోనే టౌన్లకు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్నా, మరో ఇరవై తరాల తర్వాత కూడా టౌన్లలో భాగం కాలేని భూములను కూడా హౌస్ సైట్లుగా మార్చి అమ్ముతున్నారు, వీళు ్ళ కొంటున్నారు. సైట్లు కాకపోతే బంగారం కొంటున్నారు. మీరూ గమనించే ఉంటారు. టీవీల్లో ఏ ప్రకటన లేకపోయినా హౌస్ సైట్ల, బంగారు అమ్మకాల ప్రకటనలుం టాయి. బ్లాక్ మనీ లేకపోతే ఈ రెండు వ్యాపారాలు ఇపుడున్నంతగా జరగవు. రిజిస్ట్రార్ ఆఫీసుల్లో జరిగే అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు, బంగారు కొనుగోలు విషయంలోనే రోజుకు లక్షల కోట్ల రూపాయలు క్యాష్ రూపంలో బ్లాక్ మనీగా చేతులు మారుతుంది. ప్రభుత్వాలకు ఇదంతా తెలుసు."

"బ్లాక్ మనీ చెలామణి చేసుకునే అవకాశం ఉండటం, బ్లాక్ మనీని వైట్ మనీలా చేసుకునే మార్గాలు ఇబ్బందికరం కావడం అసలు సమస్య. ఆ మార్గాలు కేవలం ఆడిటర్లకు, టాక్స్ ఆఫీసర్లకు, బ్యాంకర్లకు, మనీ లాండరింగ్ చేసేవాళ్లకు మాత్రమే తెలియడంతో ఈ సమస్యకు పరిష్కారం తెలియక మధ్య తరగతి జీవులు ఇలా పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నలిగిపోతున్నారు."

"మరి మా సమస్యకు పరిష్కారం? మా ఇరవై లక్షల అడ్వాన్సు వెనక్కొచ్చే మార్గం లేదా?" ఈసారి జ్ఞానేశ్వర్ అడిగాడు.

"పది శాతం కమీషన్ తీసుకుని చెక్కులు మార్చి క్యాష్ ఇచ్చేవాళ్ళు ఈ ఊళ్లోనే ఉన్నారు." తనకు తెలిసిన మార్గం చెప్పాడు లాయర్.

"చెక్కుల తీసుకుంటే వైట్ మనీ అవుతుంది కదా, వాళ్ళు మాత్రం చెక్కులు ఎలా తీసుకుంటారు?" అమాయకంగా అడిగాడు జ్ఞానేశ్వర్.

"వాళ్ళు పెద్దమొత్తాల విలువతో తీసుకోరు. నలభై తొమ్మిది వేల రూపాయల విలువను మించని చెక్కులు వేర్వేరు బ్యాంకులు, వేర్వేరు తారీఖుల్లో చెల్లేటట్లు తీసుకుంటారు. యాభై వేలకు మించిన చెల్లింపులు రిజర్వు బ్యాంకు పర్యవేక్షణలోకి వస్తాయి. అందుకే నలభై తొమ్మిది వేలు లెక్క. చెక్కులపై పేర్లు ఖాళీగా ఉంచమంటారు. రోజూ పది, ఇరవై చెక్కులు క్యాష్ చేసుకుంటారు. అలా క్యాష్ చేయడం కోసం కూలీలు ఉంటారు. వారి పేర్లు చెక్కులపై రాస్తారు. చెక్ క్యాష్ అయ్యే కాసేపూ బ్యాంకులో నిలబడినందుకు రెండొందలు ఇస్తారు. ఇప్పుడిదో వ్యాపారం."

"ఇలా వైట్‌మనీని బ్లాక్‌మనీగా చేయడం నేరం కదా? దొరికిపోయే అవకాశం ఉండదా? నిరాహార దీక్ష చేస్తేనే కేసులు

పెట్టే పోలీసులు, ఇంత డబ్బు చట్టానికి వ్యతిరేకంగా చేతులు మారిందని తెలిస్తే కేసులు పెట్టరా? అపుడు మా ఉద్యోగాలు పోవా?" ఈ ప్రశ్నలు అడిగి తమ భయాలను బయటపెట్టాడు జ్ఞానేశ్వర్.

"ఇంత చదువుకున్న మీకు నేను చెప్పాలా? ఆ మాత్రం రిస్క్ తీసుకోకపోతే ఇల్లెలా కొనగలం? మీలా భయపడే వారికి ఇంకో సమస్య కూడా ఉంది. రేపు మీరు విల్లా అమ్మితే కూడా మీ వద్దకు బ్లాక్‌మనీ చేరుతుంది. రిజిస్ట్రేషన్ విలువ తప్ప మిగతా అంతా బ్లాక్ మనీనే కదా? దాన్నెలా వైట్ చేసుకోవాలో మీరే ఆలోచించుకోవాలి." ప్రశ్న, జవాబు రెండు వేశాడు లాయర్.

"ఏ ఇల్లయినా వైట్ మనీతో పావు భాగమూ, బ్లాక్ మనీతో మిగతా భాగం కొనాల్సిందేనా. అలాంటపుడు ఇంటికి తెలుపురంగు కాక నలుపురంగు వేసుకోవడం నప్పుతుందేమో!" అనుకున్నాడు మనసులో.

"మనం ఇల్లంటూ కొంటే నల్లరంగే వేయించుకోవాలి" దంపతులిద్దరూ ఒకరికి తెలీకుండా మరొకరు మనసుల్లో నిర్ణయం తీసుకున్నారు. అంతటితో ఆగక, "మరి బ్లాక్ మనీ పోయేదెట్ల?" తమ సమస్యను మరచి దేశ సమస్యగా భావించి ప్రశ్న వేశాడు జ్ఞానేశ్వర్.

"క్యాష్ రూపంలో బ్లాక్‌మనీ మూడు చోట్లే ఎక్కువగా ఉంటుంది. రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ, బంగారు అంగళ్ళ చుట్టూ, ఎన్నికలప్పుడు ఓటర్ల చుట్టూ మూడు చోట్ల కొనుగోలు వ్యవహారమే! అంతెందుకు, రాజకీయాల్లో వోటర్లకు క్యాష్ పంచాలి, చెక్కులు ఇవ్వలేరుగా. అలాగే లంచాలు మెక్కేవాళ్ళు చెక్కుల ద్వారా తీసుకోలేరుగా?" తనకు తెలిసిన విషయాలు చెప్పాడు లాయర్.

"అందుకే మీ వద్దకు వచ్చాం, కోర్టులో కేసు వేయాలని." ఈ సారి భద్ర మాట్లాడింది.

"కోర్టులో కేసు తేలడానికి ఏళ్ళూ పూళ్ళూ పట్టొచ్చు. అయినా అన్ని రకాలుగా మీకు విల్లా అమ్మినవాడి దారులు మూయాలి. అంటే, అగ్రిమెంటు సమయంలో విల్లా విలువ రెండున్నర కోట్లని మిమ్మల్ని మోసగించి అగ్రిమెంటు చేయించారని, మీ తరువాత కొన్నవాళ్లకు కూడా తొంబై లక్షలకే అమ్మారని, అలా అమ్మినట్లు రుజువుగా రిజిస్ట్రేషన్ పత్రాలను సమర్పిస్తున్నామని, మేము తొంబై లక్షలు ఇవ్వడానికి సిద్ధపడ్డా రిజిస్ట్రేషన్ చేయడం లేదని, తొంబై లక్షలకు కొన్న డిడి కోర్టుకు సమర్పిస్తున్నామని, కోర్టులో కేసు వేయడం కొంతవరకు ఉపయోగకరం. అలా కేసు వేయాలంటే ముందు ఆ కంపెనీ వాళ్ళు ఇప్పటి దాకా రిజిస్టర్ చేయించిన డాకుమెంట్ల కాపీలు రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి సంపాదించాలి. కోర్టులో ఎదురయ్యే సమస్యలకు సిద్ధపడి దిగాలి. ఎప్పుడయితే వాళ్ళు తొంబై లక్షలకే ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారని ప్రూవ్ చేస్తామో అప్పుడు, ఆ విల్లా మరెవరికీ అమ్మకుండా అనుకూలంగా స్టే రావచ్చు. కంపనీ కూడా అన్ని విల్లాలకు ఇదే పరిస్థితి రావొచ్చని భయపడి మీ ఇరవై లక్షలు వెనక్కివ్వొచ్చు. కేసు విత్ డ్రా చేసు కోమని కాళ్ళ బేరానికి రావచ్చు." కోర్టులో దంపతులకు జరగ బోయే అనుకూల ప్రతికూలతలను వివరించాడు లాయర్.

లక్ష రూపాయల ఫీజులో సగం క్యాష్, సగం చెక్ రూపంలో తీసుకున్న లాయర్ కేసు వాదించడానికి ఒప్పుకున్నాడు. లాయర్ సలహాపై పూర్తి నమ్మకంతో, ఉన్న ఒక్క అవకాశం అదేననే నమ్మకంతో, వకాల్తా పేపర్లపై ఆలుమగలు సంతకం చేశారు. కేసుకు సంబంధించిన అన్ని పేపర్లు ఆ లాయరుకు ఇచ్చారు. కోర్టు కోర్టు తమ కేసు విచారణకు అనుమతించింది. అయితే ఆ తర్వాత కేసు వాయిదాలపై వాయిదాలు పడుతుండడంతో ఎదురు చూడడం మినహా ఏం చేయలేక పోతున్నారు.

ఏమాలోచించారో కానీ ఈ కేసుకు సంబంధించి గడచిన వాయిదా రోజు జడ్జీ గారు ఎన్ఫోర్సుమెంటు డైరెక్టరేటుకు, ఇంకమ్‌టాక్స్ డిపార్టుమెంటుకు, రెవిన్యూ డిపార్టుమెంటుకు కేసు విషయమై నోటీసులిప్పించారు. ఆ జడ్జి కూడా నల్లడబ్బుతో ఇల్లు కొనడంలో బాధితుడే. నోటీసులతో ఆ మూడు డిపార్టుమెంట్లు తలలు పట్టుకు న్నాయి. రెవిన్యూ డిపార్టుమెంటు రిజిస్ట్రేషన్ విలువలో చూపిన తొంబై లక్షలే నిజమైన రేటు అంటే, ధనంజయరావులాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అదనంగా వసూలు చేసిన డబ్బుపై ఎన్ఫోర్సు మెంటు డైరెక్టరేట్, ఇంకమ్ టాక్స్ డిపార్టుమెంటు కలసి కేసులు పెట్టవలసి ఉంటుంది, టాక్స్ కట్టించవలసి ఉంటుంది. కాదు విలువ రెండున్నర కోట్లే అంటే, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్ని రోజులు ఆ విలువకు సరైన స్టాంప్ ఫీజు ఎందుకు వసూలు చేయలేదో వివరించాల్సి వస్తుంది.

ప్రతి ఆస్తి కొనుగోలులోనూ, నల్ల డబ్బును ప్రజల ముంగిటిని చేర్చిన ప్రభుత్వాల గురించి పిల్లలకు పాఠాలు చెప్పరాదని ఆర్థిక, వాణిజ్య శాస్త్ర పండితులు నిర్ణయించుకున్నారు. కోర్టులో, డిపార్టుమెంట్లలో ఈ కేసుకు సంబంధించి చర్చలు జరుగుతున్నా, తలలు పట్టుకుంటున్నా, జుట్టు పీక్కుంటున్న ధనంజయరావు మాత్రం విల్లాలు అమ్ముతూనే ఉన్నాడు. నల్ల డబ్బుతో రిజిస్టర్ చేయిస్తూనే ఉన్నాడు. ■

## సోమేపల్లి' చిన్న కథల పోటీ విజేతలకు బహుమతీ ప్రదానం

రచయితలు తమ రచనలతో సమాజంలో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు కోరారు. 'మంచి రచనలతో ముందుకుసాగాలని' ఆయన ఆకాంక్షించారు. అక్టోబర్ 30న విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ లైబ్రరీలో రమ్యభారతి సాహిత్య పత్రిక ఆధ్వర్యంలో చిన్న కథలకు సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానం జరిగింది. సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు పోటీల్లో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత శ్రీకంఠస్ఫూర్తి, ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, పురస్కార ప్రదాత, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య, రమ్యభారతి సంపాదకులు చలపాక ప్రకాశ్ తదితరులు ప్రసంగించారు.




# ప్రశ్నలను లేవనెత్తే కవిత్వం

- అనూరాధ

నువ్వు దేశాన్ని ప్రేమిస్తున్నావా అంటాడొక కవి. అవును మనుషుల్ని ప్రేమిస్తున్నానంటాడు మరొక కవి. దేశమంటే మనుషులే కదా. వారి సమస్యలే కదా. అవును సమస్యల్ని ప్రేమిస్తున్నామంటారు మరి కొందరు కవులు. ప్రజాపక్ష కవులు హృదయాన్ని ఓ కన్నుగా చేసి సమాజంలోని అసమానతల్ని, అరాచకాల్ని, మతమౌఢ్యాల్నీ గమనించి ఆవేదన చెందుతారు. కవిత్వమై ప్రశ్నా సాగరాలవుతారు. అలలుగా విరుచుకు పడుతారు. దుఃఖోద్వేగ క్షణాలకు జవాబుదారులై తల్లడిల్లుతారు.

'దేశానికో అశ్రు లేఖ' అంటూ వి.ఆర్ తూములూరి చేసిందదే. 134 పేజీలూ తిరగేస్తే అర్థమవుతుందదే. ఎన్ని ఆర్ధ్రతాపూరిత వాక్యాలో కవిత్వమై అలా పరిభ్రమిస్తుంది.

మొన్నే కదూ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకున్నాం. డెబ్బయ్యయిదేళ్ళ స్వాతంత్ర్యానికి ఘనమైన సంబరాలు చేసుకున్నాం. సరిగ్గా ఈ శీర్షికతోనే ఇందులో ఒక కవిత ఉంది.. అందులో ఆఖరి చరణమిలా ఉంటుంది : 'నా దేశమా! ఈ సంబురపు వేళ/ అనేకానేక స్మృతుల స్మరణలో/ నా కంట రాలిన అశ్రువు/ ఆనందాశ్రువో../ దుఃఖాశ్రువో అర్థం కాకున్నది.'

ఇందులో తికమకేమీ లేదు, వ్యంగ్యం తప్ప. గుండెని చిక్కబట్టుంచే బాధ తప్ప. ఆ పై చరణాల్లో దేశ కీర్తిని స్తుతిస్తూనే దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్ని శక్తుల్ని కూడా కవిత్వం చేశారీయన... 'నా దేశమా!' అంటూ–

'తూటా కన్నా ఎలుగెత్తే గొంతు ఎప్పుడూ గొప్పదే
మెరిసే ఆలోచన ఎప్పుడూ పదునయినదే
నువ్వు పన్నిన వ్యూహంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదం చిత్తయ్యింది.
చివరకు ఈనేలను విడిచి వెళ్ళడమే దిక్కయ్యింది'

ఎంత మెరుపూ, ఎంత సూటి వ్యక్తీకరణ, ఎంతటి చమత్కారం! అలా అంటూనే కవి మనల్ని మరికొన్ని చరణాల్లో మేడిపండు సామెతని గుర్తుచేస్తూ లొసుగులను బట్టబయలు చేస్తారు. కులమత ఘర్షణల్ని, కార్పొరేట్ అరాచకాల్ని, మత మౌఢ్యాన్నీ, ఆకలి కేకల్నీ, అసహాయ జీవితాల్నీ ప్రశ్నల్ని చేస్తూ జవాబుగా జాలిగా ఓ నా దేశమా అంటూ అశ్రువుల్ని చిందించారు.

రైతులు ఢిల్లీ శివార్లలో ఎన్ని రోజులున్నారు, ఎంత గాయమై ఉన్నారు, యావత్ ప్రపంచం చూస్తానే ఉంది అక్కడేమి జరిగిందో! చివరకేమయింది? కాలయాపనకి లేపనమేదో దొరికిందిలే కానీ అసలు కథంతా ఇంకా అలానే ఉంది. ఈ సందర్భాన్ని ఊటంకిస్తూ కవి రాసిన పాటలాంటి కవితలో...

'తుఫానులని కాచిన దేహం
వాటర్ గన్లను ధిక్కరించదా
ఉరితాళ్ళతో బిగిసిన కంఠం
ఢిల్లీ బొడ్డున ప్రతిధ్వనించదా
పద పద పదపద పదా...
అడుగు ముందుకే సదా...

ఈ పద ప్రవాహం శ్రీశ్రీని గుర్తుకుతెస్తోంది. కనుల వెంబడి గమ్మత్తయిన రహస్యశోకమేదో స్రవిస్తుంది. రైతాగితే దేశమేమవుతుందీ.. అన్నది ఒళ్ళు గగుర్పొడిచే ఊహ. నిజం కాకూడదని ప్రార్థన. సోమరి పాలకుల్లారా, కళ్ళు సరిగ్గా తెరవండని వేడుకోలు, పోనీ హెచ్చరిక..

కవి ఏం రాయాలి, ఎలా రాయాలి? ఏది అక్షరీకరించి చీకటిని వెలుతురు చెయ్యాలి? ఎలా కాంతిని ప్రసరింప

జెయ్యాలి? వెలుతురుని ఎలా ఒడిసిపట్టాలి? అసలు కవి ఎవరు? ఎందుకు కవిత్వం? 'కవీ.. ' అనే శీర్షికతో సాగిన కవితలో– ఇవన్నీ ప్రస్తావించారు.

'తేల్చుకో నీ ఇష్టం ఏమి రాస్తావో నీ కష్టం' అన్నట్లు
అర్ధవంతం, ఫలవంతం కానిది కవిత్వమా అన్నట్లు
అంతరంగపు లోతులు కొలవలేనిది మరి ఏమిటన్నట్లు
ఆశయం వినిపించక ఆలోచన కురిపించక
అరుణోదయం సృష్టించక/ సవ్యాపసవ్య దిశల్ని నిర్ధారించక

ఇక నువ్వెందుకన్నట్లు .. ఈ కవిత ఒక చిన్న పరిహాసంలా అనిపించింది. ఇక ఆఖరున ఇలా–

'నీ ఇష్టం.../ అప్పుడే నువ్వు రవివవుతావు
లోకం మెచ్చే కవివవుతావు'

నుదుటిన నులివెచ్చని ముద్దు లాంటి వాక్యాలివి. కవితా స్పృహకి హద్దులివి.

తరతరాలుగా దేవుని గురించి వింటూనే ఉన్నాం. మరి ఏది ధర్మం ఏది అధర్మం. ఏది సత్యం ఏది అసత్యం? హింసని ప్రేమిస్తామా? అహింసమా? మనమెవరో? ఉన్నాడో లేడో కానీ, దేవుడు. ఉంటే ఎన్నిటికో సాక్షీభూతమైనాడు కదా. ప్రబోధకుల తప్పుడు తడకల్లో, ఊకదంపుడు ఉపన్యాసాల్లో.. 'దేవుడు' శీర్షికన కవి అంటాడిలా..

ఆధునిక జగత్తులో/ అలౌకికానందాల వెంపర్లాటలో
మస్తిష్కాలను మతం మత్తులో ముంచి
ప్రశ్నకి తలారిలా నియమించబడ్డాడు
కలడో లేడో కానీ /
కాలం కుత్తుక మీద/ తన కర్కశ పాదాలు
నాటినుండి నేటి వరకు/కరాళ నృత్యం సాగిస్తూనే ఉన్నాయి

... అంతా బావుంటే అలా ఎందుకు చెప్పుకుంటాం. అంత సూటిగా ఎందుకు ప్రశ్నల్ని దించుతాం. మనమంతా కులాలుగా మతాలుగా ఉన్నాం సరే. మనుషులుగా చచ్చిపోయాం కదా. మానవత్వానికి ఉరివేసుకున్నాం కదా. ఇంకేం మాట్లాడతాం..?

కవి ఇక్కడే ఆగడు. మనసొక సీతాకోకచిలుక అంటాడు. ఎలా రంగులుగా పరిభ్రమిస్తావో నీ ఇష్టమంటాడు. అంతలోనే ఇదొక వ్రణభూమి అంటాడు. 'మా స్వాతంత్ర్యాన్ని చూసి ఏడవకండి. మేం కప్పుకున్న ముసుగు లాగి చూడండి' అంటాడు.

నియంతలదేం పోయిందీ! వాళ్లేం చేస్తారు? అహంకారం, కండకావరంతో మూర్ఖత్వాన్ని వెదజల్లడం తప్ప, వినాశనం తప్ప.. అప్పుడే కదూ జనం గొంతుకలు పోగయ్యేది.. అప్పుడే కదూ, నిరసన జ్వాలలు బయల్దేరేది. అప్పుడే కదూ చరిత్ర పుటల్లో మరొక అహంభావి తల నేలరాలేది. కవిత్వం ఎందాకా అంటే మనుషులున్నదాకా అని.. నవచేతనానికి అనీ.. ఇదే ఇక్కడా కవి చెప్పేది, చేవచచ్చినోళ్ళారా లేవండిక, మొద్దునిద్రల్లో నుంచీ చైతన్య దీపికలై కదలండీ అని..

మేడేలు జరుపుకుంటాం. కార్మికుల కష్టాలకి కన్నీళ్ళు చల్లుకుంటాం. ఇకంతే.. మళ్ళీ మర్చిపోతాం. శ్రమ దోపిడీ జరుగుతూనే ఉంటుంది. యజమాని మరింత బలుస్తూనే ఉంటాడు. కార్మికుడు బక్కచిక్కుతూనే ఉంటాడు. చట్టాల అమలు కోసం, హక్కుల పరిరక్షణ కోసం ఎవరో ఉద్యమించి అడుగుతారు, అణగారిన వర్గపు ఆశాగొంతులై.. ప్రశ్నించే గొంతుకల్ని నేలరాల్చే రంగుల్లో ప్రభుత్వాలు కదా ఉన్నది.

ఈ సంపుటిలోని కవితలన్నీ ఇలానే ఓ ప్రవాహంలా, ప్రశ్నల ప్రభంజనంలా సాగుతాయి. ఇవన్నీ చాలావరకు వివిధ మాధ్యమాల్లో సందర్భానుసారం అచ్చయినవే. ఆఖర్లో ప్రసిద్ధకవుల అనువాదాలు కొన్నున్నాయ్. ముఖ్యంగా హిజాబ్ గురించీ, స్త్రీలను సమాజం ఇంకా ఎలా చిన్నచూపు చూస్తుందన్నదీ, అశ్లీలతలో యువత పెడదోవ గురించీ... ప్రత్యేకంగా ఉన్నాయి. కవిత్వంలో పదునయిన భాషా ఉంది, అతి సున్నిత పదవిన్యాసమూ ఉంది. కవి ఇక్కడే సఫలయేది... చెప్పాలనుకున్నది పదాల్లోకి చేర్చినప్పుడే.. ఏమాత్రం నిరాశపరచని కవితలు, ప్రాణ చప్పట్ల వంటివి... కవి గుండెచప్పుడుతో అడుగులేసేవి, పరిగెట్టేవి. ఇది కదా మానవాళికి ఉపయోగపడే కవిత్వమనబడేదీ..! ■

## దాతలూ అన్నదాతలూ ...

చర్చికై చర్చిస్తున్నారు
క్రైస్తవ దాతలు
మసీదుకై మహా ప్రణాళికలు రచిస్తున్నారు
ముస్లిం దాతలు
గుడికై ఆలోచిస్తున్నారు
హైందవ దాతలు

దేశం నిండా దాతలే
దేశం నిండా దైవ దూతలే!

ఏ దూతకైనా కడుపు నింపేది
అన్నదాతలే
ఏ దూతకు మొరపెట్టాలో
వారి వెతలు!

**- కోటం చంద్రశేఖర్**
**94920 43348**



# సమాజ అవసరాలను తీర్చే కవిత్వం కావాలి!

## పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్

**"వస్తువును బట్టి శిల్పం, రచయితను బట్టి శైలి ఉంటుంది. శైలీ శిల్పాలు స్థిరాస్థులు కాదు. చరాస్థులు. ఉమ్మడి సొమ్ములు కావు. వైయక్తిక స్వార్జితాల"న్నారు ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరపున ఇనాక్ గారితో ముచ్చటించారు. ఆ ముఖాముఖీ ఇదీ....**

**మీ బాల్యం, కుటుంబ నేపథ్యం గురించి క్లుప్తంగా చెప్తారా?**

నేను పుట్టింది జూలై 1వ తేదీ 1939 సంవత్సరం. మా అమ్మ విశ్రాంతమ్మ, మా నాన్న రామయ్య. మాది గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వేజెండ్ల గ్రామం. అక్కడి మాదిగ పల్లె. నిరుపేద కుటుంబంలో పుట్టాను. మా అమ్మ చాలా కష్ట జీవి. మానాన్న ఒక అసామి దగ్గర జీతగాడు..

**మీ అమ్మగారు తెలుగు చక్కని జాతీయాలతో సామెతలతో మాట్లాడడం వల్ల మీకు తెలుగుపై ఆసక్తి కలిగిందని ఎవరో చెప్పగా విన్నాను. ఆ వివరం కొంచెం చెప్తారా?**

నాకు మాతృభాష అంటే మా అమ్మ మాటలే. మా అమ్మ మంచి మాటకారి. ప్రేమ కలిగితే, చూడండీ... అమ్మ మాట గొప్ప కవిత్వం. నా తెలుగు మా అమ్మ ప్రేమ వల్ల అబ్బిందే.

**మీకు తెలుగు భాషపై మక్కువ కలగడానికి బాల్యంలో పడ్డ బీజాలు ఏమిటి?**

మా పల్లె భాష కలుషితం కాని అద్భుతమైన భాష. దాని మీద నాటికి సంస్కృతం, ఇంగ్లీషు ప్రభావాలు అంతగా లేవు. అది స్వచ్ఛమైన తెలుగు. మా ఊరి మాటలు నాకు కోటివరాల మూటలు. పల్లె పాటలు, మాటలు నాకు ప్రాణం. కథలు, పాటలు, గేయాలు, బాల, చందమామ, బాలమిత్ర, పాపాయి వంటి పత్రికలు ఇష్టంగా చదివేవాణ్ణి. గుంటూరులో పాత పుస్తకాలు అమ్మే పెద్దయ్య దగ్గర రాశులకొద్దీ ఉన్న పుస్తకాలు చదవడానికి ఇచ్చేవాడు. గుంటూరు మునిసిపల్ గ్రంథాలయం లో కొన్ని వేల పుస్తకాలు చదివాను. రైళ్ళలో పుస్తకాలు అమ్మే అన్న ఇచ్చిన 'జంపన' చంద్రశేఖర్ రావు, 'కొవ్వలి' లక్ష్మీ నరసింహారావు నవలలు చాలా చదివాను. అదొక ఉత్సవం.

**మీరు తొలిగా అచ్చులో చూసుకొన్నది కవిత్వమా? కథానికా?**

'కొలకలూరి' పేరుతో "ఉండాలోయ్ ఉండాలి!" అనే నాలుగు పంక్తుల కవిత్వం. 'బాల' అనే చిన్నపిల్లల పత్రికలో 1952లో ముద్రితమయింది. 1954లో 'ఉత్తరం' అనే కథానిక, గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల మాగజైనులో ప్రచురితమైంది. అది నాకిప్పటికీ గుర్తున్న మంచి కథానిక.

**మొదట్లో పద్యాలు రాసి జాషువా గారి మెప్పు పొందిన మీరు తరువాతి కాలంలో పద్యానికి స్వస్తి చెప్పారెందుకు?**

మొదట్లో కవిత్వం ఎక్కువగా వ్రాసేవాణ్ణి. ప్రోత్సహించింది కరుణశ్రీగారు. జాషువా గారు నాకు తెలుసు కానీ, నేనెవరినో ఆయనకు తెలియదు. కానీ జాషువా కవిత్వం అంటే నాకు చాలా ఇష్టం. తేలికగా అర్థమయేది. నా కవిత్వం చదివిన నా మిత్రులు 'నీ పద్యం జాషువా పద్యంలాగా ఉందనో, కరుణశ్రీ పద్యంలా ఉందనో' మెచ్చుకునేవారు. నా పద్యం మరొకరి పద్యంలా ఉండటమేమిటని, సొంత గొంతుకోసం తపన పడ్డాను. ఆ దశలో వచనం ఆశ్రయమిచ్చింది. నా కథానిక, నవల, నాటకం, వచన కవిత్వం, నాటకం

చదివినవారు మరొకరివిలా ఉన్నాయని అనకుండా బాగా రాస్తున్నావని మెచ్చుకోసాగారు. అలా కొనసాగింది నా వచన కవిత్వ వ్యాసంగం. ఇక పద్యాలకు స్వస్తి చెప్పడం అంటూ ఏమీ లేదు. ఏ ప్రభావాలు నా మీద లేవు అని అనుకొన్నప్పుడు 'ఆది ఆంధ్రుడు' అనే పద్యకావ్యం రాశాను. నా సంప్రదాయ నాటకాల్లోనూ పద్యాలు ప్రముఖ స్థానం పొందాయి.

**మీలో 'దళిత వర్గస్పృహ' ఇంత విస్తృత రీతిలో కలగడానికేమైనా కారణాలున్నాయా?**

నా సాహిత్యానికి వస్తువు సమాజమే. అది సమాజమిచ్చిన దానమే. నా సాహిత్యం దళిత సాహిత్యమని, సహృదయులు కొందరు భావిస్తుంటారు. అది నిజమే. అది మాత్రమే నిజం కాదు. నన్ను బహుజన రచయిత అనీ, స్త్రీవాద రచయిత అనీ, మైనారిటీల (క్రైస్తవ/ మహమ్మదీయుల) రచయిత అనీ, గిరిజన సాహిత్య పక్షపాతి అనీ, పేదల పక్షాన నిలబడ్డ రచయిత అనీ అంటుంటారు. ఇదంతా నిజమే! ఎవరికి ఏది ఆనందం కలిగిస్తే, దాన్ని ఆ ఆనందకోణాన్ని నాలో వాళ్ళు చూస్తున్నారు. నిజానికి నేను తెలుగు రచయితను. ఆ మాట చాలు. మరే ముద్రలూ ఏవీ అవసరం లేదు.

**మీకు అష్టదిగ్గజ కవుల్లో రామరాజభూషణునిపైనే ఎక్కువ మక్కువ అంటారు. కారణాలేమైనా ఉన్నాయా?**

నేను ఆంధ్రాచార్యుణ్ణి. అధ్యాపకుణ్ణి. ప్రాచీన సాహిత్యం ఇష్టమే. ఆధునిక సాహిత్యమూ ఇష్టమే. ప్రబంధ యక్షగానాదులే కాదు, కావ్య నాటకాదులూ ఇష్టమే. భాషాశాస్త్రం భాషా పరిణామాలూ ఇష్టమే. 42 ఏళ్ళు అధ్యాపకుణ్ణి. కళాశాల స్థాయినుంచి విశ్వవిద్యాలయ స్థాయిదాకా అన్ని పాఠ్యాంశాలు బోధించాను. తెలుగు పరిశోధనల్లో తీవ్రంగా పరిశ్రమించిన వాణ్ణి. ఆధునిక సాహిత్యం, దాని ఆవశ్యకం అర్ధమైనవాణ్ణి. ప్రబంధాలు ఇష్టమే. వసుచరిత్ర మరీ ఇష్టం. చాలామందికి అది అయఃపిండం. 'శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం' ప్రఖ్యాతి పొందిన గ్రంథం రాశాను. దాన్ని కవి మీద, కవి శూద్రత్వం మీద ప్రత్యేకంగా ఇష్టం ఉండటమే. ఆ మహాకవి పొందిన అవమానాల పట్ల దిగులు ఉండడమే. సానుభూతి ఉండటమే! స్వానుభవం ఉండటమే! ఇటువంటి చాలా కారణాలు ఆ విమర్శన గ్రంథరచనకు పురికొల్పాయి.

**'సి.నా.రె గారి ఆధునికాంధ్ర కవిత్వం' పరిశోధనా గ్రంథ పరిశీలనా వ్యాసంలో మీరు 'మత ప్రయోగం గురించి సినారె అల్పంగా స్పృశించి వదిలేసినట్లనిపించింది' అన్నారు. అలా అనడంలో మీ ఉద్దేశం?**

అది అద్భుత పరిశోధనా గ్రంథం. మతప్రయోగం మీద మరింత దృష్టి పెట్టి ఉండాల్సిందని నాకు అప్పుడు అనిపించింది. ఇప్పుడూ ఆ భావం మారలేదు.

**మీరు 'మునివాహనుడు' కథ యిష్టపడినంతగా, వీరశైవం లోని పాల్కురికి సోమనాథుని భక్తుల కథలు ఎక్కువ ఆకర్షించ లేదు. ఎందుచేత?**

'ముని వాహనుడు' రాయడానికి ఏర్పడ్డ పూర్వరంగం గూర్చి ఆ నాటక ఉపోద్ఘాతంలో వివరించాను. తిరుప్పాణ్ జీవితం అద్భుత నాటకీయంగా ఉండడం కూడా ఒక కారణం. (నవ్వుతూ) నేనూ మనిషినే. ఎన్నని రాయగలను? 104 పుస్తకాలు! కవిత్వం, కథానిక, నవల, నాటకం, పరిశోధనం, విమర్శనం, అనువాదం వీటితో పాటు ఉద్యోగం, సంసారం భార్యా పిల్లలు, వాళ్ళ బాగోగులు చూచుకోవడం, పత్రికలకు సమీక్షలు, ముందుమాటలు రాయడం, సెమినార్లు, పుస్తకావిష్కరణలు, సభలు సమావేశాలు ఇలా ఎన్నో! ఇంత విస్తృతంగా జీవించడం చూచి ఆనందించడం, అభినందించడం న్యాయం. సమయం దొరికితే 'నందనారు' నాటకం రాయగలనేమో చూద్దాం.

**1969లో వచ్చిన మీ 'ఊరబావి' కథ ఒక సంచలనం. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత 1999లో వచ్చిన మీ 'అశ్పృశ్య గంగ' కథఊరబావికి కొనసాగింపుగా భావించవచ్చా?**

అనుకోవచ్చు. 'అనంత జీవనం' – జ్ఞానపీఠ్ మూర్తిదేవి పురస్కారం పొందిన నవల కూడా వాటిని అనుసరించిన రచనే. ఊరబావి రాష్ట్ర సాహిత్య అకాడెమీ అవార్డు పొందింది. అది కేంద్ర సాహిత్య అకాడెమీ 'మాడరన్ క్లాసిక్'గా భారతీయ భాషల్లోకి అనువాదం అయింది. అశ్పృశ్యగంగ కథానికా సంకలనం ఆచార్యులు అల్లాడి ఉమ, శ్రీధర్ గార్లు అనువాదం చేస్తే రత్నా బుక్స్, ఢిల్లీ వారు ప్రచురించారు. అనంత జీవనం నేనే ఆంగ్లంలోకి అనువాదం చేస్తే రత్నాబుక్స్ వారే ప్రచురించారు. ఈ మూడూ నీటి చుట్టూ పరిభ్రమించిన రచనలు. గుంటూరు పక్కన ఉన్న వేజెండ్ల గ్రామంలో నీటి ఎద్దడి ఉన్న కాలంలో నేను పుట్టి పెరిగాను. ఇది జీవితం. జీవితం నుండే సజీవ సాహిత్యం పుడుతుంది. సాహిత్య జీవితం సమాజానికి ఆదర్శమూ అవుతుంది. మార్గదర్శకమూ అవుతుంది.

**మీ తొలి కవితల సంపుటి 'ఆశాజ్యోతి' 1971లో వచ్చింది. మధ్యమధ్య చాలాగ్యాప్‌తో 16 సంపుటులు విడుదల చేశారు. కవిత్వం కంటే నవలలు, కథల మీదనే ఎక్కువ మనసు పెట్టినట్టున్నారు?**

ఒక వస్తువు ఏ ప్రక్రియలో బాగా ఇమిడిపోతుందో, అన్ని ప్రక్రియల మీద అధికారం ఉన్న సృజనశీలికే తెలుస్తుంది. అలా ఆయా వస్తువులు, ఆయా ప్రక్రియల్లో అభివ్యక్తమవు

తాయి. ఒక్క ప్రక్రియే రాసే సృజనశిల్పికి, తప్పనిసరయి, అన్ని వస్తువులూ ఆ ప్రక్రియలో ఇరుక్కుపోతాయి. నాకు ఆ ఇబ్బందిలేదు. అందువల్ల కొంత వెసులుబాటు ఉంది. విమర్శకులు, సహృదయులు కొందరు కొన్ని, కొన్ని ప్రక్రియల్లో నా అభివ్యక్తి బాగుందని, బాగుంటుందని అభినందిస్తున్నారు. నా సాహిత్యానువాదాలను, ఆంగ్ల రచనలను కూడా అభినంది స్తూనే ఉన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకుణ్ణి అయ్యాక 30 ఏళ్ళుగా నవలలు రాయలేదు. ఒక నెల తీరుబడి, విరామం ఉంటే తప్ప నవల పట్ల దృష్టి పెట్టలేను. నిరంతరం శ్రమించే వివిధ జీవిత కోణాలలో గమించే వేగం, ఉద్వేగం ఉన్న నాకు అప్పటిలో అంత తీరుబడి దొరకలేదు. బుర్రలో గుండెలో పుట్టవలసిన పుస్తకాలు గిరగిరా తిరుగుతున్నాయి. 6 గంటలు టేబిల్ దగ్గర కూర్చోగలిగే శక్తి, పూర్వ సామర్థ్యం మళ్ళీ పునర్భవిస్తే బాగుణ్ణు.

**జానపదుల సాహిత్య విమర్శకు 'శాస్త్రప్రతిపత్తి'ని చేకూర్చిన వారిలో, ప్రథమంగా మీ పేరే వినబడుతుంది. ఆ విషయంపై మీరు చేసిన కృషి క్లుప్తంగా చెప్తారా?**

'జానపదుల సాహిత్య విమర్శ' అనేది పరిశోధన గ్రంథం. మీరన్నది ప్రథమంగా అనే మాట, ఆ రంగంలో అది నిజమే! తెలుగులోనే కాదు భారతీయ భాషల్లోనే కాదు, ప్రపంచ జానపద సాహిత్యంలోనే జానపదులు సాహిత్య విమర్శ చేయగలరన్న వాస్తవం ప్రకటించిన పరిశోధకుడు లేడు. కారణం వాళ్ళంతా మహామహుల వారసులు. నేను జానపదుల వారసుణ్ణి. జానపదుల వారసులు చాలామంది ఉండి ఉ ంటారు. అదృష్టశావత్తూ వాళ్ళీ విషయం నాకు కేటాయించి, నన్ను ధన్యుణ్ణి చేశారు.

**ఏ సాహిత్య ప్రక్రియనైనా సామాజిక నేపథ్యంలోనుండి చూడాలంటున్నారు. 'సమాజం' మాత్రమే వస్తువుగా చూడాలా?**

దేవుళ్ళూ, రాజులూ కాక, మనుషులూ కులాలూ మతాలూకాక, శ్రమశక్తి ఉన్న సాహిత్యాన్ని స్థూలంగా ఆధునిక సాహిత్యం అంటున్నారు. యజమాని-బానిస సంబంధాలు, పీడకుడు-పీడితుల వ్యవహారాలు, స్త్రీ-పురుష సంబంధాల్లో ఆర్థికపీడన, లైంగిక దోపిడీ ఉండని విషయాలు, వర్ణవ్యవస్థను తిరస్కరించే విషయాలు, శ్రమదోపిడి లేని జీవితం, అభివృద్ధి చెందిన మానవ సమూహాలు, సమాజం కోరే అంశాలు, సమాజానికి అవసరం అనే దృష్టి ఉండే సమాజమే సాహిత్యంలో ప్రతిబింబించాలని ఆశించడం, సమాజ పరిణామం కోరడం, మరో మానవతాలోకం ఆవిర్భవించాలని ఆశించడం, ఈ 'సమాజ రచయితలు' తమ రచనల్లో చూపుతారు. కులం లేని వాళ్ళని, ధనం లేని వాళ్ళని, తృణీకరింపబడేవాళ్ళు, నలుగురితో అన్ని విధాలా సమానులు కావాలన్న ఆశతో, ఆశయంతో వీళ్ళు సాహిత్యం సృష్టిస్తారు.

**మీ తొలి 'ఉత్తరం' కథానికకు, నేడు వస్తున్న కథానికలకు శిల్పంలో వచ్చిన మార్పులేమిటి?**

'ఉత్తరం' కథానికలో నేను కోరిన లోకం నా కన్నీరు తుడుస్తుందని, నన్ను ఓదారుస్తుందని భావించాను. ఇప్పుడు వస్తున్న కథానికల్లో సమస్యలకు పరిష్కారాలు ఆలోచించమని సమాజాన్ని కోరుతున్నాను. వస్తువును బట్టి శిల్పం ఉంటుంది. రచయితను బట్టి శైలి ఉంటుంది. శైలీ శిల్పాలు స్థిరాస్తులు కాదు. చరాస్తులు. ఉమ్మడి సొమ్ములు కావు. వైయక్తిక స్వార్జితాలు.

**విదేశీ కథానికల స్థాయి కంటే మన కథలస్థాయి ఉ న్నతంగా ఉందనే భావిస్తున్నారా?**

ప్రపంచమంతటా అన్ని దేశాల్లో, అన్ని భాషల్లో కథానికలు వెలువడుతున్నాయి. ప్రసిద్ధమైనవి, ప్రఖ్యాతి పొందినవి, బహుమతులు పొందిన వాటిని కొన్నింటిని చదువుకుంటాం. అద్భుతంగా ఉన్నాయని ఆనందిస్తాం. కొన్ని కథానికలు చదివినప్పుడు ఇంతకంటే మంచి కథానికలు భారతీయ భాషల్లో ఉన్నాయని భావిస్తాం. అలా వెలువడిన వాటి తెలుగు అనువాదాలు చదివి గొప్పగా ఉన్నాయని అనుకొంటాం. ఈ కథానికల ఆంగ్లానువాదాలు లభ్యమయితే ప్రపంచం వాటిని, వీటితో పోల్చి చూసుకొంటుంది. ప్రపంచంలో ప్రసిద్ధమైన వాటికంటే గొప్ప కథానికలు తెలుగులో చాలా ఉన్నాయని మనం గుర్తిస్తాం. ప్రపంచం గుర్తించాలంటే అవి ఆంగ్లంలోనే ఉండాలి. ఠాగూర్ గీతాంజలిని ఆ మహాకవి అనువాదం చేసుకుంటే, నలుగురు నాలుగు చేతులు వేస్తే, అనేక సభలు పెట్టి పరిస్తే, ఆంగ్లేయ ప్రచురణ కర్తలు దాన్ని ముద్రిస్తే ప్రపంచం దృష్టి దాని మీదకు వచ్చింది. తెలుగు వాళ్ళ గొప్ప సాహిత్యం ప్రపంచం దృష్టిని ఆకర్షించాలంటే, మన సాహిత్యం మంచి ఆంగ్లంలోకి అనువాదం కావాలి.

**మీరు రాసిన గ్రంథాలు మొత్తం ఎన్ని ఉన్నాయి? కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు విమర్శ ఇలా సంఖ్య చెప్పండి.**

కవిత్వం 16 సంకలనాలు, నాటకాలు 12, నాటికా సంకలనాలు 7, నవలలు 15, కథానికా సంకలనాలు 12, సాహిత్య విమర్శపై 15 గ్రంథాలు, సంకలనాలు, ఆంగ్ల రచనలు, ఆంగ్లానువాదాలు 10, పరిశోధన గ్రంథాలు 17, అలా నేను మొత్తం 104 రచనలు చేశాను. నా సాహిత్యం మీద 22 పిహెచ్.డి గ్రంథాలు, 21 ఎం.ఫిల్ గ్రంథాలు, యూజిసి పరిశోధనానంతర ప్రాజెక్టు పరిశోధనలు 7 వచ్చాయి. ఇంకా నా సాహిత్యంపై 27 వ్యాస సంకలనాలు, గ్రంథాలు

వచ్చాయి. అనువాదాలైతే కవిత్వం, నాటకం ఇతర సాహిత్యం కలిపి ఆంగ్లంలో 18, హిందీలో 13, కన్నడంలో 7, తమిళంలో 2, మలయాళంలో 2, ఒరియాలో 2, మణిపురి, పంజాబీ భాషల్లో ఒక్కొక్కటి గ్రంథాలు వచ్చాయి. నా ఆంగ్ల కవిత్వ గ్రంథమైన 'వాయిస్ ఆఫ్ సైలెన్స్'ను డా.అద్దేపల్లి 'నిశ్శబ్ద స్వరం' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు.

**మీరు ఎన్నో నాటకాలు రచించారు. ఎక్కువగా రేడియోకే పరిమితమయ్యాయని, పరిషత్తు నాటకాల్లో ప్రదర్శించబడలేదని కొందరు నాటక ప్రయోక్తలు అనడం విన్నాను.**

నా నాటకాల్లో వస్తువైవిధ్యం ఉంది. సంప్రదాయం, ప్రయోగం కూడా ఉంది. దృశ్య, శ్రవ్య నాటకాలు రెండూ ఉన్నాయి. శ్రవ్యనాటకంగా ఉన్న 'మునివాహనుడు' దృశ్య నాటకం అయింది. ఇప్పటికి డా.కొట్టి వెంకటాచార్యులు గారు దాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. పరిషత్తుల్లో నా నాటకాలు, నాటికలు ఎక్కువగా ప్రదర్శింపబడక పోవడానికి నేనే కారణం. నేను బాల్యంలో నటించేవాణ్ణి. నేను నాటకాలు వ్రాయడం ప్రారంభించాక, ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో దర్శకత్వ బాధ్యతలు కూడా నేనే తీసుకున్నాను. నా 'మంచు శిఖరం' నాటకానికి అక్కడ బహుమతి పొందింది. 'కీ', 'మేలుకొలుపు', 'దృష్టి' మొదలైన నాటకాలు చాలా ప్రదర్శనలు పొందాయి. 'దిక్కులేనోడు' అనేక ప్రదర్శనలు పొంది పరిషత్తులలో బహుమతి పొందింది. దర్శకత్వం వహించాలన్నా, ప్రదర్శించే సంఘాలకు సలహాలు సూచనలు ఇస్తూ ఉండాలన్నా, అయితే, ఎక్కువ సమయం ఒక్క నాటకానికి/ నాటికకు కేటాయించే తీరిక నాకు లేదు. నేను నాటికలు, నాటకాలు రాస్తాను. ఆత్మీయులు స్వీకరిస్తారు, ప్రదర్శిస్తారు. అంతే నా లక్ష్యం.

**ఈనాటి యువకవులకు/ కథా రచయితలకు/ సాహిత్య స్రష్టలకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

సందేశం అని కాదు గానీ, నా మాటలు ఆలోచించమని అంటాను. ఏ కాలానికి, ఏ దేశానికి, ఏ సమాజానికి అవసరమైన సాహిత్యం ఆ కాలంలో, దేశంలో, ఆ సమాజంలో సృష్టింపబడుతుంది. అందుకు యువకుల్ని, కళాకారుల్ని, పుణ్యశీలుర్ని ఆ సమాజం ప్రోత్సహిస్తుంది. వాళ్ళు ఆ కాలానికి అనుగుణంగా సాహిత్యాన్ని సృష్టిస్తారు. ఆ సాహిత్యం సమాజ అవసరాలను తీరుస్తుంది. సృజనశీలత ఉన్న హృదయవాదులను సమాజ అవసరాలను తీర్చే సాహిత్యం అందించమని కోరుతున్నాను. వైయక్తిక ఆనందం కంటే, వ్యావస్థిక ఆనందం కోసం ఆరాటం సాహిత్యంలో పోరాటం చేయమని అర్థిస్తున్నానని చెప్పండి. శుభాకాంక్షలు. ■

# వెతుకులాట

**బా**పూని వెదుకుతున్నాను
మహాత్మా గాంధీని వెదుకుతున్నాను
నువ్వే చెప్పావు బాపూ
మళ్ళీ జన్మంటూ ఉంటే
అంటరాని వాని ఇంటనే పుడతానని
అందుకే బాపూని వెదుకుతున్నాను
మహాత్మా గాంధీని వెదుకుతున్నాను

కానీ మీ చిరునామా దొరకడం లేదు బాపూ!
మొన్న అక్కడ ఖైర్లాంజీలో ఆక్రమించబడిన భూమి
మీది కాదుగా?
నిన్న చుండూరులో దాడి జరిగింది మీపై కాదుగా?
ఈరోజు గుజరాత్‌లో బావిలో నీరు దొరకక
ఖాళీ మట్టికుండతో వెనక్కి వెళ్ళింది నువ్వు కాదుగా?
ఆయాల
రాజస్థాన్‌లో ఆ వూర్లో వెలివేసింది
మిమ్మల్ని కాదుగా?

చెప్పు బాపూ!
ఎక్కడున్నావు నువ్వు
ఝూంఝు మేర్, మీఠాఘోడా, రణమల్ పురా, బెల్ఛీ
బీహార్, లేక ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోనా?

ఎక్కడున్నారు మీరు?
ఏ అంటరానివాని ఇంట్లో ఉన్నారు
బయటకి రండి బాపూ ...

మతిమరపుతో ఎక్కడ మీరు హత్యకు గురౌతారో ఎక్కడ
గాడ్సేలు మీకోసం పొంచి ఉంటారో అని
నా మనసు నన్ను హెచ్చరిస్తుంది
అనుదినము నేను
ఈ వేదనతోనే బెంగటిల్లుతున్నాను

బాపూని వెదుకుతున్నాను
నేను మహాత్మా గాంధీని వెదుకుతున్నాను!

మూలం : **జయంత్ పర్మార్**, గుజరాతీ కవి
తెలుగు : **డా.జి.వి.రత్నాకర్**
**70135 07228**

# రొట్టె

- డాక్టర్ ఎన్.గోపి



పెంక మీద
రొట్టెను కాలుస్తున్నప్పుడు
లేచే వాసనను
ఆకలి పరిమళం అంటాన్నేను
వంటింటి గోడలు కూడా
ముక్కు లెగరేస్తాయి.

ఈ పెంక
మా నాయనమ్మ కాలం నుంచీ వుంది
మా ఆవిడకు వారసత్వంగా వచ్చింది
దీని విస్తీర్ణంలో కదలడానికి
రొట్టెకు బోలెడంత జాగా ఉంటుంది.

మా ఆవిడ సరాతంతో
అటూ ఇటూ జరుపుతున్నప్పుడు
ఆమె ఏదో కొత్త పాటకు
ఆయత్తమౌతున్నట్టుగా వుంటుంది.
ఏ పక్కకు ఎంత సెగ తాకాల్నో ఆమెకు మాత్రమే తెలుసు
అక్కడక్కడ మాడితేనే నాకిష్టం
అవి బుజ్జి కండ్లుగా మారి
నన్నే తిలకిస్తున్న ఫీలింగ్.

జొన్న కంకుల పైన కిరీటాలు
గోధుమ తలపై తురాయిలు
గుర్తుకొస్తాయి గాని
ఇప్పుడవన్నీ స్మృతి వీధుల్లోకి నిష్క్రమిస్తున్నాయి.

చక్కెర వ్యాధి వచ్చినప్పటి నుంచి
రొట్టెలపై మమకారం పెరిగింది
అవసరాన్ని మించిన ఆనందం ఉంటుందా!

రొట్టెల కాలం వచ్చేసరికి
దంతాలు వొదులైనాయి
తినడం ఓ ఇంజనీరింగ్ ఫీట్.
మా అమ్మ వేడి వేడి ఛాయలో నానబెట్టి తినేది.

ఆఫీసు లంచ్ టైంలో
బాక్స్‌లోంచి రొట్టెను తీస్తే
సహోద్యోగులు అసూయగా చూసేవాళ్ళు

పొద్దున
నాది రొట్టెల సమయం
పల్లెలు మా ఇంట్లోకి తెచ్చిన
రొట్టె నా బాల్య బంధువు.

నేనివాళ రొట్టె పక్కన
నిలబడి మాట్లాడుతున్నాను.
విసుర్రాయిలో గింజ నలుగుతున్న
మెత్తని ధ్వనిని వింటున్నాను
దాని పెదవుల్లోంచి ప్రేమ రాలుతున్నట్టుగా భావిస్తున్నాను.

గతంలో రొట్టె గురించి రాశారు కదా
అన్నాడు కవి ఆశారాజు
ఇంకా ఆకలి తీర లేదు గదా
అని నా జవాబు.

■



# టర్నింగ్ పాయింట్

- బంగార్రాజు కంఠ
85003 50464

పోస్టింగ్ తీసుకున్న డియ్యేస్పీ వీరేశ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాలు పంచుకోవడానికి రానున్నందున సెంటర్ కొద్దిపాటి కోలాహలంగా మారింది. గత ఏడాది మొదట్లో డియ్యేస్పీగా సెలెక్టయ్యి ట్రైనింగ్ కంప్లీట్ చేసుకుని వచ్చిన వీరేశ్‌కి ఇది మొదటి పోస్టింగ్. అలాగే ఈ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఒక చరిత్ర ఉంది. స్వతంత్ర్యానికి పూర్వం డా.బి.ఆర్.అంబేద్కర్ ఆంధ్రదేశ పర్యటనకు వచ్చినప్పుడు ఇక్కడ జరిగిన బహిరంగ సభలో మాట్లడటం జరిగిందనీ, దానికి గుర్తుగా సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చెయ్యటం జరిగిందనీ అంటుంటారు.

ఎదురు చూస్తున్నంతలో డియ్యేస్పీ గారు రానే వచ్చారు. వస్తూ వస్తూ సభావేదిక పక్కనున్న విగ్రహానికి పూలమాల వేసి మోకాళ్లపై మోకరిల్లారు. సభావేదికను అలంకరించాక పెద్దలందరూ మాట్లాడ్డం అయిపోయాక సభాధ్యక్షులు డియ్యేస్పీ వీరేశ్ గారిని మాట్లాడవల్సిందిగా కోరారు. మొదట తడబడ్డా గంట ప్రసంగం అలవోకగా సాగింది. ఈ ఊరితోనూ, ఈ సెంటర్‌తోనూ తనకు గల సంబంధాన్నీ, అనుబంధాన్నీ తెలియజేస్తూ ఒకానొక అంబేద్కర్ జయంతి రోజున అంటూ ఇరవై ఏళ్ళు వెనక్కెళ్లాడు వీరేశ్.

■■■

స్థలం వంగాయగూడెం సెంటర్.

ఏలూరు టౌన్లో ఈ సెంటర్‌కి ప్రత్యేకత ఉంది. ఇదొక దళిత జనారణ్యం. అడివన్నాక పులులూ లేళ్ళూ పిల్లులూ కుక్కలూ కోతులూ గుంటనక్కలూ అన్ని రకాలూ ఉంటాయి కదా! అరుంధతీ పేటను కలుపుకుని రమారమి వెయ్యి గడప. అప్పట్లో ఈ సెంటర్‌కి వచ్చే ఎంతటి కొమ్ములు తిరిగి, తోకలు మొలిచిన మొగోడైనా అవి మడిచి లోపలెక్కడో దాచుకుని వచ్చామా పనిచూసుకుని వెళ్ళామా అన్నట్టే ఉండాలి.

సమయం సాయంత్రం దాటేసి రాత్రిలోకి అడుగు పెట్టడానికి ఆరాటపడుతోంది. ఇంతలో పెద్దిరాజు పందులెంకన్నను పొడిచి చంపేసాడన్న వార్త ఎండు మిరపకాయల ధూపం పెట్టినంత ఘాటుగా గుప్పుమంది. సెంటరంతా క్షణాల మీద సర్దుకుని మూత పడిపోయింది.

పెద్దిరాజూ, పందులెంకన్న ఇద్దరూ మంచి జతగాళ్ళు. ఎంత దోస్తులంటే ఒకరి నోట్లో సిగరెట్ పీకను ఇంకొకరు కాల్చుకునేంత. ఇద్దరూ కలిసి పందుల వ్యాపారం చేస్తుంటారు. ప్రతి ఆదివారం సెంటర్లో ఓ పక్కగా తలుపు చెక్కేసి దానిమీద నాటుపంది మాంసం అమ్ముతుంటారు. సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వీళ్ళ దుకాణాన్ని చూపిస్తున్నట్టే ఉటుంది. మాంసం అంతా అమ్మేసాక ఇద్దరూ కలిసి ఎదురుగా వున్న సారాకొట్టులో వారుణీ వాహిని పూటుగా తాగి ఒకరినొకరు తిట్టుకుంటారు.. కొట్టుకుంటారు. ఇవన్నీ వాళ్ళ సరసాలని సెంటర్లో అందరికీ తెలుసు. ఈ రోజూ అలాగే జరిగింది. సారా తాగి తిరిగొస్తూ పెద్దిరాజు సిగరెట్ వెలిగించాడు. కొద్దిగా కాల్చాక పెద్దిరాజు నోట్లో సిగరెట్ లాక్కుని వెంకన్న సొంతం ఊది పారేసాడు. దానికి మండిపడ్డ పెద్దిరాజు వెంకన్నతో గొడవ పడ్డాడు. మాటామాట పెరిగి పెద్దిరాజు పందిమాసం కోసుకునే కత్తితో వెంకన్నను పొడిచేసాడు. వెంకన్న అక్కడికక్కడే చనిపోయాడు. చూపుడు వేలు చూపిస్తూ అంబేద్కర్ అలాగే నవ్వుతున్నాడు. కానీ నవ్వుకి విషాదాన్ని పులిమినట్టుగా

ఉంది. అతడు చేతబట్టిన పుస్తకంలో అక్షరాలు కుంచించుకు పోతూవుంటే ఆందోళన పడుతున్నట్టు తోస్తున్నాడు. చిన్న సిగరెట్ పీక కోసం చంపేస్తాడా? వెనక ఏదో వుందని చుట్టుపక్కల ఇళ్ళన్నీ చెవులు కొరుక్కోవడం మెదలు పెట్టాయి. నిజానికి అటువంటిదేదీ లేదు. పెద్దిరాజూ, వెంకన్నలిద్దరూ జీవితం మీద ఎటువంటి ఆశలూ అంచనాలు లేని బతుకెళ్లదీస్తున్నారు. జీవితానికి ఒక విలువుందనీ, దానిని పెంచుకోడానికి గానీ, తగ్గించుకోడానికి గానీ, అసలు వుంచుకోడానికి గానీ ప్రయత్నం చెయ్యాలని తెలీదిద్దరికి. ఇద్దరూ జీవితం ఒక సిగరెట్ పీకని తేల్చి చెప్పేసారు.

చనిపోయిన వెంకన్న భార్య భూలచ్చి, నిజంగా భూదేవంత ఓర్పున్న మనిషి. బడుగు భార్యలు నిత్యం మోసుకు తిరిగే సన్నివేశాలు ఈమెకూ తప్పలేదు. మొగుళ్ళు పీకల దాకా తాగి పెళ్ళాల ఒల్లు పులిసేదాకా తన్నడం తరాలుగా దొర్లుతున్న దృశ్యం. ఇంటిదాని కన్నీటితో తడవని ముద్ద మెజారిటీ బడుగుజాతి మగోల్లకి దిగదు గాక దిగదు. పుట్టింటికి పోలేక, మొగుడు పెట్టే బాధలు తట్టుకోలేక, పిల్లల్ని వదిలి చావలేక .. బతుకు కరెంటు తీగకు తగిలి తన్నుకులాడుతున్న కాకితల్లులు గూడెపు ఆడపిల్లలు. మొగుడు చచ్చాడనే దుఃఖం కన్నీరై జారుతున్నా అంతరాంతరాల్లో మనసు తేలికపడ్డ భావం భూలచ్చికి ఓదార్పునిచ్చింది. పేరుకు మొగుడు కాని ఏనాడూ అలా నడుచుకోలేదు వెంకన్న. ఎప్పుడూ తాగి రావడం, ఏదో వంకతో చితకబాదడం, ఇంతకు మించి భూలచ్చి మొగుడి దగ్గరనుంచి పొందలేక పోయింది. భూలచ్చే కాదు; ఇలాంటి ఎందరో అట్టడుగు భూలచ్చిలు భుజాలకెత్తుకు తిరిగే బతుకు చిత్రమిది. అందుచేతనో ఏమో, వెంకన్న చావు తాలూకు ప్రకంపనలు భూలచ్చిని దుఃఖం, సంతోషం అనే రెండు అస్పష్ట నీడలై ఆవరించాయి. కేవలం పిల్లల మీద తీపి భూలచ్చిని వెంకన్నతో కలిసుండేట్టు చేసాయి. పెద్దిరాజు ఊసలు వెనక్కెల్లాక, మత్తు సొంతం దిగాక ప్రాణస్నేహితున్ని ఉత్తి పుణ్యాన చంపేసినందుకు రవ్వంత బాధపడ్డాడు తప్ప అంతకుమించి లోతుకు వెళ్ళలేకపోయాడు. తన జీవితం గానీ, వెంకన్న జీవితం గానీ వారి వారి కుటుంబాల గురించి గానీ ఆలోచించే ప్రయత్నం చెయ్యలేకపోయాడు. అంతటి పరిణితి ఇద్దరిలో ఏ ఒక్కరికీ లేదు. వ్యసనం ఆలోచనని మింగేస్తుందనడానికి పెద్దిరాజు, వెంకన్నల జీవితమే నిదర్శనం. తళుకు బెళుకుల లోకం వెలుగు సోకని కీకారణ్యం వీళ్ళ నేపథ్యం. ఎందుకు పుట్టామో, ఎందుకు బతుకుతున్నామో అసలెందుకు సచ్చిపోతున్నామో కూడా తెలియని కథలు ఇంటి గోడలకి వేలాడుతుంటాయి దేశంలోని ఇలాంటి పేటల్లో.

వెంకన్న, భూలచ్చిల కొడుకు ఈరేసు ఇప్పుడిప్పుడే బడిఒడిలోకి అడుగు పెడుతున్నాడు. కూతురు శ్రావణిది తల్లిపాలు మానేయడం మొదలౌతున్న వయసు. ఇద్దరు పిల్లలతో దిక్కుతోచని భూలచ్చి బెజవాడ పుట్టింటికి చేరింది. కొడుకుని సాంఘిక సంక్షేమ హాస్టల్లో వేసింది. కూతుర్ని తన దగ్గరే పెట్టుకుని వీధి చివర దుంపల బడిలో చేర్పించింది. తను నాలుగిళ్ళల్లో పాచి పనికి కుదిరింది. భూలచ్చి జీవితం గాలివాటు నడకలా గడిచిపోతుంది. పిల్లల చదువులు ఎలా సాగుతున్నాయో తెలీదు. చదువులు సాగించాలా, మాన్పించాలా అనే ప్రస్తావన రాకుండా తరగతి తరగతిగా సంవత్సరాలు దొర్లిపోతున్నాయి.

ఈ క్రమమంలో ఈరేశుకి తరుచూ తారసపడ్డాడు ఒక వ్యక్తి. అతడు పరిచయం కావడం తన జీవితానికి టర్నింగ్ పాయింట్ అంటాడు ఈరేశు. అతడు ఈ ఊరిలోనే కాదు, ఈ దేశం ఏ మూలకెళ్ళినా పలకరిస్తూనే ఉంటాడు. అదే చిరునవ్వూ.. అదే చూపుడువేలూ.. చేతిలో అదే పుస్తకం. అతని నుంచి స్ఫూర్తీ, చైతన్యం పోగుచేసుకుని ప్రపంచం మొత్తం గుండెల్లో నిలుపుకున్న వ్యక్తి. ఆధుని భారత జీవన విధానానికి తన ఆలోచనల్ని ఎరువుగా జల్లి ఈ దేశపు గూడేలకు మాత్రమే పరిమితమైపోయిన వ్యక్తి. అతడు ఎదురుపడుతున్న కొద్దీ ఈరేశుకి జీవితం పట్ల కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు గూడు కట్టుకుంటూ వచ్చాయి. చదువూ దాని ఆవశ్యకత తెలిసొచ్చింది. చదువు అనేది బడుగువాడి ఆస్తీ, ఆయుధం అని పసిగట్టాడు. చదువుకుని బతుకుల్ని బాగుచేసుకోవచ్చని మరికొన్ని బతుకుల్ని బాగుచెయ్యొచ్చని నమ్మకం కుదిరింది. చదువిచ్చిన ధైర్యంతో ముందటేడు గ్రూప్ వన్ పరీక్షల్లో ఈరేశు డియ్యస్పీగా సెలక్టయ్యాడు.

ఇరవై ఏళ్ళ క్రితం చిన్న సిగరెట్ పీక కోసం హత్య గావించబడ్డ పందుల వెంకన్న కొడుకు ఈ డియ్యస్పీ వీరేశ్. భర్త చనిపోయాక ఇద్దరు పిల్లలతో ఎలా బతకాలో తెలియక పుట్టింటికి చేరిన భూలచ్చి బిడ్డే ఈ వీరేశ్ అనబడే ఈరేశు అని గుర్తు చేశాడు. సభకు హాజరైన రెండు వేల మందీ విస్మయానికి గురయ్యారు. అంతలోనే తేరుకుని హర్షధ్వానాలు చేశారు. వెన్నుతట్టి ప్రోత్సహించడానికి తండ్రి లేదు. దారి చూపి నడిపించడానికి తల్లికి లోకజ్ఞానం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి ఒకరున్నారనీ, ఆయన అండ వల్లనే ఈ ఈరేశు డియ్యస్పీ వీరేశ్ అయ్యాడనీ, ఆ చూపుడువేలు దారి చూపబట్టే మీ ముందుకు రాగలిగాడనీ చెప్పడంతో 'జోహార్ డా.బి.ఆర్. అంబేద్కర్'' "జోహార్ డా. బి.ఆర్ అంబేద్కర్' అంటూ నినాదాలు మిన్నంటాయి. వీరేశ్ తన విజయాన్ని విత్తనాలుగా గూడెంపైకి వెదజల్లాడు. స్ఫూర్తిని నింపుకుని ముందు ముందు మరిన్ని విజయాలుగా మొలకెత్తాలన్న ఆశతో. వేదిక పక్కనున్న అంబేద్కర్ అలాగే నవ్వుతున్నాడు, ఈ సారి తృప్తిని నింపుకున్న కళ్ళతో. వీరేశ్ మాత్రం బాబా సాహెబ్ తలపెట్టిన యజ్ఞం 'పే బ్యాక్ టు ది సొసైటీ'లో పాలు పంచుకోడానికి అన్నట్టు అక్కడ నుంచి అడుగులేస్తూ ముందుకు సాగాడు.

■



# నేనెక్కడున్నాను?

అడవి బిడ్డను నేను
జనారణ్యంలోకి తప్పిపోయాను
పచ్చని వెచ్చని అడవితల్లి పొత్తిళ్లేవి!
నెత్తిమీద పచ్చని ఆకుల గొడుగు మాయం
సేదతీర్చే చల్లని గాలులు మృగ్యం
జీవరక్షణ పొర పగిలి
నోరు తెరుచుకుంది ఆకాశం
బంధించింది సెగలపొగల వలయం..

చుట్టు అత్యాశల ఆకాశ సౌధాలు
చుట్టుముట్టిన సెల్ఫోను తరంగాలు
నడిచే దారుల్లో
కలుషిత ఆలోచనల ముండ్లపొదలు
కసి తీర్చుకునే కరోనా కోరలు
ముసుగు ధరించింది మానవత్వం
దూరాన్ని పెంచింది భయం..

మనిషిని పట్టించుకోని మనిషితనం
మాయమైపోతున్నాయి ..
మానవ సంబంధ బాంధవ్యాలు
ఏ తీరాలకీ పయనం
ఎంతకాలమీ కపటత్వం
ఎందుకీ జీవితం..?

**- డా. పి.విజయలక్ష్మి పండిట్**



# మిరపకాయ బజ్జీ

నవనవలాడే యవ్వనంతో
నూనూగు తొడిమ మీసంతో
నిగనిగలాడే అందంతో మెరిసే
యవ్వనపు మిరపకాయను చేతబట్టి,
నిలువునా ప్రేమ బాణాలతో చీల్చి
మాసాలా ముద్దను ముద్దుగా నింపి
శనగపిండి కౌగిలిలో బంధించి
సలసలకాగే మోహపు నూనెలో వదిలితే ...
అలుపెరగని అలల విరహపు సెగలతో
చిటపటలాడే సరిగమల సవ్వడిలో
తనివితీరా మునిగి తేలుతూ
కరకరలాడే కండలతో బయటపడగానే,
కొరకొరలాడే మీసం చేతబట్టగానే
నోటిలో లాలాజలం పొంగిపొర్లుతుంటే
ఉల్లిపాయల ముక్కల తోడుగా
కమ్మని పొడులను చిలకరించుకోగా,
కళ్ళు మూసుకొని కసుక్కున్న కొరకగానే
నాలుకను తాకే అమోఘమైన రుచి
హృదయాంతరాలను చేరుకోగానే
వాడి వలపు మైకంలో పడిపోతాం!

చినుకుల పలకరింపు వేళల్లో
చల్లని సాయంత్రాల గాలుల్లో
చెలికాడిలా చెంతకు చేరిపోయే
వేడివేడి మిరపకాయ బజ్జి
ఎవడిని తింటే నాలుక కరిగి
మైకం కమ్మేస్తుందో
వాడే మిరపకాయ బజ్జిగాడు!

**- పుట్టి గిరిధర్**

**94914 93170**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : పిల్లా కుమార స్వామి

**1. నన్నెచోడుడు రచించిన కావ్యం**

ఎ. వినాయక విజయం  బి. కుమార సంభవం  సి. కథా సరిత్సాగరం  డి. స్వారోచిషమనుసంభవం

**2. 'అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ' అని రాసిందెవరు?**

ఎ. తెనాలి రామకృష్ణ  బి. రామరాజ భూషణుడు  సి. అల్లసాని పెద్దన  డి. శ్రీకృష్ణదేవరాయలు

**3. రామరాజ భూషణుడు ఏ ప్రాంతం వాడు?**

ఎ. భీమవరం  బి. తెనాలి  సి. పులివెందుల  డి. ఆదోని

**4. భేతాళ కథలను ప్రచురించిన పత్రిక ఏది?**

ఎ. బాలమిత్ర  బి. చెకుముకి  సి. చందమామ  డి. బాలజ్యోతి

**5. ఆంధ్రుల సాంఘిక చరిత్ర రాసిన రచయిత**

ఎ. సురవరం ప్రతాపరెడ్డి  బి. సురవరం సుధాకరరెడ్డి  సి. మల్లంపల్లి సోమశేఖరశర్మ  డి. బి.ఎన్. శాస్త్రి

**6. రంగనాథ రామాయణం రచయిత**

ఎ. రంగనాథుడు  బి. గోన బుద్దారెడ్డి  సి. ఆతుకూరి మొల్ల  డి. విశ్వనాథ సత్యనారాయణ

**7. వీరేశలింగం రచించిన రాజశేఖర చరిత్రకు ఆధారమైన ఆంగ్ల నవల**

ఎ. ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్  బి. ది కామెడీ ఆఫ్ ఎర్రర్స్  సి. ఒథెల్లో  డి. వింటర్స్ టేల్స్

**8. ఇప్పటి వరకు లభించిన ఆధారాలను బట్టి మొట్టమొదటి నవల ఏది?**

ఎ. రాజశేఖర చరిత్ర  బి. శ్రీరంగరాజ చరిత్ర  సి. రేనాటి వీరుడు  డి. ప్రజల మనిషి

**9. గురజాడ రాసిన మతము - విమతము కథకున్న మరోపేరు**

ఎ. దిద్దువాటు  బి. పెద్ద మసీదు  సి. మీ పేరేమిటి?  డి. మతసామరస్యం

**10. 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అన్న కవి ఎవరు?**

ఎ. జాషువా  బి. గురజాడ  సి. శ్రీశ్రీ  డి. దాశరథి

**11. 'మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్టంగాను చూస్తావేల బేలా?' అన్నదెవరు?**

ఎ. నార్ల వెంకటేశ్వరరావు  బి. వేమన  సి. గురజాడ  డి. జాషువా

**12. ఏ రచయిత జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము?**

ఎ. గురజాడ  బి. జాషువా  సి. గిడుగు రామమూర్తి  డి. కందుకూరి వీరేశలింగం

**13. అంతర్జాతీయంగా కథల పోటీల్లో బహుమతి పొందిన మొట్టమొదటి తెలుగు కథ**

ఎ. గాలివాన  బి. పిపీలికం  సి. ఇల్లరికం  డి. తులసిదళం

**14. ఆంగ్లంలోని 'నావెల్' పదాన్ని తెలుగులో 'నవల'గా పేరు పెట్టిన రచయిత ఎవరు?**

ఎ. గురజాడ  బి. వీరేశలింగం  సి. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి  డి. కె.వి. రమణారెడ్డి

**15. పద కవితా పితామహుడని ఎవరిని పిలుస్తారు?**

ఎ. అల్లసాని పెద్దన  బి. త్యాగయ్య  సి. అన్నమయ్య  డి. తెనాలి రామకృష్ణ

**16. భట్టుమూర్తి అని మరోపేరుతో పిలువబడిన కవి ఎవరు?**

ఎ. రామభద్రకవి  బి. రామరాజ భూషణుడు  సి. నాచన సోమన  డి. నన్నెచోడుడు

**17. బసవపురాణం రాసిన కవి**

ఎ. పాల్కురికి సోమన  బి. నాచన సోముడు  సి. బసవన్న  డి. అక్కమహాదేవి

**18. రామరాజభూషణుడు రాసిన ప్రబంధ కావ్యం**

ఎ. మనుచరిత్ర  బి. వసుచరిత్ర  సి. సత్యవంతుని చరిత్ర  డి. పారిజాతాపహరణం

జవాబులు : **1. బి 2. సి 3. సి 4. సి 5. ఎ 6. బి 7. ఎ 8. బి 9. బి**
**10. బి 11. సి 12. సి 13. ఎ 14. సి 15. సి 16. బి 17. ఎ 18. బి**



# రాజీపడని విమర్శకుడు శిల్పమెరిగిన కథకుడు

- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

**శ్రీశ్రీ** అనే పేరుతో ప్రసిద్ధుడైన రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు. అలాగే 'రా.రా' అనేక రెండక్షరాల పేరుతో ప్రసిద్ధమైన రచయిత రాచమల్లు రామచంద్రారెడ్డి. ఈ ఇద్దరి మధ్య ఈ సామ్యంగా ఉండడం ఒక వాస్తవం కాగా, శ్రీశ్రీ రారానూ క్రూరుడైన విమర్శకుడని నిర్వచించడం మరో వాస్తవం. ఈ ఇద్దరూ మార్క్సిస్టు సాహిత్యం తానులో పోగులే! రారా మార్క్సిస్టు మేధావి, అభ్యుదయ రచయిత. తెలుగు అభ్యుదయ రచయితల్లో రారా రెండోతరం రచయిత. కుందుర్తి, ఆరుద్ర, అవంత్స, గజ్జెల మల్లారెడ్డి వంటి వారి తరానికి చెందిన రచయిత. రారా ప్రధానంగా సాహిత్య విమర్శకుడు, ఆ తర్వాత అనువాదకుడు. అనువాద తత్వవేత్త, కథకుడు, బాల సాహిత్య రచయిత, పాత్రికేయుడు.

1922 సెప్టెంబర్ 28న కడప జిల్లా సింహాద్రిపురం మండలం పైడిపాళెంలో ఒక వ్యవసాయ కుటుంబంలో ఆయన జన్మించారు. లక్ష్మమ్మ, బయపరెడ్డి వారి అమ్మానాన్నలు. 1931-37 మధ్య పులివెందులలో పాఠశాల విద్య, 1937-39 మధ్య అనంతపురంలో ఇంటర్ చదివారు. ఆ తర్వాత చెన్నైలోని ఇంజనీరింగ్ కళాశాలలో చేరి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, కళాశాల నుంచి బహిష్కరణకు గురయ్యారు. క్షమాపణ చెప్పి ఉంటే చదువు కొనసాగేది. రాజీపడలేదు గనుక చంద్ర పుల్లారెడ్డితో పాటు రారా కూడా చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. రారా సవ్యసాచి (1959 -63), సంవేదన (1968-69) వంటి అనే సాహిత్య పత్రికలకు సంపాదకత్వం వహించారు. ప్రజా సాహిత్య వికాసానికి దోహదం చేశారు. విశాలాంధ్ర దినపత్రికలో ఆరు నెలలు (1964 జనవరి - జూన్) ఉప సంపాదకులుగా పని చేశారు. ఈనాడులో రెండేళ్ళ (1977 ఏప్రిల్-1979 మార్చి) పనిచేశారు. మాస్కోలో ఆరేళ్ల ప్రగతి ప్రచురణాలయంలో (1969-75) అనువాదకుడిగా పనిచేశారు. 1959-85 మధ్య దాదాపు మూడు దశాబ్దాలు ఆయన రచనా జీవితం గడిచింది. 1957 -59 మధ్య ఆయన కొన్ని కథలు రాశారు. అవి 1960లో అలసిన గుండెలు పేరుతో వచ్చాయి. 1959 - 85 మధ్య విభిన్న పత్రికల్లో ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు 'సారస్వత వివేచన' (1976), 'వ్యక్తి స్వాతంత్ర్యం సామాజిక శ్రేయస్సు' అనే గ్రంధాలుగా వచ్చాయి. స్వయంగా అనువాద అనుభవం ఉండటం వల్ల, అనువాదం గురించి నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండటం వల్ల ... రారా అనేక రకాల తెలుగు అనువాదకుల రాతలను అధ్యయనం చేసి 'అనువాద సమస్యలు' అనే పేరుతో ప్రచురించారు. ఈ గ్రంథానికి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. ఇంకా కొన్ని సాహిత్య లేఖలు, బాలల రచనలు చేశారు.

1829 నుంచి క్రమంగా వికసిస్తూ వస్తున్న ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలకు కట్టమంచి 'కవిత్వతత్వ విచారం'తో ఒక పరిణామరూపం ఇచ్చినట్లే.. 1930లలో మొదలై క్రమ వికాసం పొందుతున్న మార్క్సిస్టు సాహిత్య విమర్శకు రారా తన వ్యాసాలతో పరిణతరూపం కల్పించారు. రారా కన్నా ముందు రాచకొండ నరసింహారెడ్డి, శ్రీశ్రీ, కొ.కు, మద్దుకూరి వంటి అనేకులు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు వేసిన పునాదిని రారా పటిష్టం చేసి పరిపుష్టం చేశారు. మార్క్సిస్టు విమర్శకులు ఎక్కువగా సాహిత్యంలో వస్తువునే అన్వేషిస్తున్న సమయంలో రారా వస్తు పరామర్శతో పాటు సాహిత్య రూపాన్ని కూడా గౌరవిస్తూ చర్చించారు. సాహిత్య శిల్పం గురించి గట్టి ఆలోచనలు చేశారు. సాహిత్యానికి సంబం ధించి రారా అందించిన సూత్రాలు చాలా విలువైనవి. అభ్యు దయ రచయితలకు వర్గదృక్పథం, మార్క్సిస్టుతత్వ దృక్పథం తప్పకుండా ఉండాలని ఆయనన్నారు. అభ్యుదయ కవిత్వం ఆనందం కన్నా ఉత్తేజం ఇవ్వాలన్నారు. జీవితంలో లాగే సాహిత్యంలోనూ రాజకీయాలు ఉంటాయని,

అయితే రాజకీయాలే సాహిత్యం కాదని గట్టిగా చెప్పారు. ఏ రకం రచయితలకైనా నిబద్ధత అనివార్యంగా ఉంటుందని కూడా రారా చెప్పారు. సాహిత్యానికి ప్రచార గుణం ఉన్నా కేవలం ప్రచారమే సాహిత్యం కాదన్నారు రారా. రచనలో వస్తువు, శిల్పంతో పాటు కళ కూడా ప్రధానంగా ఉంటుందని రారా అభిప్రాయపడ్డారు. వస్తు శిల్పాలు రెండూ సమన్వయం పొందాలని ఆయన పేర్కొన్నారు. "సాహిత్యంలో వస్తువు, శిల్పం అని రెండు అంకాలున్నాయి. ఒక రచనలో వస్తువు యెంత అమూల్యమైనదైనా, శిల్పం లేకుంటే దాన్ని సాహిత్యం అనం. అట్లే ఒక రచనలో శిల్పం యెంత అమోఘంగా వున్నా వస్తువు హీనమైనదో, నిరాదరణీయమైనదో అయితే దాన్ని కూడా సాహిత్యం అనం. పరిపుష్టమైన శిల్పమూ, విలువ గల వస్తువు యీ రెండూ వున్నప్పుడే ఒక రచన ఉత్తమ సాహిత్యమౌతుంది" అని మన ఆయన ఒక గొప్ప మార్క్సిస్టు సాహిత్య సూత్రం చెప్పారు. వస్తు శిల్పాలు కళగా పరిణతి చెందినప్పుడే రచన పాఠకుని హృదయాన్ని తాకుతుందని ఆయన సిద్ధాంతం చేశారు.

తెలుగు రచయితలను పరామర్శిస్తూ, రారా ... నిర్మొహ మాటంగా మాట్లాడారు. ఒక రచయితను ఎంతవరకు ఆమోదించాలో, ఎంతవరకు తిరస్కరించాలో రారా చేసి చూపించారు. ఎంతో నిగ్రహంగా మాట్లాడే రారా రచయితల్లోని అపసవ్య ధోరణులను ఎత్తి చూపేటప్పుడు కొంత కటువుగా మాట్లాడారు. ఒక రచయితకు గానీ, ఒక రచన గానీ తూకం వేసినట్లు, శాస్త్రీయంగా అంచనా కట్టడమెలాగో రుజువు చేశారు. 'మహానుభావుడు చలం' అనే వ్యాసంలో చలం గురించి గొప్ప గౌరవాన్ని ప్రకటించారు. 'చలమే లేకపోతే' అంటూ వరుసగా పరివాక్యాలు రాసి... చలం వల్ల తెలుగు సాహిత్యానికి ఒనగూర్చిన మేలును కీర్తించారు. ఇదే సమయంలో 'పురూరవ' నాటకంలోని శిల్పం నచ్చక సిద్ధాంతపరంగా పురూరవ గొప్పది కావొచ్చుగానీ, సాహిత్య పరంగా అది 'నికృష్టమైన రచన అని అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ సుదర్శనం గారిని గొప్ప మేధావిగా గుర్తిస్తూనే, అతనిది 'మేర మీరిన మేధ' అని నిర్వచించారు. 'అన్నీ మన వేదాల్లో ఉన్నాయని అనేవాళ్ళు మనదేశంలో యింకా వున్నారని తెలుసు గానీ, సుదర్శనం గారి వంటి మేధావి వాళ్ళ గురుపీఠానికి విశ్వనాథ సత్యనారాయణతో పోటీ పడడం ఈ దేశ దౌర్భాగ్యం' అనడానికి రారా వెనుకాడలేదు. రారా దిగంబర కవిత్వాన్ని, విప్లవ సాహిత్యాన్ని ఆమోదించలేదు. దిగంబర కవుల మీద ఘాటైన విమర్శ పెట్టారు. 'సమాజం కుళ్ళిపోయిన మాట నిజమే కానీ, సమాజం పతనమైన మాట వాస్తవమే కానీ, యెంత పతనమైనా యీ దిగంబరుల పైత్యాన్ని కవిత్వంగా అంగీకరించేంతగా పతనమయిందా?' అని ప్రశ్నించారు. అంతేకాదు, దిగంబర కవులను లిటరరీ లంపెన్ ప్రొలిటేరియట్ అనటానికి సంకోచించలేదు. నచ్చని దానిని అంత కఠినంగా వ్యాఖ్యానించిన రారా, నచ్చినదానిని 'యీ యుగానికి పథనిర్దేశకులు ఈ యిద్దరూనూ' (శ్రీశ్రీ, కొ.కు) అన్నారు. కెవి రమణారెడ్డి 'మహోదయం' గ్రంథం గురజాడకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వం' అని నిర్వచిస్తూనే– 'ఆయన శైలీ ఒక విధంగా ఆయన కృషికి అన్యాయం చేస్తుంది' అన్నారు. గురజాడ తన కాలం నాటి మిగతా రచయితల కన్నా చాలా ముందు చూపున్న రచయిత అని గుర్తిస్తునే, గిరీశం పాత్రను సృష్టించడం మాత్రం, గురజాడ మనస్తత్వంలోని విపరీత ధోరణి' అన్నారు.

మహీధర రామమోహనరావు గారి కొల్లాయి గట్టితేనేమి? నవలను గొప్ప చారిత్రక నవలగా నిర్వచిస్తూ విశ్లేషించారు. వాచక విమర్శను ఎంత లోతుగా చేయవచ్చునో రుజువు చేశారు. చారిత్రక నవలను నాలుగు ప్రమాణాలను పేర్కొని, అన్వయించిన తీరు అమోఘం. చారిత్రకత, దేశ కాల నిర్దిష్టత, పాత్రల మధ్య సంఘర్షణ, చరిత్ర పాఠకుడిలో అది తన చరిత్రేనని అనుభూతం కావడం వంటి కొత్త లక్షణాలను చెప్పి, నవలను పరామర్శించారు ఈ వ్యాసం నవలను సమాజంలోకి తీసుకొచ్చింది. తిలక్‌ను వస్తుత: భావకవి అని రారా నిర్వచించారు. అభ్యుదయ సాహిత్యంలో స్తబ్దత ఏర్పడిందనుకునే సమయంలో రారా అభ్యుదయ సాహిత్యాన్ని సరికొత్తగా వ్యాఖ్యానించారు. 'విరసం పుట్టుకే అనారోగ్యకర వాతావరణంలో జరిగింది అని రారా ఆ సాహిత్యోద్యమాన్ని వ్యతిరేకించాడు. నార్ల వెంకటేశ్వరావు కథానికకు చెప్పిన లక్షణాలను రారా సవరించా రు. రారా సాహిత్య విమర్శతో కాలం చెల్లిన భావాలను తిరస్కరించడం, ఆధునిక భావాలను సవరించడం, శాస్త్రీయమైన భావాలను ప్రతిపాదించడం అనే మూడు లక్షణాలు కనిపిస్తాయి.

రారా గొప్ప కథాశిల్ప విజ్ఞాని. చాలామంది కథకులకు ముందు మాటలు రాశారు. కథలు రాశారు. కథలు ఎలా రాయాలో నేర్పించటానికన్నట్టు ఆయన కథలు రాశారు. 1950 తర్వాత తెలుగు కథల్లో వదులుతనం ప్రవేశించి వస్తుబలం, శిల్పశక్తి బలహీనపడుతున్న సమయంలో రారా కథలు రాశారు. పాఠకుల సంస్కారంలో మార్పు తేవడమే కథా ప్రయోజనమని రారా అభిప్రాయం. ఈ దృష్టితోనే ఆయన కథలు రాశారు. అభ్యుదయ రచయితగా రారా ... ఆర్థిక పరిస్థితులు మానవ జీవితం మీద కలిగించే ప్రభావాన్ని చాలా కథల్లో చిత్రించారు. మన ఆర్థిక వ్యవస్థ మానవులకు అనుకూలమైంది కాదు. అది మానవతా శత్రువు, మానవతా ద్వేషి.' అని తన దేశంలోని దేవతా కన్యలు అనే కథలో సిద్ధాంతం చేశారు. అలసిన గుండెలు కథలో ఒక మధ్య తరగతి తల్లి, చిన్నప్పుడు చనిపోయిన ఇద్దరు పిల్లల్ని తలచుకుని, 'వాళ్ళు బతికుంటే ఎంతకష్టంగా ఉండేది' అనుకుంటుంది. ఆర్థికంగా అలసిపోయిన తల్లి మనస్తత్వానికి ఈ కథ అక్షరచిత్రం. డబ్బు ముందు అన్ని నైతిక విలువలూ ఎలా మసకబారిపోతాయో రారా 'నీతిగానుగ' కథలో ఆవిష్కరించారు. ఎవరినో ప్రేమించిన అమ్మాయి తనకు వద్దంటూ మొరాయించిన పెళ్ళి కొడుకు, రెండు వేలు అధికంగా కట్నం

ఇస్తామంటే, ఆమెను పెళ్ళాడడానికి తయారవుతాడు ఈ కథలో. 'ఏదో ఒకటి అమ్ముకోకుండా బతికే పద్ధతి మనదేశంలో ఇంకా ఎవరూ కనిపెట్టలేదు' అన్న సూత్రంతో రారా 'ఆత్మహత్య' కథ రాశారు. సమాజంలోని మనుషులు, దేహాలనో, ఆత్మలనో, దేనినో ఒకదానిని అమ్ముకునే బతుకుతున్నారని ఈ కథ ధ్వనిస్తుంది. కుహనా సంస్కర్తల స్వభావం ఎలా ఉంటుందో 'ఓడిపోయిన సంస్కారం' కథలో వితంతువును పెళ్ళాడిన మగవాడి పాత్ర ద్వారా ప్రదర్శించారు. రారా 'అనువాద సమస్యలు' లోతైన పరిశోధన, విలువలు గల గ్రంథం. అనువాదంలో తెలుగువాళ్ళు చేస్తున్న తప్పులను నిర్దాక్షిణ్యంగా ఎత్తి చూపారు రారా ఈ గ్రంథంలో. 'టైం' అనే మాటను తెలుగులో ఎన్ని రకాలుగా ఉపయోగిస్తాయో ఒక వ్యాసంలో ఆసక్తికరంగా చర్చించారు. అనువాద సమస్యల్ని చర్చించే క్రమంలో అనువాద సూత్రాలను కూడా రూపొందించారు. అనువాదం మూలరచనలోని భావాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేయాలి. శైలి, రచనావిధానం మూల రచనలో ఉన్నట్లే అనువాదంలోనూ ఉండాలి. మూలరచన పాఠకునితో ఎంత హాయిగా చదివిస్తుందో, అనువాదం కూడా అంత హాయిగా చదివించాలి. ఇలాంటివి ఆయన రూపొందిన సూత్రాలు. అనువాదకులు కొత్త పదాలను సృష్టించడం అవసరమంటారు. ఒక భాషా గ్రంథం నచ్చడం వల్లనే ఎవరైనా అనువాదానికి పూనుకుంటూరంటారు రారా. మంచి అనువాదమంటే రారా ఇలా చెప్పారు : 'మూలభాష మాతృభాషగా గలవానికి మూల రచనలోని సారాంశం యెంత స్పష్టంగా అర్థమై, యెంత గాఢమైన అనుభూతిని కలిగిస్తుందో, లక్ష్య భాష మాతృభాషగా గల వానికి అనువాదంలోని సారాంశం అంత స్పష్టంగాను అర్థమై అంతగాఢమైన అనుభూతిని కలిగిస్తే, అది మంచి అనువాదం" రష్యన్ సాహిత్య అనువాదకుడుగా, ఆ భాషానువాదంలో సమస్యలను రారా బాగా వివరించారు.

తెలుగు సాహిత్యంలో కదలిక మందగించింది. తెలుగు సాహిత్యంలో వ్యాపార ధోరణి ప్రకాశించింది అనుకుంటున్న సమయంలో అభ్యుదయ చింతనాపరుడిగా తెలుగు సాహిత్య పురుజ్జీవనానికి బిగించిన రచయిత, విమర్శకుడు రారా. సాహిత్య విమర్శ ఎలా ఉండాలి? విమర్శ భాష ఎలా ఉండాలి? సాహిత్య విమర్శకులు ఎలా ఉండాలి? సాహిత్యతత్వం ఏమిటి? సాహిత్య ప్రయోజనం ఏమిటి? రచయితల కుండవలసిన లక్షణాలు, బాధ్యతలు ఏవి? సాహిత్యంలో ఆమోద, అంశాలెలా ఉంటాయి? మొదలైన ప్రశ్నలకు రారాను చదవి సమాధానాలు తెలుసుకో వచ్చు. సాహిత్య విమర్శ ద్వారా సాహిత్య రచనలో జరిగే లోపాలను ఎలా సవరించవచ్చో రారా నేర్పారు. ఆయన ఒక గొప్ప ఉపాధ్యాయుడు.

**"శిల్పగతమైన శక్తులు ఎన్ని ఉన్నా కవికి ఒక వ్యక్తిత్వాన్ని ఇచ్చేవి అతని విశ్వాసాలు, అభిప్రాయాలే"**

**(రారా : సంవేదన, అక్టోబర్ 1968)**



## నాగజెముడు ముళ్ల పదును

**పి**డికిళ్లలో దాచుకున్నదెంతో
నాకు తెలీదు కానీ
కాస్త నాపై విదిలించు...
నెత్తిన పెట్టుకుంటా నిన్ను
కమీషన్లు మింగి అయినా
నా మోసపు లాభాల వ్యాపారానికి
గొడుగువవు చాలు... నిన్ను దాటిపోను

వీధులు కొలిచే
బలాదూర్ కొడుకు చేతికి
పనిని అందిస్తే...అదే పదివేలు

నా చిరుగుల చొక్కాకు కుట్టై...
అంతకన్నా ఏమీ కావాలి...
నీవు చెప్పిందే వేదం

ఊరందరిని ముంచేసినా
నా ఒక్కడికి మాత్రం తాడందించు
గట్టుమీదకు వచ్చి
నిను భుజానికెత్తుకుంటా ..

రాబందు చూపు...
నాగజెముడు ముళ్ళ పదును...
ఇప్పటి కాలం...

బిక్కచచ్చిన
సార్వజనీక ప్రయోజన సూత్రం
స్వార్థపు గాలికి దూది పింజలా దొర్లిపోతోంది!

**- అవ్వారు శ్రీధర్ బాబు**
**95001 30770**



# రావిశాస్త్రి మామిడిచెట్టు కథ ఒక పరిశీలన

- డా. కసప నరేందర్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు శాఖ, నిజాం కళాశాల,
హైదరాబాద్.
94915 48748

**రా**చకొండ విశ్వనాధ శాస్త్రి ఆధునిక కథారచయితల్లో బలమైన రచయిత. సంప్రదాయ కట్టుబాట్ల నుంచి మార్క్సిజం వైపు ప్రయాణం చేసిన రచయిత. ఆయన కర్షక, కార్మిక, అట్టడుగు వర్గాల పక్షపాతి. అంతేకాదు; పర్యావరణ, ప్రకృతి ప్రేమికుడు. రావిశాస్త్రి ప్రకృతి ప్రేమికుడని 'మామిడి చెట్టు' కథ నిరూపిస్తుంది. ఈ కథ చాలా ఆలోచనాత్మకంగా ఉ ంటుంది.

ప్రకృతి మనిషికి అన్నీ ఇస్తున్నా మనిషి తిరిగి ప్రకృతి కేమిస్తున్నాడు? అని ప్రశ్నించుకుంటే సమాధానం కఠినంగా ఉంటుంది. మనిషి హృదయంపై చేయి పెట్టి నా పుట్టుక, నా బతుకు, నా జీవితం ఇవన్నీ వేటితో ముడిపడి ఉన్నాయి? అని ఆలోచిస్తే మనిషి కళ్ళముందు తనకు ఉపయోగపడే ప్రతిదీ కనిపిస్తుంది. రావిశాస్త్రి మామిడి చెట్టు కథ అలాంటిదే.

ఇది విలక్షణమైన కథ. ఇందులో పేరులేని పాత్ర ప్రధానపాత్ర. నీలమణి పాత్ర ఉప ప్రధాన పాత్ర. 'నీలమణి' ఇల్లు 500ల గజాల స్థలంలో అతి విశాలంగా ఉంటుంది. అతడు తహసిల్దారుగా రిటైర్ అయ్యాక కొత్తగా కట్టుకున్న ఇల్లు అది. అతనికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉ న్నారు. ఇంటి ముందు మామిడి చెట్టు ఉంటుంది. దాని కొమ్మలు రోడ్డుపైకి వేలాడుతూ ఉంటాయి. పక్కింటివారి ఇంటి ముందుకు కూడా సాగి ఉంటాయి. రోడ్డు వైపుకు సాగిన కొమ్మల కింద ఒక వృద్ధురాలు మొక్కజొన్న కంకులు అమ్ముతూ ఉంటుంది. ఇంటి పక్కన వాళ్ళు మామిడి కొమ్మల కింద పేకాట ఆడుతుంటారు. ఇంకోవైపు మామిడి కొమ్మలకు తాడు కట్టుకొని ఉయ్యాల ఊగుతుంటారు పిల్లలు. మామిడి చెట్టును ఆధారం చేసుకొని ఈ మూడు రకాల మనుషులు ఉంటారు. 'నీలమణి'కి ఈ మూడు రకాల మనుషులు చేసే పనులు నచ్చవు. వారితో తగవులాడుకుంటూ ఉంటాడు.

స్థలం పక్కింటివారిదే అయినా చెట్టు మాత్రం నీలమణిదే. సహజంగా చెట్టు పెరిగిన స్థలం ఏదైనా, ఎవరిదైనా అది తన కొమ్మల చేత విశాలంగా పెరుగుతుంది. ఇంటి పక్కవారికి నీడను, మంచి గాలిని ఇంకా తన కాయలను, పళ్లను కూడా ఇస్తుంది. ఇది అన్ని చెట్లకు ఉన్న విశాల భావన. కానీ మనిషి సంకుచిత స్వభావం, బుద్ధి, స్వార్థం వల్ల 'నేను, నాది' అనే భావన ఉండడం వల్ల చెట్టు తనకు ఉండే విశాల భావనను కోల్పోతుంది. అతడు ఇంటిముందుకొచ్చిన ముష్టివాళ్ళను అసహ్యించుకోవడం, వాళ్ళను వెంటబడి తరమడం, పరాయి పిల్లలను దూరంగా ఉంచడం, కూరగాయలు కొనేటపుడు బేరాలు ఆడటం ఇలాంటివి నీలమణి అలవాట్లు.

కథను రచయిత  కథ ఉత్తమ పురుష పద్ధతిలో పేరులేని పాత్ర అభిముఖంగా నడిపిస్తాడు.  అతనికి మామిడి చెట్టు అంటే చాలా ఇష్టం. ఉద్యోగ రీత్యా ఇతర ప్రదేశానికి వెళ్తాడు. అద్దె ఇల్లు వెదికే సమయంలో అతనికి మామిడి చెట్టు ఉన్న నీలమణి ఇల్లు కనిపిస్తుంది. గాలి, వెలుతురు అన్నీ సౌకర్య వంతంగా ఉండడం వల్ల, ముఖ్యంగా మామిడిచెట్టు ఆకర్షించడం వల్ల అద్దె నెలకు ఇరవై రూపాయలైనా అంగీకరి స్తాడు. నీలమణి పెట్టిన అన్ని షరతులకూ ఒప్పుకుంటాడు. అయితే నీలమణి, అతని భార్య పిల్లలను చూడడం ఇష్టం ఉ ండదు. వారిని అతి ఘోరంగా విమర్శిస్తాడు.

తన గదిలో కూర్చున్నప్పుడు రాత్రి సమయంలో చల్లగాలి, చంద్రుడు, ఆకాశంలో చుక్కలు ఎంతో రమణీయంగా ఉ ంటాయి. కూర్చున్న చోటుకు ఎదురుగా మబ్బులు ఉంటాయి. ఆ సమయంలో ముసుగేసుకున్న 'ఆడపిల్లలా మామిడిచెట్టు' నిల్చుందని, వెలుతురు ఉన్నపుడు మామిడి చెట్టు ముసుగు

తీసేసి పచ్చగా దీపం వెలుతురులో ధగధగ మెరుస్తుందని వర్ణిస్తాడు రచయిత.

పక్కింటివారు దీపాలు పెట్టుకొని ఆ మామిడిచెట్టు కింద కూర్చొని నాలుగు రోజుల నుండి పేకాట ఆడుతుంటారు. నీలమణికి కోపం ఎక్కువైంది. పేకాడేవారిపై విరుచుకు పడతాడు. మరోవైపు రోడ్డుమీద ఆ మామిడి చెట్టు నీడ కింద మొక్క జొన్నకంకులు అమ్ముకుని బతుకుతుంది ఒక వృద్ధురాలు. ఆమెతో కూడా గొడవకు దిగుతాడు నీలమణి. వృద్ధురాలు అతనిపై విరుచుకు పడుతుంది. 'కొమ్మలాడవంట! మరి మావు? ఈ చెట్టు కింద ఇక్కడ ఉండడాని కీల్లేదంట లూసేన్సు గెందంట ఆడుండడం నాకు లూసెంసుగుంది అయితే పోతాడా? పోడు. జాగా ఆడిది. కానైతే బాబూ తెలకడుతాను. ఈ రోడ్డు కూడా ఆడిదేనా? డబ్బెట్టి కొన్నాడా? నేకపోతే తారుకంకరా కాని కూలోళ్ళ సేత దగ్గరుండి ఏయించినాడా? బోడి గుండూ' అంటూ తిడుతుంది.

కానీ నీలమణి మాత్రం తనకు న్యూసెన్సుగా ఉందని మున్సిపల్‌వారికి మూడు రూపాయిలిచ్చి వారి చేత ఆమెను బలవంతంగా అక్కడినుంచి పంపించాలనుకుంటాడు. చివరికి పోలీసువారికి ఫిర్యాదు చేస్తే పోనీలేండి బీదవారని చెప్పి వెళ్తారు. 'నీలమణి' వృద్ధురాలు చెట్టుకింద మొక్కజొన్న కంకులు అమ్ముకోవడం న్యూసెన్స్‌గా భావిస్తాడు. ఆ వృద్ధురాలు, నీలమణి ఇల్లు ఉండటం న్యూసెన్స్‌లాగే భావిస్తుంది. ఇక్కడ ఒక మనిషికి ఇంకో మనిషి న్యూసెన్స్. ఎవరికి ఎవరు నచ్చాలని లేదు. ధనవంతుడికి బీదవారు నచ్చకపోవచ్చు. బీదవారికి ధనవంతులు కూడా నచ్చరు. మనిషి తిండి, గుడ్డ, అలవాట్లు, అంతరాల్లో బేధం ఉండకపోవచ్చు. కానీ మనిషి బతకడానికి కావల్సిన ప్రాథమికమైన ప్రాణవాయువు, ఆహారం లాంటివన్నీ ఒకే తీరుగా ఉంటాయి. మనిషి బతకడానికి తీసుకునే తిండి, గుడ్డ నీరు ఇవి ప్రాథమికమైనవే.

'నీలమణి'లో ఎదుటి మనుషులపై ఉండే అసహన ధోరణి ఇక్కడ వ్యక్తమవుతుంది. రోడ్డుపై పొట్టకూటి కోసం మొక్కజొన్నల నమ్ముకునే వృద్దురాలిపై అసహనం వ్యక్తం చేయడం నీలమణిలో లోపించిన మానవత్వానికి నిదర్శనం.

కొందరు మామిడి చెట్టుకు ఉయ్యాల కట్టుకుని ఊగుతున్నారు. గుంపుగుంపుగా ఉన్న పిల్లలు చేసే అల్లరికి మామిడిచెట్టు కొమ్మలు విరగడంతోపాటు నీలమణి పెంచుకుంటున్న 'పిల్లి' కాలు విరుగుతుంది. నీలమణి ఇంట్లో ఉన్న పిల్లి ఎదురింటివారి స్థలంలోకి వెళుతుంది. మా స్థలంలోకి వస్తావా అని ఓ పిల్లవాడు దాని తోకను పట్టుకొని పక్కకు విసిరేస్తాడు. అప్పుడు దాని కాలు విరుగుతుంది. నీలమణి కుటుంబ సభ్యులు చాలా బాధ పడతారు. 'పిల్లి' కాలు విరగ్గొట్టారని నీలమణి పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వడానికి వెళ్తాడు. అంతకు ముందే ఉయ్యాల ఊగుతున్న పిల్లలను నీలమణి కుటుంబసభ్యులు తమని కొట్టారని పోలీసులకు రిపోర్టు చేస్తారు. నీలమణి మామిడిచెట్టు తనదని, ఇరుగు పొరుగు వారిని నిందించడం వల్ల వాళ్ళు ప్రతీకారంగా తమ స్థలంలోకి పిల్లి వచ్చిందని దాన్ని విసిరేసారు. అంటే మనిషి ఇతరులతో వ్యవహరించే పద్ధతిని బట్టి ఇతరులు నడుచు కుంటారు. నీలమణికి అలజడి, ఆందోళన ఎక్కువవుతుంది. జరిగిన వ్యవహారానికి తీవ్రమనస్తాపానికి గురవుతాడు. మామిడి చెట్టు కొమ్మలను, మానును నరికేస్తాడు.

అందంగా కళాత్మకంగా ఉన్న మామిడి చెట్టు లేకపోవడం తో ఇల్లు బోసిపోతుంది. ఇక నీలమణికి ఎవరితోనూ తగువు ఉండదు. పక్కింటివారితో, రోడ్డుపైన ఉన్నవారితో కానీ, మామిడిచెట్టును నరకవలసినంత స్థితి ఎందుకొచ్చింది. కారణం ఏమిటని అనుకున్నపుడు నీలమణి సంకుచిత స్వభావం, ఓర్వలేనితనమే కారణంగా భావించాలి.

సమాజం సమిష్టి వ్యవస్థ. అందరం మనుషులమే అనే భావన అందరిలో ఉంటే కలుపుకుపోయే స్వభావం అలవడుతుంది. వృద్ధురాలు మొక్కజొన్న కంకులు అమ్ముకొని బతకడం అంటే తన శ్రమను కరిగించుకోవటమే. ఆమె తన కాళ్ళపై తాను బతుకుతున్నపుడు నీలమణి ఆటంక పరచడం అతనికి గొప్పమనసు లేకపోవడమే. ఇలా చాలాచోట్ల శ్రమజీవులపై వారి బతుకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇరుగు పొరుగువారు, పాలు, నీళ్ళలా కలిసికట్టుగా ఉండాలనేది సమాజ సిద్ధాంతం. అది కుదరనపుడు ఒక మనిషి మరో మనిషిని చూసి ద్వేషించడమో, అసహ్యించుకోవడమో సహజం. నీలమణి కూడా అంతే. ఎదుటివారిని ద్వేషించడం, అసహ్యించుకోవడం, దూషించడం తెలుసు. అందుకే 'గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తీసుకొచ్చి'... చివరకు పెంచిన తన చేతులతోనే మామిడి చెట్టును పూర్తిగా నరికేస్తాడు.

ఆ ఇంట్లో కిరాయి ఉంటున్న వ్యక్తి అత్యవసర పనిమీద సొంతూరు వెళ్ళొచ్చేసరికి మామిడి చెట్టు కనిపించకపోయే సరికి నిర్ఘాంతపోతాడు. 'పొరపాటున మరో ఇంటికి వచ్చేసేనా అనుకుంటాడు'. ఇంట్లోకి వెళ్ళి 'నీలమణిని' మామిడి చెట్టు గురించి అడిగితే నానా బూతులు తిడుతూ, నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను. చాతనయితే ఏవైనా అడగాలనుకుంటే ఆ వెధవలని వెళ్ళి అడుగంటూ వాదిస్తుంటాడు. నీలమణితో మాట్లాడి ప్రయోజనం లేదనుకుంటాడు అతను. నీలమణి ఇల్లు 'అతగాడి గుండులా బోడిగా ఉంది'. 'ముందు ఆవరణ

శ్మశానం లాంటిది'. ఇల్లంత నిర్భాగ్యంగా కళాహీనంగా ఉంది. చూడటానికి దుర్భరంగా పీనుగుల పెంటలా నిండినట్లుగా ఉంది అనుకుంటూ, వీధిలో ముసలమ్మ ఏ ఎండకోపోయి ఉంటుంది అనుకుంటూ బాధపడతాడు. 'ఇదంతా ఘోరమైన నరకం. బతకడం దుర్భరంగా తోస్తుంది'... కానీ అంతలోనే అతనికి తన గ్రామంలో పొందిన సూర్యుని వెలుతురు, చల్లని గాలి, 'మామిడి చిగురు' అందాలు జ్ఞాపకం వస్తాయి. తనకు, మామిడి చెట్టుకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాడు. మామిడిచెట్టులేని ఇంట్లో క్షణమైన ఉండకుండా ఇల్లు ఖాళీ చేసుకొని వెళ్ళిపోతాడు.

**సన్నివేశ వర్ణనలు :** ఈ కథ చిన్నదైనా సన్నివేశానికి తగినట్లుగా వర్ణనలు చేసాడు రచయిత. మొదటినుంచి చివరి వరకు ఏం జరుగుతుందనే ఆతృత పాఠకుడిలో ఉంటుంది వర్ణనలు సహజ సుందరంగా ఉంటాయి. పాత్రల మానసిక భౌతిక ఆకార వికారాలను, స్థల సంఘటనలను, సన్నివేశాలను ఇతరమైన వానితో ఉపమానికరించడం వర్ణన అవుతుంది. రచయిత మామిడిచెట్టును చూసినపుడు 'అత్తవారింటికి వెళ్ళడానికి ఉన్న ముగ్ధలా' ఉందని వర్ణిస్తాడు. సాయంకాలం వేళ చల్లని గాలి విసురుతున్నపుడు మబ్బులు కమ్ముతాయి. అప్పుడు మామిడిచెట్టు ముసుగేసుకున్న ఆడపిల్లలా నిలుచుందని వర్ణిస్తాడు. నీలమణిని 'చచ్చిన చింతమొద్దులా' ఉంటాడని ఉంటాడని వర్ణిస్తాడు. నీలమణి ఇంటిముందు నిటారుగా, గంభీరంగా కొబ్బరిచెట్లు ఉంటాయి. కానీ అవి కాయలు కాయవు. అంటే పనికిరావని రచయిత ఉద్దేశం. నీలమణి కొడుకు 'లా' చదివాడు. గంభీరంగా ఉంటాడు. రచయిత నీలమణి కొడుకును ఆ కొబ్బరి చెట్టుతో పోలుస్తాడు.

నీలవేణి కూతురిని వర్ణించినపుడు ఆమె చీకట్లో తుమ్మదొంకలా ఉంటుందనీ వర్ణిస్తాడు. మనిషి ప్రకృతితో మమేకమై ఉంటాడని చెప్తాడు. ప్రకృతి పరిసరాలపై చెట్లపై మనిషికి ప్రేమ ఉండాలి. వాటిని రక్షించాలి. అప్పుడే అవి మానవాళిని రక్షిస్తాయి అనే సందేశం ఈ కథలో రచయిత చేప్తాడు.

ఈ కథలో నీలమణి మామిడిచెట్టును నరికివేయడానికి కారణం కలుపుగోలుతనం, మంచితనం లేకపోవడమే. మంచి ఆక్సిజన్‌ను, కాయలను, పండ్లను ఇస్తూ ఎంతోమేలు చేస్తున్న మామిడిచెట్టును నరకడం అనాలోచిత చర్యనే. మామిడిచెట్టు కథ ద్వారా ప్రకృతి, పర్యావరణం, మనిషి స్వార్థ చింతన గురించి రచయిత వివరించారు. అంతర్లీనంగా మనిషి యొక్క సంకుచిత స్వభావం ఎలా పరిణామాలను కలిగిస్తుందో రావిశాస్త్రి వివరించారు. ■

# కేక

**వా**నలో తడిసిన
కుక్కపిల్ల సన్నగా మూలుగుతోంది
ఆకలేమో!
గూడు కూలిన కొమ్మమీద
పిట్ట ఒకటి
తడిసిన రెక్కలు విదిలిస్తోంది దిగాలుగా
వెల్తురో, వేడో ఏదో ఒకటి
దొరక్కపోతే పిల్లలు
బతకవేమోననే
దిగులాకలి!

కొమ్మలు సాచిన బీరపాదు నుంచి
ఓ పిందె చివరి పువ్వు
ఆశగా ఎదురుచూస్తోంది
పుప్పొడి రాల్చే పచ్చపువ్వు కోసం
మనిషి ఆకలి తీర్చాలనే ఆతృతేమో..!

వాన ముసురుకు
ఆగిపోయిన మొక్కజొన్నకంకుల
బండి కింద పరదాపట్ట కింద
ఓ ముసలి ప్రాణం
బొగ్గుల కుంపటి రాజేస్తోంది

పది కంకులన్నా అమ్మందే
పరగడుపునకు పనిదొరకదు
కదిలే పేగుల పాటకు
మెతుకుల సంగీతం
అమరదు అనే ఆందోళనే అది.

వీధి చివర్నించి ఒక్క కేక!

వానాగిపోయింది
పోదాం పదండహే! అని.
ఆకలి ఆ కేకకు
కదిలి కరేల్మని
బతుకు పోరాటాల్లోకి దూకింది...

**- కోసూరి రవికుమార్**
**94913 36488**



## నాదేశ ముఖచిత్రం

ఇదే నేటి నా భారతదేశం చిత్రపటం
కాలే కడుపులకీ, రాలే బతుకులకీ నెలవుగా
మారిన సిరుల గడ్డ నా భారతదేశం...
అంతరిక్షంపై పరిశోధనలతో దూసుకువెళ్తుతున్నా
ఆకలి కేకలు అపలేకపోతున్నది నాదేశం
ఆవేశంతో పలికే మాటలు కానేకావు ఇవి
నిస్సహాయుని హృదయాక్రోశమే ఇది...

మహోన్నతంగా ఎదగవల్సిన నా దేశం
ధన దాహానికి వొంగి
మతోన్మాదం ముసుగు కప్పుకుంటుంది
తానేమీ చేయలేక కాలచక్రం గిర్రున
తిరుగుతూనే వుంటుంది

అవినీతి అధికార దాహం అదుపులేక
పెరుగుతూనే వుంటుంది...
వర్ధంతులు జయంతుల సందడితో
నాలుగు రోడ్ల కూడలిలో విగ్రహాల ఎత్తులు
పెరుగుతునే ఉన్నాయ్..
పేదవాడి డొక్కలు మాడుతునే ఉన్నాయ్
కొన్ని వేల గుడిసెలు నేల రాలుతున్నాయ్.....
ధనవంతుడి మిద్దెలు నింగిని తాకుతున్నాయ్
ఇదే నా దేశం... నా భారత దేశం..
మహాత్ముడు కలలు కన్న నా దేశం.
నిత్యం సమస్యలతో రగులుతున్న నా దేశం!

- రాము కోలా

98490 01201

## వాన చినుకు

పొద్దుతో పోటీ పడి మరీ
పట్టుకుంది ముసురు
రాజీపడని రణరంగంలా!
కాలక్షేపానికి కావలసినవి
వండి వారుస్తుంటే
గాలి మేడల్లో అంతా ఒకటే సందడి
చూరు పట్టుకుని వేలాడుతున్న దరిద్రం
దంచికొడుతున్న వానలా
దడి కట్టి నిలబడుంటే
పూరి గుడిసెలలో హాలాహలం!

రోజు కారుస్తున్న కన్నీళ్ల కంటే
ఈ జోరు వాన ఒక లెక్కా అని
యజమానుడనుకుంటుంటే
భార్యా పిల్లల ఆకలి కేకలు
చిటపట చినుకుల మోత
తలెత్తి చూడలేని అంతస్తుల కోలాహల గాలానికి
పోటీ పడలేక ఓడిపోతున్నాయి!

ఇల్లంతా కురుస్తుంటే
ఓ మూల తడవకుండా ఉంది
తడిసిన పొయ్యితో
తాళి కట్టినోడిని ఏమీ అనలేక
తగవులాడుతుంది ఇల్లాలు
పేదరికపు పెత్తనంతో
పెనుగులాడుతున్న భర్త మాత్రం
విద్దురంగా నవ్వుతూ అనుకుంటున్నాడు!

పేదల సంక్షేమానికి పాటు పడుతున్నట్టు
చెప్పుకుంటున్న నాయకుల్లాగా
జల్లెడ లాంటి పైకప్పు నుండి
పున్నమి వెన్నెల వెక్కిరిస్తుంటే
మురిసిపోయిన క్షణాలను మరిచిపోతే ఎలాగని
పంకా లేకపోయినా ఉక్కపోత ఉసురు తీసి
గాలిమరలా పనిచేసిన చిల్లులు పడిన పైకప్పును
ఛీదరించుకుంటే ఎలాగని ...
అయినా,కన్నీళ్లతో వేడెక్కిన తనువుకు
ఈ చన్నీళ్ళ కంటే హాయినివ్వగల
శీతల మరలెక్కడున్నాయిలే
అని ఓదార్చుకున్నాడు తనను తాను ..!

- కన్నెకంటి నాగేశ్వరరావు

9966737695



# ముక్తిధనం

హిందీ మూలం : **ప్రేమ్ చంద్** (1880-1936)

అనువాదం : **డా. వెన్నా వల్లభరావు**

**భా**రతదేశంలో ఎన్నో వ్యాపారాలున్నా అన్నిటికన్నా లాభదాయకమైనది మాత్రం వడ్డీ వ్యాపారమే. సర్వసాధారణంగా సాలుసరి వడ్డీ రేటు 25 శాతం. స్థిర చరాస్తులపై ఇచ్చే అప్పుకు వడ్డీ నూటికి 12 రూపాయలు తీసుకుంటారు. అంతకంటే తక్కువ వడ్డీకి అప్పు పుట్టటం అసాధ్యమనే చెప్పాలి. ఏడాదికి నూటికి 15 రూపాయలకంటే ఎక్కువ లాభం వచ్చే వ్యాపారాలు చాలా అరుదు – అందునా ఏ ఇబ్బందీ లేకుండా. వడ్డీవ్యాపారంలో అయితే నజరానా సొమ్ము అదనం, ప్రామిసరీ నోటు రాయించటానికి అదనం, మధ్యవర్తికి అదనం, కోర్టు ఖర్చులు పేరుతో అదనం. ఈ అదనపు సొమ్మంతా ఏదోవిధంగా వడ్డీవ్యాపారి జేబులోకే చేరుతుంది. అందుకే వడ్డీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. లాయరు, డాక్టరు, ప్రభుత్వోద్యోగి, జమిందారు, ఎవరి వద్దయితే అవసరానికి మించి ధనముంటుందో ఈ వ్యాపారం చెయ్యొచ్చు. పెట్టుబడిని సద్వినియోగం చేసే ఉత్తమోత్తమమైన మార్గం వడ్డీ వ్యాపారం.

లాలా దావూదయాల్ కూడా ఇదే కోవకు చెందిన వడ్డీ వ్యాపారి. కోర్టులో న్యాయ సలహాదారుగా పనిచేస్తున్నారు, తాను చేసే పొదుపుని 25–30 శాతం సాలుసరి వడ్డీకి ఇస్తూఉంటాడు. ఆయన లావాదేవీలు ఎక్కువగా తక్కువ తరగతి వాళ్ళతోనే ఉంటుంటాయి.

ఉన్నత కులాలవాళ్ళంటే ఆయన జంకుతాడు. వాళ్ళని తనచెంతకే చేరనివ్వడు. ఆయన అభిప్రాయం (ఏ వ్యాపారస్తుడైనా దీన్ని సమర్థిస్తాడు) ఏమిటంటే, బ్రాహ్మణులు, క్షత్రియులు, కాయస్థులకు డబ్బు అప్పు ఇవ్వటం కంటే ఏట్లో పారవేయ్యటం నయం. అప్పు తీసుకునేటప్పుడు వాళ్ళవద్ద అంతులేని ఆస్తి ఉంటుంది, కానీ డబ్బు వాళ్ళ చేతికి అందగానే అదంతా మాయమైపోతుంది. ఆస్తిపైన హక్కు భార్యదో, కొడుకుదో లేక సోదరునిదో అయిపోతుంది. లేకపోతే అసలు ఆ ఆస్తి జాడే ఉండదు. వాళ్ళ ఆస్తుల చట్టపరమైన బందోబస్తు విషయంలో పెద్ద–పెద్ద న్యాయశాస్త్ర విశారదులే ఓటమి పాలౌతారు.

లాలా దవూదయాల్ ఒకరోజు కోర్టునుంచి ఇంటికి వెళుతుండగా దార్లో ఒక విచిత్రమైన సంఘటన చూశాడు. ఒక ముస్లిం వ్యక్తి తన ఆవును అమ్మజూస్తున్నాడు. చాలా మంది అతన్ని చుట్టుముట్టి ఉన్నారు. ఒకడేమో బలవంతంగా అతని చేతిలో డబ్బు పెడుతున్నాడు. ఇంకొకడు అతని చేతినుంచి పొలుపుతాడు లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ఆ పేద ముస్లిం వ్యక్తి వాళ్ళ ముఖాలు పరికించి, ఏదో ఆలోచించి పొలుపుతాడు చేజారనీయకుండా గట్టిగా వడిసి పట్టుకుని ఉన్నాడు. ఆవు మోహినీ రూపంలా చాలా ఆకర్షణీయంగా ఉంది. చిన్న మెడ, బలమైన చట్టలు, పాలతోనిండిన చక్కని పొదుగు. ఆవు చెంతనే అందమైన దృఢ0గా ఉన్న లేగదూడ తల్లినే అంటిపెట్టుకుని ఉంది. ముస్లిం వ్యక్తి వ్యాకులంగా, బాధతో ఉన్నట్టు కనపడుతున్నాడు. జాలిగా తన ఆవును చూస్తూ మనసులో కుమిలిపోతున్నాడు. దావూదయాల్ కు ఆవు బాగా నచ్చింది. ఇది తన దొడ్లో ఉంటే బాగుంటుందని భావించాడు. "ఏమయ్యా! ఆవుని అమ్ముతావా?"

ముసల్మాను దవూదయాల్ ను పరిశీలనగా చూసి సంతుష్టుడయ్యాడు. ఆయన దగ్గరకొచ్చి "అవునయ్యా, అమ్మటానికే తీసుకొచ్చాను" అన్నాడు.

దావూ – "ఎక్కడికి తీసుకొచ్చావు? నీ పేరేంటి?"

ముస – " రహ్మాన్ అయ్యా. పచౌలి లో ఉంటాను."

దావూ – " పాలు ఇస్తుందా?"

ముస – " ఇస్తుందయ్యా ! ఎట్టా లేదన్నా పూటకి మూడు సేర్లు ఇస్తది. ఇది రొండవ ఈతే దొరా. మంచి గుణమేంటంటే పిల్లలు పితికినా పాలు ఇస్తది. చంటి బిడ్డలు దీని కాళ్ల వద్ద ఆడుకున్నా అసలు తల ఇసరనే ఇసరదు."

దావూ – "ఇక్కడ నిన్ను ఎరిగినవాళ్లు ఎవరైనా ఉన్నారా? దీన్ని ఎక్కడైనా దొంగిలించి తెచ్చావేమోనని అనుమానంగా ఉంది."

ముస – "లేదు దొరా, నేను అలాంటివాడిని కాదు. పేదోణ్ణి. ఈ ఊళ్లో నాకెవరూ తెలియదయ్యా.

దావూ – "ఎంత ధర చెపుతున్నావేం?"

రహ్మాన్ 50 రూపాయలు చెప్పాడు. దావూదయాల్ 30 రూపాయలకి అడిగాడు. కొంచెం సేపు ఇద్దరి మధ్య బేరసారాలు సాగాయి. ఒకరికి డబ్బు చాలా అవసరం, రెండవ వానికి అవు బాగా నచ్చింది. బేరం కుదరటంలో పెద్దగా జాప్యం జరగలేదు. 35 రూపాయలకి ఇరువురికి అంగీకారమైంది.

రహ్మాన్ విధిలేక తన ఆవుని అమ్ముతున్నాడేగాని దానిపట్ల మమకారపు బంధాన్ని తెంచుకోలేక పోతున్నాడు. కొంచెం సేపు ఆలోచనల్లో మునిగిపోయి నిల్చొనిపోయాడు. తేరుకుని నెమ్మదిగా ఆవుని తీసుకుని దావూదయాల్ వెనక నడవసాగాడు. అక్కడున్నవాళ్ళలో ఒకడు "ఏవయ్యా నేను 36 రూపాయలిస్తాను, నాతో రా!" అన్నాడు.

ముసల్మాను – "లేదు లేదు. నీకివ్వను. బలవంత పెడతావా ఏంటి?"

మరోవ్యక్తి "నేను 40 రూపాయలిస్తాను, సంతోషమేనా?" అంటూ రహ్మాన్ చేతిలోనుంచి పొలుపుతాడు లాక్కోబోయాడు. రహ్మాన్ ససేమిరా ఇవ్వనన్నాడు. చివరికి నిరాశ చెంది వారంతా తమ దారిన తాము వెళ్ళిపోయారు.

కొంచెం దూరం వెళ్లాక రహ్మాన్ దావూ దయాల్ తో – "అయ్యా! మీరు హిందువులు. వాళ్ళు నా ఆవుకి 50 రూపాయలు ఇస్తానన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మను. తమరు సరైన సమయానికి వచ్చారు గాబట్టి సరిపోయింది, లేకపోతే వాళ్ళు బలవంతంగా నా ఆవుని లాక్కుపోయేవాళ్ళు. నేను చాలా కష్టాల్లో ఉండబట్టి బంగారంలాంటి ఈ గోమాతని అమ్మటానికి సిద్ధపడ్డాను. లేకపోతే నా ఇంటి లక్ష్మిని ఎన్నటికీ అమ్మేవాణ్ణి కాదు. దీన్ని ఈ చేతుల్తో పెంచి పెద్ద చేశానయ్యా. చూస్తా చూస్తా కసాయివాళ్ళకి ఎలా అమ్ముతాను?అయ్యా! దీనికి ఎంత దాణా పెడితే అన్ని ఎక్కువ పాలిస్తది. గేదె పాలు కూడా దీని పాలంత తియ్యగాను చిక్కగాను ఉండవు... తమరికి ఒక విన్నపం – దయచేసి మీ పశువుల కాపరికి గదమాయించి చెప్పండి దీన్ని కొట్టవద్దని."

దావూదయాల్ ఆశ్చర్యంగా రహ్మాన్ వైపు చూశాడు. హే భగవాన్! ఈ తరహా మనిషిలో కూడా ఇంత సౌజన్యం, ఇంత సహృదయత ఉంటాయా ! ఇక్కడైతే పెద్ద పెద్ద నామాలు పెట్టి, విభూధి పూసుకునే పెద్దమనుషులు కూడా తమ ఆవుల్ని కసాయి వాళ్ళకి అమ్మేస్తుంటారు, ఒక్క పైసా కూడా నష్టపోవడానికి ఇష్టపడరు. కానీ ఈ పేదవాడు తన ఆవు కసాయివాళ్ళ పాలవ్వకూడదని తాను ఆర్థిక ఇబ్బందుల్లో వుండి కూడా 5 రూపాయల నష్టాన్ని భరించటానికి సిద్ధమయ్యాడు. పేద వాళ్ళలో కూడా ఇంత ఇంగితం, సదాలోచన ఉంటాయా?

ఆయన ఇంటికొచ్చి రహ్మాన్‌కు అనుకున్న ప్రకారం డబ్బులు ఇచ్చాడు. రహ్మాన్ జాగ్రత్తగా డబ్బు బొడ్లో భద్రపర్చుకున్నాడు. ఆవుని, దూడని ఒకసారి ప్రేమ నిండిన కళ్లతో చూసుకొని, దావూదయాల్ కి సలాం చేసి వెళ్లిపోయాడు.

రహ్మాన్ పేద రైతు. పేదవాడికి అందరూ శత్రువులే. జమీందారు ఉన్నపళాన పన్ను బకాయి చెల్లించమని ఆదేశించాడు. దాని నిమిత్తం డబ్బు అవసరమైంది. జోడు ఎడ్లు తప్ప అతని వద్ద ఆస్తి ఏమీ లేదు. ఈ ఆవుని అతను ప్రాణప్రదంగా చూసుకుంటుంటాడు. కానీ ఎక్కడా డబ్బు సమకూరక పోవడంతో గత్యంతరం లేక ఆవుని అమ్మవలసి వచ్చింది.

♦ ♦ ♦

పచౌలీలో మహమ్మదీయ కుటుంబాలు చాలా ఉన్నాయి. చాలా సంవత్సరాల తరువాత ఇటీవలే హజ్ యాత్రకి మార్గం తెరుచుకుంది. పాశ్చాత్య మహా యుద్ధం జరుగుతున్న సమయంలో యాత్రకి అవరోధం ఏర్పడింది. వృద్ధురాలైన రహ్మాన్ తల్లి చిరకాల వాంఛ హజ్ యాత్ర చెయ్యాలని. ఆమె రహ్మాన్ తో "నాయనా! నా మాట మన్నిస్తావని నమ్మకంతో అడుగుతున్నాను. జీవితంలో నాకు కేవలం ఒక్కగానొక్క కోరిక మిగిలిపోయింది. హజ్ యాత్ర చేయాలన్న కోరిక తీరకుండానే చనిపోతానేమోనని నా భయం. ఈ ముసలి తల్లి చివరి కోరిక తీరిస్తే దేవుడు నీకు తప్పక మేలు చేస్తాడు" అన్నది.

మాతృభక్తి గ్రామీణుల విశిష్ట గుణం. హజ్ యాత్రకి అవసరమైనంత ధనం రహ్మాన్ వద్ద ఎక్కడుంది? కానీ తల్లి మాట ఎలా కాదనగలడు? ఎవరివద్దయినా అప్పు చేద్దామని నిర్ణయానికి వచ్చాడు. ఈసారి చెరుకు పంట చేతికి రాగానే కొంత తీరుద్దామని, మిగిలింది మరుసటి సంవత్సరం తీర్చేయవచ్చని భావించాడు. దేవుడి దయ వల్ల ఈ సంవత్సరం పైరు మునుపెన్నడు లేనంత బాగా ఉంది. అదంతా తన తల్లి ఆశీర్వాద ఫలితమే కదా! అయితే, అప్పు ఎవరి వద్ద చెయ్యటం? కనీసం 200 రూపాయలు ఉంటే గానీ యాత్రకి

సరిపోవు. తనకు తెలిసిన వడ్డీ వ్యాపారులు ఎవ్వరూ లేరు. తన గ్రామంలో ఒకరిద్దరు వ్యాపారులున్నా అప్పు తీసుకున్న వాళ్ళని మోసగించి డబ్బు గుంజేవాళ్ళే. లాలా దావూదయాల్ వద్దకే డబ్బు కోసం వెళదాం అనుకున్నాడు. వీళ్ళకంటే ఆయనే నయం. ఆయన వాగ్దానం ప్రకారం అప్పు రాబడతాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టడని విన్నాడు. బల్లి గోడను విడిచిపెట్టవచ్చేమో, చెద పురుగు కొయ్యిని విడిచిపెట్టవచ్చేమో గానీ తన వద్ద అప్పు పుచ్చుకున్నవాడు వాగ్దానం ప్రకారం జమ చేయకపోతే ఊరుకోడు. మాటలు తర్వాత, ముందు కేసు వేస్తాడు. ఆయనలో ఉన్న సుగుణం ఏమిటంటే అప్పు తీసుకున్న వాళ్ళ కళ్లల్లో దుమ్ము కొట్టడు. చిట్టాలో అవకతవకలుండవు.

దావూదయాల్ వద్దకు వెళ్ళటమా మానటమా అని చాలా రోజులు తేల్చుకోలేకపోయాడు. ఒకవేళ వాగ్దానం ప్రకారం డబ్బు సమకూరక అప్పు చెల్లించలేకపోతేనో! కేసు వెయ్యకుండా వదిలిపెట్టడు. ఇల్లూ-వాకిలి, ఎడ్లు అన్నింటినీ వేలం వేయిస్తాడు. అయినా చేసేదేమీ లేక దావూదయాల్ వద్దకే వెళ్లి అప్పు అడిగాడు.

దావూ : "నువ్వే కదా నాకు ఆవుని అమ్మింది?"

రహ్మాన్ : "అవునయ్యా."

దావూ : "అప్పు ఇస్తాను. కానీ వాగ్దానం ప్రకారం గడువు మీరకుండా చెల్లించి తీరాలి. ఏమీ రాయితీ ఉండదు. ఎప్పుడు చెల్లిస్తావో చెప్పు?"

రహ్మాన్ మనసులో లెక్కలు వేసుకొని - "అయ్యా! రెండు సంవత్సరాలు గడువు  పెట్టుకుందాము" అన్నాడు.

దావూ : ఒకవేళ రెండేళ్లలో చెల్లించకపోతే వడ్డీరేటు నూటికి 32 రూపాయలు అవుతుంది. నీ పట్ల నేను చూపించగల ఔదార్యం ఏమిటంటే, కేసు వెయ్యను. సరేనా?

రహ్మాన్ : మీకు తోచినట్టు చెయ్యండయ్యా! మీ చేతిలో ఉన్నవాణ్ణి దొరా..

200 రూపాయల అప్పుకు గాను రహ్మాన్ చేతికి 180 రూపాయలు ముట్టాయి. కొంత రాత కోతల కోసం, మరికొంత నజరానాగా, ఇంకొంత మధ్యవర్తిత్వం పేరుతో మినహాయించుకోబడింది. రహ్మాన్ ఇల్లు చేరి, ఇంట్లో అట్టిపెట్టుకున్న బెల్లం అమ్మాడు. భార్యకి ఎలాగోలా నచ్చజెప్పి తల్లిని వెంటపెట్టుకుని హజ్ యాత్రకి బయలుదేరి వెళ్ళాడు.

♦ ♦ ♦

గడువు పూర్తవడంతో లాలా దావూదయాల్ తన మనిషిని రహ్మాన్ ఇంటికి పంపించి పిలిపించాడు. చాలా కఠోరంగా - "ఇంకా రెండేళ్ళు పూర్తికాలేదా? తీసుకున్న అప్పు వెంటనే కట్టు" అన్నాడు.

రహ్మాన్ చాలా దీనంగా - "అయ్యా ఈ పేదవాడిపై దయచూపండి. నేను చాలా కష్టాల్లో ఉన్నాను. హజ్ యాత్ర చేసి తిరిగి వచ్చినప్పటి నుంచి మా అమ్మ జబ్బుతో ఉంది. రాత్రి-పగలు ఆమెకు సేవలు చేస్తున్నాను, మందులు ఇప్పిస్తున్నాను. తల్లి జీవించి ఉన్ననాళ్ళు సేవ చేసుకోవాలిగా దొరా! ఆకలి కష్టాలు జీవితమంతా ఉండనే ఉంటాయి. ఈసారి పంట చేతికి రాలేదుగదయ్యా. నీళ్ళు లేక చెరుకు ఎండిపోయింది. జనుము కూడా పొలంలోనే ఎండి వరుడై పోయింది. ఊరబెట్టి నారతీసే అవకాశమే లేకపోయింది. నేల పగుళ్ళు బారింది. రబీ పంట వెయ్యటానికి పొలం దున్నటమే సాధ్యంకాలేదు. ఎలాంటి కష్టాల్లో రోజులు గడుస్తున్నాయో ఆ అల్లాకే తెలుసు. తమరికి ఇవ్వాల్సిన డబ్బు అణా కాణీలతో సహా ముట్టచెబుతాను. ఇంకొక సంవత్సరం గడువు ఇప్పించండయ్యా. మా అమ్మకి ఆరోగ్యం కుదుటపడితే నా నెత్తిమీద గండం తప్పినట్టే దొరా" అని వేడుకున్నాడు.

దావూ దయాల్ "వడ్డీ సాలుకి నూటికి 32 రూపాయలు అవుతుంది, ఏమంటావు?" అన్నాడు.

రహ్మాన్ "దొరగారి చిత్తం" అన్నాడు.

దావూదయాల్ తో మాట్లాడి రహ్మాన్ ఇంటికొచ్చాడోలేడో తల్లిని చివరి ఘడియల్లో ఉండగా చూశాడు. ప్రాణాలతో ఉండగా చివరి చూపు దక్కింది. తల్లి కుమారుణ్ణి ఒక్కసారి వాత్సల్య దృష్టితో చూసి ఆశీర్వదించి పరలోకానికి ప్రయాణమయ్యింది. అప్పటికే పీకలదాకా కష్టాల నీటిలో మునిగి ఉన్న రహ్మాన్ కు, ఆ నీరు తలపైకి వచ్చినట్లైంది.

ఆ సమయానికి ఇరుగుపొరుగు వాళ్ల దగ్గర అప్పు తీసుకొని అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశాడు.

కానీ మృత ఆత్మ శాంతికోసం, తృప్తి కోసం జకాత్, ఫాతిహాలు నిర్వహించాలి. సమాధి కట్టించాలి. ఇరుగు-పొరుగు వారికి, బంధువులకు భోజనాలు పెట్టాలి. పేదలకు దానధర్మాలు, ఖురాన్ పఠనం ఏర్పాటుచేయాలి. ఇంకా ఇలాంటి ఎన్నో ఆచారాలు పాటించటం తప్పనిసరి.

మాతృ సేవకు ఇప్పుడు తప్ప అవకాశం ఇంకెప్పుడు వస్తుంది? తల్లిపట్ల సమస్త సాంసారిక, ధార్మిక బాధ్యతలు ఇంతటితో ముగిసిపోతాయి. ఇక మీదట తల్లి జ్ఞాపకాలు మాత్రమే మిగిలిపోతాయి- సంకట సమయాల్లో జ్ఞాపకం చేయడానికి! నాకు గనక భగవంతుడు స్తోమత కలగజేసిఉంటే ఈ సందర్భంలో ఎంతైనా చేసి ఉండేవాడిని. ఇప్పుడు నేను ఇరుగుపొరుగు వాళ్ళముందు తలదించుకోవాల్సిందేనా!

ఇప్పుడు డబ్బు ఎక్కడినుంచి తీసుకురావడం అని

ఆలోచించసాగాడు రహ్మాన్. లాలా దావూదయాల్ కూడా ఇవ్వడు. ఒకసారి ఆయనవద్దకు వెళ్లి చూస్తే, నాకొచ్చిన కష్టం విని ఆయనకు దయ కలుగుతుందేమో ఎవరికి తెలుసు. గొప్ప వ్యక్తి. కృపాదృష్టి ఉంటే వంద–రెండొందలు ఆయనకు ఏమంత పెద్ద విషయం!

ఈ విధంగా మనసులో ఆలోచించుకుంటూ రహ్మాన్ లాలా దావూదయాల్ వద్దకు వెళ్లాడు. దారిలో ఒక్కొక్క అడుగు చాలా భారంగా పడుతోంది. ఏ ముఖం పెట్టుకొని వెళ్ళను? మూడు రోజుల క్రితమే వెళ్లి గతంలో చేసిన అప్పు సంవత్సరంలో తీరుస్తానని వాగ్దానం చేసి వచ్చాను. ఇప్పుడు వెళ్లి మళ్ళీ 200 అడిగితే ఏమంటారో? ఆయన స్థానంలో నేనుంటే ససేమిరా ఇవ్వను. నా స్వభావం చెడ్డదని అభిప్రాయం ఆయనకు ఏర్పడి తీరుతుంది. ఒకవేళ చీదరించుకుని చివాట్లు పెడితేనో! నీవద్ద ఆస్తిపాస్తులు ఏమున్నాయని ఇంకా డబ్బు కుమ్మరించమంటావు అని నిలదీస్తే ఏమి సమాధానమివ్వగలను. నా వద్ద ఉన్న ఆస్తి కేవలం ఈ రెండు చేతులే. ఇవి తప్ప ఇంకేమున్నాయి. ఇల్లు ఉందంటే, ఊరికే ఇచ్చినా ఎవరూ తీసుకోరు. పొలం ఉందంటే, అది జమీందారుది. దానిపై నాకు ఎట్టి హక్కు లేదు. దావూ దయాల్ గారి వద్దకి అనవసరంగా వెళుతున్నాను. అక్కడ నుండి గెంటి వేయించుకుని రావాల్సి వస్తుంది. కొద్దీ–గొప్ప మిగిలి ఉన్న పరువు కూడా మంటగలిసిపోవడం ఖాయం. ఇన్ని నిరాశాపూరితమైన సందేహాలు ఉన్నప్పటికీ రహ్మాన్ నెమ్మది నెమ్మదిగా ముందుకు సాగుతూనే ఉన్నాడు – ఎవరో అనాథ విధవ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వెళు_న్నట్టు.

లాలా దావూదయాల్ అప్పుడే కోర్టునుంచి ఇంటికొచ్చి ఆలవాటు ప్రకారం నౌకర్లను చివాట్లు పెడుతున్నాడు – 'వాకిట్లో కళ్ళాపి చల్లలేదేమిటి?', 'వరండాలో కుర్చీలు తియ్యాలని తెలియదా?'

దావూదయాల్ విసుగ్గా కూర్చున్నాడోలేదో రహ్మాన్ ఆయన ఎదురుగా వెళ్లి నిలబడ్డాడు. అతన్ని చూసి కోపంగా "మళ్ళీ ఏమి చెబుదామని వచ్చావు? ఎందుకు నా వెంట పడ్డావు? ఇప్పుడు మీతో మాట్లాడే తీరిక లేదు" అన్నాడు.

రహ్మాన్ నోరు మెదపలేకపోయాడు. నిరాశతో వెనుదిరిగాడు. అనుకున్నంతా అయ్యిందిగా! చివాట్లు తినటానికే నేను వచ్చినట్టయింది. నా బుద్ధి మందగించింది, అంతే.

దావూదయాల్ కసురుకున్నాడు గానీ మరుక్షణమే జాలి కలిగింది. రహ్మాన్ వరండా నుంచి కిందకు దిగాడో లేడో వెనక్కు పిలిచాడు. నెమ్మదిగా "ఎందుకు వచ్చావు? ఏమన్నా పని ఉందా?" అడిగాడు.

రహ్మాన్ : లేదు దొరా, ఊరకే సలాం చేసుకుని వెళదామని వచ్చాను.

దావూ : రైతన్నవాడు అవసరం లేకుండా సలాం చెయ్యడానికి రాడని నాకు తెలుసులేగానీ విషయమేమిటో చెప్పు.

రహ్మాన్‌కి దు:ఖం పొంగుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడవ సాగాడు. అతని తల్లి మరణించి ఉంటుందని దావూ దయాల్ వెంటనే గ్రహించాడు. 'రహ్మాన్! మీ తల్లి గాని మరణించలేదు గదా!' అన్నాడు.

'అవును దొరా! అదే జరిగింది. ఇది మూడోరోజు' అని రెహ్మాన్ బావురుమన్నాడు.

"ఏడవకు ఏడవకు. ధైర్యంగా ఉండు. దేవుడు ఏది తలిస్తే అదే జరుగుతుంది. ఇటువంటి మరణానికి దు:ఖించటం తగదు. నీ చేతులతో తల్లికి అంత్యక్రియలు చేయగలిగావు. అంతకంటే మించినదేముంది?"

"దొరా! ఒక విన్నపంతో మీ వద్దకు వచ్చాను. కానీ ధైర్యం చాలడం లేదు. మునుపు తీసుకున్నదే అలా ఉంది. ఏ ముఖం పెట్టుకుని అడగను? నా ఇబ్బందులు ఆ అల్లాకే తెలుసు. ఎక్కడా ఒక్క పైసా కూడా పుట్టే పరిస్థితి లేదు దొరా. అవసరమా ఎలాంటిదంటే ఇప్పుడు చేయకపోతే జీవితమంతా పశ్చాత్తాప పడాల్సివస్తుంది. తమరికి ఇంతకంటే ఎక్కువ చెప్పుకోలేను. ఆపై మీ దయ. ఏట్లో పడేశాననుకునే ఇవ్వండి. బతికుంటే వడ్డీతోసహా ముట్టజెపుతాను, నన్ను నమ్మండి. ఈ సమయంలో కాదనకండి దొరా!'

దావూ : ఇప్పటికే మూడు వందలైంది. ఇంకా రెండు వందలు అడుగుతున్నావు. రెండేళ్లలో ఏడు వందలై కూర్చుంటుంది. ఆ విషయం తెలుసా నీకు?

రహ్మాన్ : దయగల దొరా! అల్లా కరుణిస్తే రెండు భీగాల పొలంలో చెరుకు పంటకు దిగుబడి 500 రూపాయల వరకు రావచ్చు. అల్లా తోడుంటే గడువులోపే మీ అప్పు అణాకాణీలతో జమచేస్తాను.

దావూదయాల్ ఇంట్లోనుంచి రెండు వందలు తెచ్చి రహ్మాన్ చేతిలో పెట్టాడు. అయన వ్యాపార సరళి తెలిసినవాళ్ళు రహ్మాన్ పట్ల అయన చూపిన ఔదార్యానికి ఎంతగానో ఆశ్చర్యపోయారు.

◆ ◆ ◆

వ్యవసాయం పరిస్థితి అనాథ బాలుడు లాంటిది. నీరు, గాలి అనుకూలంగా ఉంటే ధాన్యం రాశులుగా పండుతుంది. వాటి కృప లేకపోతే పచ్చని పైరు కూడా కపటియైన స్నేహితుడిలాగా మోసం చేసేస్తుంది. వడగళ్ళు, మంచు,

అతివృష్టి–అనావృష్టి, మిడతలు–పురుగులు, చెదలు–తుపానులు మొదలైన వాటన్నింటినుంచి బతికి బైట పడితే పంట కల్లానికి చేరుతుంది. కల్లానికి అగ్గితో–పిడుగులతో వైరం. ఇన్ని శత్రువులనుంచి కాపాడబడితే పంట, లేకుంటే ఫైసలా! రహ్మాన్ రెక్కలు ముక్కలు చేసుకున్నాడు. పగలుని పగలని, రాత్రిని రాత్రని అనుకోకుండా కష్టపడ్డాడు. భార్యాపిల్లలు కలబడి మనసుపెట్టి అతనితో పని పంచుకున్నారు. చెరకుపైరు ఎంత దట్టంగా ఎదిగిందంటే ఏనుగు చొరబడినా కనబడదేమో అన్నట్టుగా ఉంది. గ్రామమంతా రహ్మాన్ పొలాన్ని చూసి ఆశ్చర్యపోసాగారు. లోకులు– అతనితో “ఈసారి నీ పంట పండిందిలే. నువ్వు పడిన కష్టం వృథా పోలేదు. నీ కష్టాలన్నీ తీరిపోతాయి” అన్నారు. కోతలై బెల్లం డబ్బు చేతికందిన వెంటనే పైకం మొత్తం తీసుకెళ్ళి లాలా దావూదయాల్ గారి పాదాల వద్ద ఉంచుదామని, ఒకవేళ అయనే స్వయంగా కాస్త తీసి ఇస్తే తీసుకుందామని, లేకపోతే సంవత్సరమంతా ఏ ఆకో–అలమో తిని గడిపేద్దామని రహ్మాన్ ఆలోచిస్తున్నాడు.

కానీ నొసట రాసిపెట్టినదాన్ని ఎవరు చెరపగలరు? మార్గశిర మాసం, రహ్మాన్ పొలం గట్టున కుర్చుని కాపలా కాస్తున్నాడు. కప్పుకోవటానికి కేవలం పాత దుప్పటి మాత్రమే ఉంది. చలి కాచుకుందామని ఎండు చెరుకాకులు పోగుచేసి మంటవేశాడు. అగస్మాత్తుగా గాలి అలలా రావటంతో మండుతున్న ఆకులు ఎగిరి పొలంలో పడ్డాయి. అంతే క్షణాల్లో పైరుకి నిప్పు అంటుకుంది. గ్రామంలోని ప్రజలు ఆర్పటం కోసం పరుగుపరుగున వచ్చారు. కానీ అగ్ని జ్వాలలు రాలిపడుతున్న నక్షత్రాల్లా పొలంలోని ఒకచోటు నుంచి ఎగిరి మరో చోట పడటంతో వాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. చూస్తూ చూస్తూ ఉండగానే పైరంతా కాలి బూడిద కుప్పగా మారిపోయింది. ఆ పైరుతో పాటే రహ్మాన్ కలలు–కోరికలూ మంటగలిసిపోయాయి. పేదవాడి వెన్ను విరిగిపోయింది. కాళ్ళు–చేతులు సత్తువ కోల్పోయాయి. ఎదురుగా వడ్డించిన విస్తర ఎవరో లాగివేసినట్టయింది. ఇంటికి వచ్చాడన్నమాటేగాని దవూదయాల్ కు ఇచ్చిన మాట, చెల్లించాల్సిన అప్పు గురించే దిగులు. తన జీవనాన్ని గురించి ఆలోచన లేదు, భార్యపిల్లల గురించీ లేదు. ఆకలితో పస్తులుండటం, చింపిరి గుడ్డలతో బతుకు వెళ్ళమార్చటం రైతన్నవాడికి కొత్తేమీ కాదు. రహ్మాన్ ఆలోచనల్లా అప్పు గురించే. రెండు సంవత్సరాల గడువు తీరబోతోంది. మూడు–నాలుగు రోజుల్లో లాలా దావూదయాల్ తాలూకు మనిషి రావొచ్చు. అతనికి ముఖమెలా చూపించటం? వెళ్ళి కాళ్ళావేళ్ళా పడి ఇంకో సంవత్సరం గడువు పెంచమని అడిగితే! కానీ ఆ ఒక్క సంవత్సరంలోనే ఏడు వందలు కాస్తా తొమ్మిది వందలై కూర్చుంటుంది. కేసు వేస్తే రెండు వేలైనా అవ్వొచ్చు. సంవత్సరంలో ధనరాశులేమైనా కురుస్తాయా? పాపం ఎంత మంచి మనిషి, అడిగిన వెంటనే రెండు వందలు ఇచ్చేశాడు. పొలంలో ఏం మిగిలింది గాబట్టి తాకట్టు పెట్టైనా పరువు దక్కించుకోవడానికి! ఎడ్లేమన్నా దృఢంగా ఉన్నాయా మూడు–నాలుగు వందలు పలకటానికి! అవీ చిక్కి సగమయ్యాయి. ఇక పరువు ఆ ఖుదా చేతిలోనే ఉంది.

ఉదయం వేళ. రహ్మాన్ తన పొలం గట్టుపైన నిలబడి పైరుకు జరిగిన వినాశక దృశ్యాన్ని చూస్తున్నాడు. అప్పుడే దావూదయాల్ నౌకరు భుజాన్న దుడ్డుకర్ర పెట్టుకుని రావటం గమనించాడు. పై ప్రాణాలు పైనే పోయినట్టనిపించింది. దేవుడా! ఈ ఆపద నుంచి నువ్వే కాపాడు. రావటంతోటే తిట్లు మొదలేదతాడేమో! అల్లా! నువ్వే దిక్కు.

నౌకరు రహ్మాన్ దగ్గరకొచ్చి – “ఏమయ్యా? డబ్బులు తీసుకున్నప్పుడు కట్టాలని తెలియదా? గడువు నిన్నటితో తీరిపోయింది. దొరగారి సంగతి తెలియదా? ఒక్క రోజు ఆలస్యమైనా కేసు వేసేస్తారు. నోటికివచ్చినట్టు తిడతారు.”

రహ్మాన్ వణికిపోయాడు.''ఇక్కడ నా పరిస్థితి చూస్తున్నావుగా?” అన్నాడు.

నౌకరు – “నీ సాధక బాధకాలు వినటానికి రాలేదు. ఈ మస్కా ఇంకెరికైనా కొట్టు. ఏడు వందలు తీసుకుని మారు మాట్లాడకుండా నాతో రా!”

రహ్మాన్ – ''అయ్యా, నా చెరుకు మొత్తం తగలబడిపోయింది. అల్లాకే తెలుసు. ఈసారి దొరగారి అప్పు అణా కాణీలతో చెల్లించివేసేవాడిని.”

నౌకరు – “నాకు అవేమీ తెలీదు. నీ చెరకుని ఎవడూ గుత్తకు తీసుకోలేదు. ఇప్పుడే పద, దొరగారు ఉన్నపళాన తీసుకు రమ్మన్నారు.” అంటూనే రహ్మాన్ చెయ్యి పట్టుకుని ఈడ్చుకు వెళుతున్నట్టు నడిచాడు నౌకరు. పేదవాణ్ణి ఇంటికి వెళ్ళి తలపాగా కూడా కట్టుకోనివ్వలేదు.

♦ ♦ ♦

ఐదు కోసుల దూరం నడిచారు. రహ్మాన్ వంచిన తల ఒక్కసారి కూడా ఎత్తలేదు. నోటినుండి ఉండుండి కేవలం 'యా అల్లా! ఆపద గట్టెక్కించు' అన్న మాట మాత్రం వెలువడుతోంది. అతనికి ఇప్పుడు ఆ నామస్మరణ మీదే నమ్మకం. దాని జపమే అతని ధైర్యాన్ని కాపాడుతూ వస్తోంది. లేకుంటే అక్కడికక్కడే కూలబడిపోయి ఉండేవాడు. మనిషిని చైతన్యం కాక ఉపచైతన్యం మాత్రమే శాసించే నైరాశ్యపు చరమ

దశకు చేరుకున్నాడు రహ్మాన్.

దవూదయాల్ గుమ్మంవద్ద పచార్లు చేస్తున్నాడు. రహ్మాన్ పరుగున వెళ్ళి ఆయన పాదాలపై పడ్డాడు. "దయగల దొరా! చాలా కష్టాల్లో ఉన్నాను. అల్లాకే తెలుసు, దమ్మిడీకి కొరగాకుండా పోయాను!"

దావూ : "చెరకు మొత్తం తగలబడిపోయిందా?"

రహ్మాన్ : "తమరు కూడా విన్నారా? దొరా, పొలం మొత్తం ఊడ్చేసినట్టు అయిపోయింది. ఊళ్ళో ఈసారి చెరకు విరగ పండింది. అనుకోని ఆపద ఊడిపడకపోతే తమరి ఋణం మొత్తం చెల్లించేసేవాడిని. నన్ను నమ్మండి."

దావూ : "అయితే ఇప్పుడేమంటావు? ఇస్తావా కేసు వెయ్యమంటావా?"

రహ్మాన్ : "తమరి దయపై బతుకుతున్నవాడిని. దొరా మీకు తోచినట్టు చెయ్యండి. తమరి అప్పు నా నెత్తిన ఉందని, ప్రతి పైసా చెల్లించాలని అనుక్షణం జ్ఞాపకంతో మెలుగుతున్నాను. అనుకున్నవి అనుకున్నట్టు జరగవు. రెండుసార్లు తమరికి వాగ్దానం చేసి, రెండు సార్లూ తప్పాను, కనుక ఈసారి వాగ్దానం చెయ్యను. ఎప్పుడు ఎంత ఉంటే అంత తెచ్చి తమరి పాదాల వద్ద ఉంచుతాను. కూలీ నాలీ చేసి, కడుపు కాల్చుకుని ఎలాగైనాసరే మీ డబ్బు కట్టేస్తాను, నమ్మండి దొరా!"

దావూదయాల్ చిరునవ్వు నవ్వి "రహ్మాన్! ఈ క్షణంలో నీ మనసులో ఉన్న అతిపెద్ద కోరిక ఏమిటి?"

రహ్మాన్ : "తమరి అప్పు తీరిపోవాలి, అదొక్కటే నా కోరిక. నిజం చెపుతున్నాను, ఆ అల్లాకే తెలుసు దొరా!"

దావూ : "అలాగా! నీ అప్పు తీరిపోయిందని అనుకో!"

రహ్మాన్ : "అదెలా దొరా? అట్లా ఎట్టా అనుకుంటాను? ఇక్కడ ఇవ్వకపోతే అక్కడైనా ఇవ్వాల్సి ఉంటుందిగా?"

దావూ : "అక్కర్లేదు రహ్మాన్! దాన్ని గురించి మర్చిపో. నాకు నువ్వేంటో తెలుసు."

రహ్మాన్ : "దొరా! అలా అనొద్దు. ఇంత బరువు నెత్తినపెట్టుకుని చనిపోమంటారా?"

దావూ : "ఎలాంటి బరువు? నీ నుంచి నాకు రావలసింది ఏమీ లేదు. ఒకవేళ ఉన్నా, నేను మాఫీ చేసేశాను, ఇక్కడ అక్కడ కూడా. ఇప్పుడు నువ్వు నాకు ఒక్క పైసా కూడా అప్పు లేవు. నిజానికి నేను నీ వద్ద తీసుకున్న అప్పే తీరుస్తూవచ్చాను. నేనే నీకు అప్పుదారుణ్ణి కానీ నువ్వు నాకు కాదు. నీ ఆవు ఇప్పటికీ నావద్ద ఉంది. అది ఎంతలేదన్నా ఎనిమిది వందల రూపాయల కిమ్మత్తుగల పాలు ఇచ్చింది. ఆపైన రెండు దూడల్ని కూడా. ఒకవేళ నువ్వు ఈ ఆవుని కసాయివాళ్ళకి అమ్మి ఉంటే నాకు ఇంత లాభం జరిగేదేనా? ఆరోజు నువ్వు ఐదు రూపాయల నష్టాన్ని భరించి నీ ఆవుని నాకు అమ్మావు. నీలోని మంచితనం నాకు ఇప్పటికీ జ్ఞాపకముంది. ఆ ఉపకారానికి ప్రతిఫలం చెల్లించటం నా శక్తికి మించినది. నువ్వు ఇంత పేదవాడివి, అశక్తుడివి అయి ఉండికూడా ఒక ఆవు ప్రాణాలు కాపాడటం కోసం ఐదు రూపాయల నష్టాన్ని భరించగలిగితే, నేను నీకంటే వంద రెట్లు స్తోమత కలిగిఉండి కూడా నాలుగైదు వందలు మాఫీ చెయ్యటం పెద్ద గొప్ప పనేమీ కాదు. రహ్మాన్! నువ్వు కావాలని నాకు ఉపకారం చేసి ఉండక పోవచ్చు, కానీ నిజానికి అది నా మతం పట్ల నువ్వు చూపిన గౌరవం, విశ్వాసం. నేను కూడా మీ ధార్మిక కార్యక్రమం కోసమేగా డబ్బు ఇచ్చాను. అంతే, నువ్వు చేసినదానికి, నేను చేసినది సరిపోయింది... నీ రెండు దూడలు నావద్ద ఉన్నాయి, కావాలంటే వాటిని తీసుకువెళ్ళు వ్యవసాయంలో నీకు ఉపయోగపడతాయి. రహ్మాన్! నువ్వు చాలా నిజాయితీపరుడువి, మంచివాడివి. నీకు సహాయం చెయ్యటానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను. ఇప్పుడు కూడా నీకు డబ్బు అవసరమైతే, ఎంత కావాలంటే అంత ఇస్తాను, తీసుకోవచ్చు."

తన ఎదురుగా కుర్చున్నది ఎవరో దేవదూతగా అనిపించింది రహ్మానుకు. మనిషి ఉదారుడైతే దేవదూత, నీచుడైతే సైతాను. ఈ రెండూ మానవీయ ప్రవృత్తుల పేర్లే. రహ్మాన్ నోటివెంట ధన్యవాదాలు అనే మాట కూడా వెలువడలేదు. పొంగుకొస్తున్న కన్నీటిని అతికష్టం మీద ఆపుకుంటూ "దొరగారి ఇంతటి మంచితనానికి, ఔదార్యానికి ప్రతిఫలం దేవుడు తప్పకుండా ఇస్తాడు. నేను మాత్రం ఇప్పటికీ నన్ను తమరి బానిసగానే భావిస్తాను."

దావూ : లేదు, నువ్వు నా మిత్రుడివి.

రహ్మాన్ : లేదు దొరా, బానిసను.

దావూ : బానిసత్వం నుంచి విముక్తి పొందటం కోసం చెల్లించే ధనాన్ని ముక్తిధనం అంటారు. నువ్వు చాలా ముందే 'ముక్తిధనం' నాకు ముట్టజెప్పేశావు. మళ్ళీ పొరపాటున కూడా ఆ మాట నీ నోట రానివ్వొద్దు. ■

**"ఉత్తమ సాహిత్యానికి**
**జన్మస్థానం సమాజ జీవితమైనట్లే**
**దాని గమ్యస్థానం కూడా**
**సమాజ జీవితమే."**
**- రా.రా.**

# బాల్యం రెక్కలు విరిచిందెవరో ..!?



సెకండ్ బెల్ చెవిలో పడగానే
కాళ్ళు మరింత సాగుతూ పోయేవి
కాస్త లేటైందని వేసిన గోడకుర్చీ
కొబ్బరి చెట్ల కింద పారేసుకున్న తాడాట
ఎక్కాలు అప్పజెప్పేసి దింపుకున్న గుండె బరువు
కల్మషమంటని క్షణాలు ఇవే కదూ
మరిక .. జీవితం ఇక్కడే ఆగిందా? ఎందుకనో!

పెంచుకున్న మొక్కలు నీకైనా నాకైనా అపురూపమవి
కాసింత వాడిపోతే మనమూ తలలు వేళ్ళాడెయ్యమూ
తోటపని చేస్తుంటే గుచ్చుకుంది ముళ్ళేగా
మరి వంకర టింకర చూపుల కత్తులు తొలిచిన
లోతైన గాయాన్నెక్కడని దాచి పెట్టను
అపురూపమైనవేనా అన్నీ? మరి బాధించేవో?

తాతయ్య చెప్పినట్లు రక్తం చిమ్మిన వేలుని
కాసేపు నోట్లో పెట్టుకున్నా
బాల్యంలా ఇదీ అద్భుతమైన వైద్యమే,
ఇది నీకూ అనుభవమేగా!
మరుసటి రోజుకి ఎర్ర గులాబీ విచ్చుకుంది
కళ్ళు ఇంతలేసి అవ్వడమంటే ఇదే కదూ
నిన్ను ఎప్పుడు చూసినా మరిక ఇదే యాతన!
నవ్వుకుంటున్నావా! చెంపల్ని తడిమిన కన్నీటి సంగతి?

చందమామ, బాలమిత్ర కథల్లోనూ నువ్వూ నేనే
భట్టి విక్రమార్కుడు మన పసినాళ్ళ హీరో
దారిద్ర్యాన్ని ఎన్ని సార్లు భుజానేసుకుని
ఎక్కడో చోట వదిలేద్దామనుకున్నానో, కుదిరింది కాదు
తిరిగి తిరిగి అలసిపోయిన గడియారంలా
బతుకు కావడి పేదరికం ముల్లు దగ్గరే ఆగిపోయింది
మరిక కొనసాగింపు ఇదేనా? రెండుగా చీలిన తోవ సంగతి?

బాల్యం అక్కడే ఉండిపోయిందా?
యవ్వనం అరచి గోలపెట్టి మరీ చెయ్యి సాచలేదూ!
ఏవేవో హార్మోన్లు యాతన పడుతూనే
నెత్తుటి ప్రవాహమై కాసింత భారాన్ని దింపుకున్నాయిగా
ఇప్పుడిక నేనిక్కడే ఒంటరిగా! నువ్వెక్కడో?

నోటితో పొగిడి నొసటితో వెక్కరించటమంటే !
అప్పుడే కాస్త స్పృహకు వచ్చింది
స్తోమత వెక్కిరించిన చదువు
పెను తుపానులో కొట్టుకుపోయిన ఆశయాలు
ఇప్పటికీ అదో చెరగని మచ్చలా ఇక నాతోనే
శిధిలమైన బాల్యమా! నిన్నెక్కడని వెతకను?

చిన్న చిన్న ముక్కలుగా చిన్నాభిన్నమైన అద్దంలా
నన్ను నేను అతికుంచుకుంటున్నానా,
లోలోన ముక్కలౌతున్నానా
నాకు నేనే కొత్తగా కనిపిస్తూ
పెంచుకున్న మొక్కలకు నీళ్ళెవరు పోశారనీ?
ఆశల రెక్కలు నరికిందెవరో!?

ఏం చెయ్యాలో, ఎటు పోవాలో పాలుపోక
కోళ్ళ గాబులోనే కలియతిరుగుతూ
ఒంటరి కోడి పిల్లలా నేను!!

- వైష్ణవి శ్రీ
80742 10263



# సిజెఐ చంద్రచూడ్ న్యాయ వ్యవస్థ పరిణామాలు

- తెలకపల్లి రవి

**భా**రత ప్రధాన న్యాయమూర్తిగా డి.వై. చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశాక సుప్రీంకోర్టులో ఇటీవల కొన్ని నూతన పరిణామాలు చూస్తున్నాం. కొలీజియం సిఫార్సులు, కీలక, కేసుల పోస్టింగు రిజిస్ట్రేషన్, బదిలీలు, కేంద్ర న్యాయశాఖ స్పందనలు, కొన్ని రాజ్యాంగ కేసుల విచారణ వంటి అన్ని విషయాల్లోనూ కొత్త వాతావరణం కనిపిస్తున్నది. దేశ చరిత్రలోనే అత్యధికంగా ఏడున్నరేళ్లు సిజెఐగా పనిచేసిన వై.వి.చంద్రచూడ్ కుమారుడైన ప్రస్తుత సిజెఐ రెండేళ్లపైన పదవిలో కొనసాగనుండటం గత పదేళ్లలో ఇదే ప్రథమం. అనేక సందర్భాల్లో స్వతంత్ర విమర్శనాత్మక వైఖరి ప్రదర్శించి సంచలన తీర్పులు ఇచ్చిన సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలంపై ముందే చాలామందిలో ఆశావిశ్వాసాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే గత కొన్ని సంవత్సరాలుగా మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ హయాంలో న్యాయ వ్యవస్థ కేంద్రానికి విధేయంగానూ, అనుకూల రీతిలోనూ వ్యవహరిస్తున్నదనే అభిప్రాయం బలపడింది. అందుకు అనేక ఆధారాలూ వున్నాయి. ప్రజల మౌలిక హక్కులకూ లౌకిక తత్వానికీ సంబంధించిన కేసులు వెనక్కుపోవడం, దేశద్రోహం రాజద్రోహం వంటి పేర్లతో అనేక మంది అభ్యుదయవాదులను దారుణమైన శిక్షలకు గురిచేయడం, పౌరసత్వ సవరణ చట్టం, జమ్ము–కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేకానేక మౌలికమైన అంశాలు ఏళ్లతరబడి విచారణకు నోచుకోవడం లేదు గాని ప్రార్థనా స్థలాల వివాదాలు మాత్రం పదేపదే ముందుకొచ్చాయి. న్యాయమూర్తుల పైన వివాదాలు, ఫిర్యాదులు తీవ్రమయ్యాయి. అయిదేళ్ల కిందట అప్పటి ప్రధాన న్యాయమూర్తిపైనే సహచర సీనియర్లు ధ్వజమెత్తాల్సి వచ్చింది. హైకోర్టులూ అనేకసార్లు భిన్నాభిప్రాయం వెలిబుచ్చాయి. మరో వంక కేంద్రం ఏకపక్ష జోక్యం, వ్యాఖ్యలు ఒత్తిడి తేవడం కనిపించింది. మాజీ ప్రధాన న్యాయమూర్తిని రాజ్యసభకు పంపడమూ జరిగింది. ఇన్ని పరిణామాల మధ్య సిజెఐగా వచ్చిన జస్టిస్ ఎన్.వి.రమణ అత్యధికంగా జడ్జిల నియామకం చేయడానికి ప్రాధాన్యతనిచ్చారు. పైన చెప్పిన కేసులన్నీ అలాగే వదలి పదవీ విరమణ చేయగా జస్టిస్ యు.యు.లలిత్ ఇంచుమించు రెండు మాసాల పాటు ఆ స్థానంలోకి వచ్చారు. ఆయన సుప్రీంలో కేసులు వేగంగా పరిష్కరిస్తానంటూ పెద్దఎత్తున ధర్మాసనాలకు కేటాయిస్తూ వచ్చారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల వంటి ఒకటి రెండు కేసులు మాత్రం పరిష్కారం చేసి దిగిపోయారు. ఆ సందర్భంగా తాను రాజ్యసభ పదవి వంటివి తీసుకోను గాని పార్లమెంటు ఆమోదించే ట్రిబ్యునళు వంటి వాటిని తీసుకోవడానికి అభ్యంతరం లేదని ప్రకటించారు. ప్రొఫెసర్ సాయిబాబా విడుదలకు హైకోర్టు తీర్పు చెబితే సుప్రీం కోర్టు ఆలస్యం చేసిన తీరుకు తన బాధ్యత లేదని సమర్థించుకున్నారు.

### చంద్రచూడ్ తొలి చర్యలు

సిజెఐగా చంద్రచూడ్‌పై ఆశలుండటానికి కారణముంది. ఆయన ఇచ్చిన తీర్పులు అలాంటివి. 377 అధికరణం స్వలింగ సంపర్కుల కేసు, వివాహేతర సంబంధాలలో మహిళల పట్ల వివక్షత, బాలికలను దత్తత తీసుకోవడం, శబరిమలలో మహిళల ప్రవేశం, అవివాహితల గర్భస్రావ హక్కు, అత్యాచారం కేసుల్లో రెండు వేళ్లతో పరీక్ష రద్దు వంటి అనేక సంచలన తీర్పులు హైకోర్టులోనూ సుప్రీంక కోర్టు లోనూ కూడా వెలువరించారు. ప్రాథమిక హక్కుల రక్షణ, పర్యావరణ

పరిరక్షణ విషయాల్లో ముందున్నారు. గుజరాత్ మారణకాండపై తీసిన చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ నిలిపివేతను కొట్టివేశారు. ఆదాయపన్ను శాఖపై వోడా ఫోన్ ఫిర్యాదును తోసిపుచ్చారు. మతతత్వ పూరితంగా ఓట్లు అడగడానికి, నిజమైన సమస్యలు చెప్పడానికి తేడా వుందని ఒక తీర్పులో స్పష్టంచేశారు. గోప్యత హక్కును సమర్థించే తీర్పునిచ్చారు. ఢిల్లీ పాలన ముఖ్యమంత్రిదే తప్ప లెఫ్టినెంట్ గవర్నర్‌ది కాదని స్పష్టంగా తీర్పునిచ్చారు. ఆధార్ చట్టం చెల్లుబాటును మెజార్టీ తీర్పు ఆమోదిస్తే అది సరైన రీతిలో రాజ్యాంగ బద్ధంగా ఆమోదించలేని జస్టిస్ చంద్రచూడ్ ఒక్కరే మైనార్టీ తీర్పునిచ్చారు. సైన్యంలోనూ మహిళా అధికారుల పట్ల వివక్ష చెల్లదన్నారు. ఇలాంటివి ఇంకా చాలా వున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవలేదు. తన హయాంలో మరే సిజెఐ విషయంలోనూ మోడీ హాజరుకాకపోవడం జరగలేదు. ఇది పొరబాటనీ, ఆయన విముఖతకు నిదర్శనమనీ వ్యాఖ్యలు వచ్చాయి. కొంతమంది ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యాతలు రెండేళ్ల పాటు వుండబోయే సిజెఐ చంద్రచూడ్ తీరును కనిపెట్టి వుండాలని రాయడం గమనించదగింది. న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు ఈ తరుణంలోనే కొలీజియం వ్యవస్థపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణయాధికారం ప్రభుత్వానిదే గాని న్యాయస్థానాలది కాదని చెబుతూ వచ్చారు. కొన్ని సంవత్సరాల తర్వాత న్యాయ కమిషన్‌ను పునర్నిర్మించారు.

సంప్రదాయికంగా ప్రమాణ స్వీకారానికి ముందు సిజెఐ ఇచ్చిన ఇంటర్వ్యూలలో సామాన్యునికి న్యాయం అందించడం మొదటి ప్రాధాన్యత అన్నారు. జస్టిస్ రమణ హయాంలో జడ్జిలపై విమర్శలను, ఆరోపణలను గట్టిగా ఖండిస్తూ వచ్చారు. గాజు ఇళ్లలో వలె భద్రత లేకుండా పోయిందన్నారు. ఇందుకు భిన్నంగా సిజెఐ చంద్రచూడ్ న్యాయమూర్తులు కూడా సోషల్ మీడియా విస్తరణను న్యాయమూర్తులు కూడా గుర్తించాలని విమర్శలకు సిద్ధం కావాలని సూచించారు. కొలీజియం వ్యవస్థ పరిస్థితిని బట్టి వచ్చిందే తప్ప ఉద్దేశపూర్వకమైంది కాదన్నారు. జడ్జిల నియామకం సమయంలో చాలా విషయాలు పరిశీలించాలంటే అందుకు ఒక వేదిక తప్పదనీ, అయితే నియామకాలు మాత్రం పారదర్శకంగా వుండాలని స్పష్టం చేశారు. న్యాయమూర్తులు వ్యక్తిగతంగా తీర్పరుల్లా జడ్జిమెంటల్‌గా వ్యవహరించరాదనీ, వాస్తవాలనుబట్టి నిర్ణయించాలని స్పష్టంచేశారు. జడ్జిల నియామకం పారదర్శకంగా వుండాలనీ అనేశారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే సిజెఐ చంద్రచూడ్ కేసులను నమోదు చేసి ధర్మాసనాల ముందుకు తెచ్చే విషయంలో పారదర్శకమైన ప్రకటన చేశారు. కేసుల భారం తగ్గించేందుకు అంతకు ముందు జరిగిన దానికి భిన్నంగా అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. దీర్ఘకాలంగా మగ్గిపోతున్న బెయిలు దరఖాస్తులు, కేసుల బదిలీలు మాత్రం భారీ ఎత్తున ప్రతి రోజూ చేపట్టాలని నిర్ణయించారు. తొలి కొలీజియం సమావేశంలోనే ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేశారు. దీనిపై తెలంగాణ, గుజరాత్ హైకోర్టులలో న్యాయవాదలు నిరసన తెలిపితే పిలిపించి చర్చలు చేసి కొన్ని మార్పులు చేశారు. అయినా ఎ.పి హైకోర్టు నుంచి ఇద్దరు న్యాయమూర్తుల బదిలీపై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ గణేశ్‌ల బదిలీ గురించి రాజకీయ పరిభాషలో నిరసన సాగుతున్నది. ఇంతకు ముందు కోర్టులపై వైసిపి వారు ఆరోపణలు చేస్తే ఈ బదిలీలపై టిడిపికి అనుకూలమైన వారు కొందరు శృతిమించిన వ్యాఖ్యలు కూడా చేశారు. తాము సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం తొక్కిపట్టడంపై సిజెఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. అంతేగాక సుప్రీంకోర్టు వీటి గురించి కేసు విచారణ చేపట్టి కేంద్రానికి నోటీసు కూడా ఇచ్చింది. కీలకమైన ఢిల్లీ, ముంబాయి హైకోర్టుల వంటివి కూడా గతం కన్నా తీవ్రమైన తీర్పులివ్వడం కనిపిస్తున్నది. మాజీ సిజెఐపై ఎ.పి ముఖ్యమంత్రి జగన్ గతంలో ఆరోపణలతో లేఖ రాయడం కూడా విచారణకు రానుంది. రాజధాని కేసులు, వాటిపై నిర్ణయం తీసుకోవడం గురించి రాజ్యాంగాధికారాలు కూడా ఇప్పుడు సుప్రీం ముందున్నాయి.

**సిఇసి నియామకం-ఏకపక్ష వైఖరి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) నియామకంలో కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరిని లోపభూయిష్టమైన నియామకాలను జస్టిస్ జోసఫ్ నాయకత్వం లోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ప్రశ్నించిన తీరు ఇటీవలి కాలంలో మనం ఎరుగనిది. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం సిఇసి ఆరేళ్ల కాలం గాని, 65 ఏళ్ల వయసు వరకూ గాని పదవిలో కొనసాగవచ్చు. కాని ఏరికోరి కేవలం ఏడాదిలోపు రిటైరయ్యే వారినే నియమించడం ద్వారా సిఇసిలు కీలుబొమ్మల్లా మార్చివేయబడుతున్నారు. వారేదైనా కీలకమైన నిర్ణయం తీసుకునే లోపే దిగిపోవలసిన స్థితి. తొలి సిఇసి ఎనిమిదేళ్లు పనిచేశారు. కాని కేంద్రం ఏరికోరి 1950లలో పుట్టిన వారినే ఎంపిక చేస్తున్నదని, వారు తమకు తలూపేలా వుండాలనుకుంటున్నదనీ సుప్రీం వ్యాఖ్యా నించింది. యుపిఏ

హయాంలో ఆరుగురు, మోడీ ఏడేళ్ల పాలనలో ఎనిమిది మంది సిఇసిలు మారారని గుర్తు చేసింది. రాజ్యాంగం ఈ నియామక ప్రక్రియపై పూర్తి స్పష్టతనివ్వలేదని సిఇసిని ఎంపిక చేసే కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా వుంటే మంచిదని సూచించింది.

ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతపై అనేక సందేహాలు ముసురుకుంటున్న వేళ సుప్రీం కోర్టు ఈ అంశాన్ని చేపట్టడం ఆహ్వానించదగింది. ఈ మాత్రం వ్యాఖ్యలు సహించలేని కేంద్ర అటార్నీ జనరల్ వెంకట రమణ మీరు మాట మీరవద్దు అనడం కేంద్రం వైఖరిని చెబుతుంది. న్యాయమూర్తులుంటే తప్పు జరగదని చెప్పలేమని ఆయన చేసిన వ్యాఖ్య అసహనపూరితమైంది. కొలీజియం ఒకటికి రెండు సార్లు చర్చించి న్యాయమూర్తుల పేర్లు సిఫార్సు చేశాక ఏమీ తేల్చకుండా కేంద్రం ఎడతెగని జాప్యం చేయడం సరికాదని కూడా ఇటీవల సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మొత్తంపైన గత కొద్ది సంవత్సరాలుగా సుప్రీం కోర్టు ధోరణిలో కొంతైనా మార్పు కనిపించడం, స్వతంత్రత అవసరాన్ని నొక్కి చెప్పడం స్వాగతించదగింది. దీనిపై కేంద్రం స్పందనలూ సుప్రీం తదుపరి అడుగులూ కూడా జాగ్రత్తగా చూడాల్సి వుంటుంది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలపైనా సమాఖ్యతత్వం, లౌకిక తత్వం, భావప్రకటనా స్వేచ్ఛ వంటి వాటిపైనా తీవ్ర దాడి చేస్తున్న సమయంలో వాటి రక్షణకు సుప్రీంకోర్టు కీలక పాత్ర వహించాలని ప్రజలు ఆశిస్తున్నారు. అప్పుడే అత్యున్నత నాయస్థానంపై కేంద్రం ఒత్తిడి పెరగడం కనిపిస్తూనే వుంది. మరి సిజెఐ చంద్రచూడ్ హయాంలో సుప్రీంకోర్టు కేంద్రం ఒత్తిడిని, దాడులను తట్టుకుని రాజ్యాంగ రక్షణకు తగు వైఖరి తీసుకుంటే దేశానికి, ప్రజాస్వామ్యానికి గొప్ప మేలు జరుగుతుంది. ■


# సాహిత్య ప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చురండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**


## నా దారెటు?

ఇన్నాళ్ళూ మృగాలతో సావాసం చేసా
మచ్చిక నేనెరుగు
నా చుట్టూ కంచె వేసుకోలే!
నా గుడిసె తాళం ఎరగదు
నా వెనుకా ఏం వేసుకోలేదు
చెట్టు చెట్టూ చుట్టూ కంచె వేసుకుంటూ
నా పూర్వీకులు పెంచిన కాన నా ఆసరా!

వేట నా వృత్తి
పోడు ఎవుసం నా పొట్టకూటికి
దారి నాది వంక నాది
కలుషితం ఎరగని జలం, నా మనసులా ...
వలస నాది బతుకులో భాగమది
ఎవ్వడూ నా ఉనికికి మెరుగులు దిద్దలేదు

మైదానం కన్ను పడ్డాకా
బుల్ డోజర్లు దున్నుతుంటే మారు మాట్లాడెవ్వడు
నేను ఎవుసం చేసుకుంటే ఎగాదిగా దాడులు
ఈడ్చుకుంటూ జైళ్ళలో కుక్కే ...

అడవి నా జన్మ స్థలం అడవే నా భుక్తి
కాదంటే ఎటు పోవాలి?
సరిహద్దులు నాకు తెల్వదు
అడవియే నాకు హద్దు కొలతలు వేయలేను
హద్దులు మీరి రాజ్యం మాపైకి ...

చట్టాలు తెలియవు/ ఏ చట్టం నా పక్షమో ఎరగను
హింస తెలియదు
కడుపు మీద కొడుతుంటే ఏం చేయాలి?
న్యాయం తరాజులో రాజ్యం వైపే మొగ్గు
రాజ్యం మృగం కన్నా భీతి గొల్పుతుంటే పాలు పోట్లే!

భూమిని దొంగిలించట్లే/ కంచేసి తెగ నమ్మట్లే
కబ్జా పదమెరుగను
చాటన చారెడు గింజల కోసం
రాలే చినుకు మీద ఆధారమై తరాలుగా
మనుషులమే ఎద్దులమై నాగలిని దున్నుకుంటూ
బతుకుతున్న జీవిని!

ఆదరువు అడవి
అడవినే విడిచి పొమ్మంటే
మూలవాసిని నేనెందుకు మిన్నకుండాలా!


**- గిరి ప్రసాద్ చెలమల్లు**

**94933 88201**

# ఇల్లు కూడా మనిషి లాంటిదే!

- డాక్టర్ దేవరాజు మహారాజు



ఇల్లు కూడా మనిషి లాంటిదే
దానికో బాల్యం, యావ్వనం, వృద్ధాప్యం ఉంటాయి
ఇంటి నిండా పిల్లలు కౌరింతలు కొడుతున్నప్పుడు
అరవై యేళ్ళ నాటి ఇల్లయినా సరే అది
తన వయసును మరిచి నవనవలాడుతూ కనిపిస్తుంది
బోసి నవ్వులు చిందిస్తూ.. గజ్జెల గలలు వినిపిస్తుంది.

ఆ ఇంట్లో యువతీ యువకుల సరసాలు సాగితే
ఇంటి పెరట్లో మల్లెలు గుబాళిస్తాయి.
ఆ ఇంటి కెక్కళ్ళ మీద గులాబీలు పూస్తాయి
ఆ ఇంటి చుట్టూ దీపాలు వెలిగించుకుని,
యవ్వనంతో వెలిగిపోతూ
అర్ధరాత్రి దాటినా ఆ ఇల్లు నిద్రపోదు –
బారెడు పొద్దెక్కినా నిద్రలేవదు –

ఇంట్లో ఉండే వాళ్ళకు వయసు మళ్ళితే
అది కొత్తగా కట్టిన ఇల్లయినా సరే.
కీళ్ళ నొప్పులు, కాళ్ళ నొప్పులు. గుండె జబ్బులతో బాధపడుతుంది!
దగ్గుల్లో మూలగుల్లో మునిగిపోయి
ఒక్కోసారి అది, నిశ్శబ్ద గంభీరంగా ఉండిపోతుంది.
అనుబంధాలు చచ్చిన ఇంట్లో ఆనందాలెట్లా ఉంటాయి?
అనురాగాలు లేనిచోట జీవన రాగాలెట్లా ఉంటాయి?
నిస్సహాయత గూడు కట్టుకుని,
ఆ ఇంటి ముందు నిశ్శబ్దంగా వేలాడుతూ ఉంటుంది
చీకటితో పోట్లాడే సత్తువ లేని ఓ గుడ్డి దీపం
వారి గాజు కళ్ళలాగా ఆ ఇంటి ముందు
ఏదో ఆశతో దీనంగా మినుకుమంటూ ఉంటుంది.
పెందరాళే పడుకుని ఎటూ తోచక ఆ ఇల్లు
వేకువ జామునే లేచి కూచుంటుంది.
ఒంటరితనంలో కొట్టుమిట్టాడుతూ
ఓ మాటకోసం, ఓ నవ్వుకోసం అంగలారుస్తూ ఉంటుంది!
మరి మనుషులెవరూ లేనప్పుడు
ఆ శూన్య గృహం మాత్రం ఏం చేస్తుంది?
అది ఊపిరి పీల్చే దెట్లా ? అలికిడే లేనప్పుడు
దాని గుండె కొట్టుకునేదెట్లా?
దాని నాడి నీరసించి, నీరసించి ఆగిపోతుంది కదా?
ఎముకలు వంగిపోయి వృద్ధాప్యంలో వంగిపోయిన
వెన్నుపూసను తలపిస్తుంది కదా?

ఆ ఇల్లు ఎంత కాలమని తనని తాను
కర్ర పోటుతో నిలబెట్టుకుంటుంది?
దాని కండరాలు గోడలు శుష్కించి, సడలిపోయి
చర్మం ముడతలు పడ్డట్టు పెచ్చులు ఊడిపోయి
ముఖ ద్వారపు నోరు వంకరపోయి
కిటకీల కళ్ళు బూజుల ఊసులతో మూసుకుపోయి
తెరుచుకోలేక అదొక శిధిల దేహమై పోదూ?

అంతమౌతున్న శకాన్ని ఒక జీవన సరాన్ని కరిగిపోతున్న
ఒకప్పటి కేంద్ర బిందువును గుర్తుచేయదూ?
దాని ఆరోగ్యం బాగుపడాలంటే
దాని ఆత్మలో మళ్ళీ వెలుగులు నిండాలి!
ఎవరైనా వెళ్ళి నివసించాలి...
ఓ చిన్న దీపంతో ధైర్యం వెలిగించాలి
ఆ వెలుగుతో అది తనను తాను చక్కబరుచుకుంటుంది
వారి ఊపిరితోనే అది మళ్ళీ ఊపిరి పోసుకుంటుంది
ఎప్పటికప్పుడు పునరుద్ధరణ జరగేది ఒక్కటే

నీ దేహాన్ని పునరుద్ధరించుకుంటే
నీ గృహాన్ని పునరుద్ధరించుకున్నట్టే
నీ గృహాన్ని పునరుద్ధరించుకుంటే
నీ దేశాన్ని పునరుద్ధరించుకున్నట్టే
దేహం, గృహం, దేశం అన్నీ మనం నివసించే ఇళ్ళే కదా?
రండి! మనం మన ఇంటిని బతికించుకుందాం!



# రాయలసీమ తొలి రాజకీయ నవల
# రేనాటి వీరుడు

- డాక్టర్ పొదిలి నాగరాజు
తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం

స్వాతంత్ర్యోద్యమకాలంలో రాయలసీమ నుంచి కూడా కొన్ని రాజకీయ నవలలు వచ్చాయి. 1950కి ముందే రాయలసీమలో మూడు అద్భుతమైన రాజకీయ నవలలు ఉన్నాయి. 1925లో కల్వటాల జయ రామారావు రాసిన రేనాటి వీరుడు రాయలసీమలో మొదటి రాజకీయ నవల. దీని తర్వాత 1933లో గుంటి సుబ్రహ్మణ్యశర్మ రచించిన మాధవాశ్రమము, 1949లో అంతటి నరసింహం రచించిన ఆదర్శం నవలలు ముఖ్యమైనవి.

జయ రామారావు రాసిన రేనాటి వీరుడు నవల ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాన్ని, పోరాటాన్ని చిత్రీకరించింది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పూర్వికులు అయిన గోపాలరెడ్డి, కృష్ణారెడ్డి, రామారెడ్డి, రంగారెడ్డి జయరామారెడ్డి మొదలైన వాళ్ళంతా విజయనగర సామ్రాజ్యానికి సామంతులుగా ఉండేవాళ్ళు. జయరామారెడ్డి మనుమడు నరసింహారెడ్డి. ఈయన పూర్వికులకు ప్రభుత్వం ఏడాదికి రూ.12,229ల తవర్జీ అందించేది. ఇది నరసింహారెడ్డి కాలానికి రూ.11 లకు పరిమితమైంది. ఇది అన్యాయంగా భావించిన నరసింహారెడ్డి బ్రిటీష్‌వాళ్ళపై తిరుగుబాటుకు సిద్ధమౌతాడు. ఆయన కోవెలకుంట్ల ఖజానాను దోపిడీ చేయడంతో ఈ నవల మొదలవుతుంది.

నరసింహారెడ్డి కోవెలకుంట్ల కార్యాలయ ముట్టడికి వస్తున్నాడని తెలిసి కోవెలకుంట్లలోని ప్రజలు భయపడి ఇళ్లల్లో నుంచి బయటకు రారు. యువకులు మిద్దెలెక్కి ఏమి జరుగుతుందోనని వేచిచూస్తున్నారు. నరసింహారెడ్డి 300 మంది సైనికులతో కోవెలకుంట్ల ధనాగారంపై మెరుపుదాడి చేస్తాడు. అక్కడున్న అధికారులంతా పారిపోతారు. హరిసింగు అనే కాపలాదారు నరసింహారెడ్డిని ఎదిరిస్తాడు. నరసింహారెడ్డి అతడిని కాల్చేస్తాడు. అక్కడి నుంచి చాకలివీధికొచ్చి భయంతో వణికిపోతూ దాక్కొని ఉన్న రెవెన్యూ అధికారి తలను నరికేస్తాడు. రెండు మొండాలూ అక్కడే వదిలేసి తలలు పట్టు కెళ్తాడు. కోవెలకుంట్ల గ్రామ మునసబు ఈ రెండు హత్యల గురించి కలెక్టరుకు ఒక ఉత్తరం రాస్తాడు. కడప కలెక్టరు, జమ్మలమడుగు సూపరింటెండెంటు కలిసి కోవెలకుంట్లకు వచ్చి ఆ మొండాలను డాక్టరుకు అప్పగించి వాటిని కొన్ని ఔషధాలతో జాగ్రత్తపరచమని చెబుతారు. ఈ హత్యలపై విచారణకు కలెక్టరు, సూపరింటెండెంటు ఉయ్యాలవాడకు వస్తారు. నరసింహారెడ్డిని ప్రశ్నిస్తారు. నంద్యాల నారాయణ రాజు, అతని అన్న వెంకటరామరాజు కలిసి ఈ హత్యలు చేసిఉంటారని నరసింహారెడ్డి చెబుతాడు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఔకులో ఉన్న నారాయణరాజును బంధించడానికి రక్షక భటులతో బయలుదేర్తాడు. చిట్వేలులోని వెంకట రామరాజు తమ్ముని భార్యకు ఆరోగ్యం సరిలేదని చూచి పోవడానికి ఔకు వచ్చిఉంటాడు. ఇన్‌స్పెక్టర్ పని సులభమై ఔకులో అన్నదమ్ములు ఇద్దరినీ బంధిస్తాడు. తాము నిర్దోషులమని ఎంతచెప్పినా వినిపించుకోడు. తర్వాత ఇన్‌స్పెక్టర్ బాటసారి వేషంలో ఆకుమళ్ళ బయలుదేర్తాడు. దారిలో ఒడ్డి ఓబన్న బాటసారి వేషంలో ఇన్‌స్పెక్టర్‌కు ఎదురవుతాడు. ఆకుమళ్ళలోని గోసాయి వెంకన్నకు ఉత్తరం అందివ్వడానికి ఓబన్న బయలుదేరితే, ఓబన్న వద్దనున్న ఉత్తరాన్ని దొంగిలించడానికి ఇన్‌స్పెక్టర్ వస్తాడు. ఓబన్న దారిలో కల్లుతాగి పడిపోతాడు. ఇన్‌స్పెక్టర్ ఓబన్న తలగుడ్డలో ఉన్న సీసాలోని ఉత్తరాన్ని తీసుకొని మరో కాగితాన్ని సీసాలో ఉంచుతాడు. ఇద్దరూ కలిసి ఆకుమళ్ళ చేరుకుంటారు. ఓబన్న, గోసాయి వెంకన్నకు ఉత్తరం అందిస్తాడు. వెంకన్న ఓబన్న తెచ్చిన ఉ

త్తరాన్ని, తనవద్ద ఉన్న ఉత్తరాన్ని కలిపి అగ్గిపెట్టెలో పెట్టి తన గుడిసెలో ఒక మూలన దాచి పెడతాడు. ఈ విషయం గమనించిన ఇన్స్పెక్టర్ అందరూ నిద్రపోతుండగా వెంకన్న గుడిసెకు నిప్పు పెడతాడు. తరువాత వెంకన్నను నిద్రలేపి 'మంటల్ని ఆర్పడానికి కొంతమంది మనుషుల్ని తీసుకురా పో! ఇంతలో నేను సామాన్లను బయటపడేస్తాన'ని చెబుతాడు. వెంకన్న మనుషుల కోసం వెళ్లగానే.. ఇన్స్పెక్టర్ ఉత్తరాలున్న అగ్గిపెట్టెను తీసుకొని వెళ్ళిపోతాడు.

సూపరింటెండెంటు ఫకీరు వేషంలో నొసం బయల్దేరి దారిలో ఒక అపరిచితుడ్ని కలుసుకొంటాడు. ఇద్దరూ కలిసి నొసం చేరుకుంటారు. దారిలో నయనాలతిప్ప వద్ద గొప్ప తిరునాళ్ళ జరుగుతుంది. అక్కడున్న శివాలయ సమీపానికి తిరునాళ్ళ సమయంలో తప్ప మిగతా సమయంలో జనం రారు. రాత్రి కావడంతో సూపరింటెండెంటు శివాలయం లోపలికి వెళ్తాడు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు అక్కడికి వచ్చి తలుపు తీసి ఉండడంతో భయపడతారు. నరసింహారెడ్డి నరికి తెచ్చిన తలలు ఉన్నాయో లేదో అని పరిశీలిస్తారు. తలల్ని చూసి ఉన్నాయనుకొని వెళ్ళిపోతారు. వచ్చిన వారికి భయపడి సూపరింటెండెంటు గుడిలోనే దాగిఉంటాడు. దాచి ఉన్న తలల్ని కనుక్కొంటాడు. ఆ తలల్ని తీసుకొని వెళ్ళిపోతాడు.

ఇన్స్పెక్టర్ సంపాదించిన ఉత్తరాలు, సూపరింటెండెంటు తెచ్చిన రెండు తలల్ని పరిశీలిస్తాడు. వాటిలో ఒకటి హరిసింగుది, రెండవది రెవెన్యూ అధికారిది. ఈ హత్యల్ని చేసింది ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఉత్తరాల ద్వారా తెలుస్తుంది. ఇద్దరూ కలిసి ఈ విషయాన్ని కలెక్టరుకు తెలియజేస్తారు. జైలులో బంధించిన నారాయణ, వెంకట రామరాజుల్ని వదిలేస్తారు. కలెక్టర్ ఆదేశానుసారం డిప్యూటీ సూపరింటెండెంటు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రక్షక భటులతో కలిసి నరసింహారెడ్డిని బంధించడానికి ఉయ్యాలవాడకు వెళ్తారు. అక్కడ నరసింహారెడ్డి, ఓబన్న, వెంకన్న మాటమైన తలల్ని గురించి చర్చించుకొంటూ ఉంటారు. ముగ్గుర్నీ ఒకేసారి పట్టుకోవాలని అధికారులు ప్రయత్నం చేస్తారు. కానీ ముగ్గురూ పారిపోతారు. నరసింహారెడ్డి ఆకాశ రామన్న ఉత్తరాలతో సూపరింటెండెంటును, ఇన్స్పెక్టర్ను బెదిరిస్తాడు. అధికారులు భయపడలేదని తెలిసి తన మనుషుల ద్వారా ఇన్స్పెక్టర్ భార్యను మోసం చేసి ఇంటిలోని మందు సామగ్రిని, తుపాకీలను దొంగలిస్తాడు. నరసింహారెడ్డి ఓబన్న, వెంకన్నలతో కలిసి ఉయ్యాలవాడలో జరిగే కోడిపందేలను చూస్తుంటాడు. ఇది తెలుసుకొన్న ఇన్స్పెక్టర్ పోలీసులతో వచ్చి నరసింహారెడ్డిని పట్టుకోబోతాడు. నరసింహారెడ్డి శూరత్వానికి పోలీసులంతా పారిపోతారు. నరసింహారెడ్డి ఇన్స్పెక్టర్ కాళ్ళు, చేతులు బంధించి అక్కడే పడేసి వెళ్ళిపోతాడు. పారిపోయిన పోలీసులు తిరిగివచ్చి ఇన్స్పెక్టర్ను విడిపిస్తారు. ఇది తెలిసి కలెక్టరు ఎక్కువమంది పోలీసులను వెంటబెట్టుకొని నరసింహారెడ్డిని బంధించడానికి బయలుదేర్తాడు.

గిద్దలూరు జాతరలో జనం మధ్యలో ఉన్న నరసింహారెడ్డిని చుట్టుముట్టి పట్టుకోబోతారు. నరసింహారెడ్డి సైన్యం, ప్రభుత్వం సైన్యంతో తలపడుతుంది.  రెడ్డిసైన్యం చెల్లాచెదరవుతుంది. రెడ్డి, ఓబన్న, వెంకన్న దగ్గరలోని నల్లమల అడవుల్లోకి పారిపోతారు. అధికారులు వెంబడిస్తారు. ఆ ముగ్గురూ కలిసి అహోబిలం నరసింహస్వామి ఆలయంలోకి వెళ్ళి దాక్కొంటారు. అధికారులు వచ్చి లొంగిపోవాలని ముగ్గురినీ హెచ్చరిస్తారు. నరసింహారెడ్డిని బతికించడానికి ఓబన్న, వెంకన్న పోలీసులు చూస్తుండగా పరుగెడతారు. అధికారులు, పోలీసులు నరసింహారెడ్డి అనుకొని కాల్చేస్తే.. అతడి మిత్రులు ఇద్దరూ చనిపోతారు. స్నేహితుల మరణం బాధను కలిగిస్తుంది నరసింహారెడ్డికి. అక్కడినుంచి ఉయ్యాలవాడకు చేరుకొంటాడు. చనిపోయింది నరసింహారెడ్డి కాదని గ్రహించిన పోలీసులు, అధికారులు ఉయ్యాలవాడను చేరుకుంటారు. నరసింహారెడ్డి ఉయ్యాలవాడలో పాడుబడిన తన ఇంటిగోడలో దాక్కొని ఉంటాడు. అధికారులు అక్కడి వచ్చారని తెలుసుకున్న నరసింహారెడ్డి పేరు సోములవైపు వెళ్ళి జగన్నాధుని ఆలయంలో తలదాచుకొంటాడు.

అధికారులు పోలీసులతో జగన్నాథుని ఆలయాన్ని చుట్టుముట్టి నరసింహారెడ్డిని పట్టుకొంటారు. బందీని చేసి కోవెలకుంట్లకు తీసుకెళ్తారు. మరుసటిరోజు సుమారు 2 గంటల సమయంలో ప్రభుత్వం నరసింహారెడ్డిని ఉరితీస్తుంది.

భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా చాలాచోట్ల తిరుగుబాట్లు జరుగుతూనే ఉండేవి. బెంగాల్లో సన్యాసి తిరుగుబాటు, ఒరిస్సాలో జమిందార్ల తిరుగుబాట్లు, విజయనగరరాజు తిరుగుబాటు, కొట్టూరు తిరుగుబాటు, సతారా తిరుగుబాటు లాంటి మొదలైనవి ఆయా కాలాల్లో జరిగాయి. 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందే జరిగిన ఈ తిరుగుబాట్లు చెప్పుకోదగ్గవి. ఇందులో భాగమే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటు. నరసింహారెడ్డి పాలెగాళ్ళ వంశానికి చెందినవాడు. ఈ పాలెగాళ్ళ పరిపాలన రాయలసీమలో చాలాకాలం వరకూ కొనసాగింది. కానీ 1800 నుంచి పాలెగాళ్ళ తిరుగుబాట్లు రాయలసీమలో అక్కడ కూడా అప్పుడప్పుడూ మెరుపులా సాగుతుండేవి. చిత్తూరు జిల్లాలో 1801లో జరిగిన తిరుగుబాటులో రాయలసీమలో పాలెగాళ్ళ

తిరుగుబాటు మొదలైంది. 1801లో పాకాల నుంచి శేషమ నాయుడు, కల్లూరు నుంచి రంగపతిరాజు, పులిచెర్ల నుండి తిమ్మానాయుడు, ఎదురుకొండ నుంచి ముద్దురామప్పనాయుడు మొదలైన పాలెగాళ్ళు చిత్తూరు నుంచి ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాట్లు 1805 నాటికి నిలిచిపోయాయి. బ్రిటీష్ అధికారులు ఈ పాలెగాళ్ళను బంధించి తిరుగుబాట్లను అణచివేశారు. రాయలసీమలో ఈ (1805) పాలెగాళ్ళ తిరుగుబాట్ల తర్వాత 1845–47 మధ్య కడప ప్రాంతానికి చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటు చరిత్రాత్మకమైనది.

క్రీ.శ.1800లో నిజాం నవాబు ఈ రేనాడును (రాయలసీమ) ఆంగ్లేయులకు దత్తతగా ఇచ్చాడు. అప్పటినుంచి దత్తమండలాలు ఆంగ్లేయుల వశమయ్యాయి. నొస్సం కోట కూడా ఆంగ్లేయుల వశం అయింది. ఈ కోటను చెంచుమల్ల జయరామిరెడ్డి అనే పాలెగాడు పాలిస్తూ ఉండేవాడు. ఈయన మనవడే నరసింహారెడ్డి. తనకు తాతలకాలం నుంచి వస్తున్న తనర్జీ బాగా తగ్గిపోవడంతో ఆవేశపడి తనకు కావలసిన తవర్జీ కోసం ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశాడు. 1801 –1847 మధ్య జరిగిన తిరుగుబాట్లు ఆయా ప్రాంతాలకు మాత్రమే చెందినవి.. కాబట్టి ఐకమత్యం, సరైన పథక నిర్మాణం తెలియకపోవడం వల్ల అణగారిపోయాయి. ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి ముందే రాయలసీమలో ఇలాంటి తిరుగుబాట్లు రావడం గొప్ప విషయం. 1857 తర్వాత కూడా గుత్తిలో (1893) అమరవీరుడు హంపన్న బ్రిటీష్ సిపాయిలై తిరగబడిన సందర్భం కనిపిస్తుంది.

కల్వటాల జయరామారావు 1925లో 'రేనాటి వీరుడు' నవలను ముద్రించాడు. స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావం ఈ నవలపై ఉందని స్పష్టంగా తెలుస్తుంది. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా గాంధీజీ రాయలసీమ పర్యటన చేశాడు. ఈ యాత్రలో సీమలోని కడప జిల్లా ఈ ఉద్యమానికి మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. 'కడప ప్రజలు గాంధీకి రూ.1115లు పర్సు బహూకరించారు. గాంధీ ఉపన్యాసాలన్నీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు తెలుగు చేశాడు. గాంధీ పర్యటన ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచింది. 1922 జనవరిలో సహాయ నిరాకరణ ఉద్యమంపై పంపిన నివేదికలో 'కడపలో సహాయ నిరాకరణోద్యమం ప్రబలంగా ఉంది' అని కలెక్టరు పేర్కొన్నాడు.

ఈ ఉద్యమ ప్రభావమే కాకుండా ఈ నవలపై విశాఖ మన్యంలో జరిగిన అల్లూరి విప్లవ ప్రభావం కూడా ఉంది. జయరామారావు 'రేనాటి వీరుడు' నవల రాసే సమయంలోనే సీతారామరాజు పోరాటం కొనసాగుతూ ఉంది. మన్యం విప్లవం 1922–24 మధ్య జరిగింది. రచయిత ఈ నవలను అదే కాలంలో రాశాడు. జయరామారావుపై ఇటు స్వాతంత్ర్యోదమ పోరాటం, అటు సీతారామరాజు కొనసాగిస్తున్న విప్లవాన్ని పోలిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటును ఇతివృత్తంగా తీసుకొన్నాడు.

ఇది సమకాలీన సామాజిక అంశాలు నేపథ్యంలో పుట్టిన నవల. ఈ నవలలోని నరసింహారెడ్డి, అల్లూరి సీతారామరాజు దేశభక్తి పారాయణులు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం జరిపి ప్రాణాలను అర్పించిన వీరులు. వీళ్ళిద్దరినీ సమానంగా భావించాలని తంగిరాల వెంకట సుబ్బారావు తాను రాసిన 'రేనాటి సూర్యచంద్రులు' పుస్తకంలో తెలియపరిచారు. 'ఇద్దరూ మహావీరులే. ఇద్దరూ భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసినవారే. ఇద్దరూ కాలాలూ వేరు; ఆయా కాలపరిస్థితులు వేరు. ఆయా కాల పరిస్థితులకు అనుగుణంగా ఈ ఇద్దరూ విప్లవాలు నడిపారు. నరసింహారెడ్డి తిరుగుబాటు 1845–47 మధ్యకాలంలో జరిగింది. సీతారామరాజు విప్లవం 1922–24 మధ్యకాలంలో జరిగింది. మొదటిది ప్రాచీనమైనది. రెండవది ఆధునికమైనది' అంటూ ఆయన వివరించారు.

జయరామారావు రాసిన 'రేనాటి వీరుడు' నవల విప్లవ నేపథ్యంలో వచ్చింది. ఈ నవలా కాలానికి (1925) భారతదేశం అన్ని చోట్ల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఇది రాయలసీమలో కూడా ఉంది. అటువంటి సమయంలో 'రేనాటి వీరుడు' నవల రాయడం గొప్ప విశేషం. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రూపొందిన నవల కాబట్టి 'రేనాటివీరుడు' నవలను రాజకీయ నవలగా నిర్ధారించవచ్చు. రచయిత దీనిని 'చారిత్రక నవల' అన్నాడు. కానీ 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి పూర్వమే కుంఫినీ పాలనపై తిరుగుబాటు ధోరణితో వచ్చిన స్వాతంత్ర్య సమరయోధుని పోరాట గాథ కావడం వల్ల ఇది రాజకీయ నవల అవుతుంది. రచయిత ఈ నవల రాయడానికి ఎంతో శ్రమపడి ఆధారాను సేకరించినట్లు పేర్కొన్నారు. 'ఈ వీరుని చారిత్రమును రచించుటకు దగిన చారిత్రాత్మక విషయములకై మిక్కిలి శ్రమపడి సంపాదించి, వాటి నాధారముగా జేసికొని వ్రాసితిని' 'రేనాటి వీరుడు' నవల కోవెలకుంట్ల ఖజానాను దోచుకోవడంతో మొదలై నరసింహా రెడ్డిని ఉరిదీయడంతో ముగుస్తుంది. ఈ కథ 1845–47 మధ్య జరిగింది. అయినా రచయిత నవలలో సమకాలీన ఆచార వ్యవహారాలు, యుద్ధతంత్రాలు, మూఢవిశ్వాసాలు, సీమలో ఎండతీవ్రత, సీమ కథలు, రెడ్ల తగాదాలు, మద్యపాన విశేషాలు మొదలైన విషయాలను ఎన్నో చర్చించాడు. ముఖ్యంగా

రాయలసీమ ప్రజలు నీరులేక కరువు బారిన పడి బాధపడేవారనీ, రాయలసీమలో ప్రయాణం చేసే వాళ్ళు తమ వెంట నీటిని తీసుకువెళ్ళాలని రచయిత వర్ణించాడు. ఆధునిక భావాలు కలిగిన కల్వటాల జయరామారావు సాంప్రదాయ భావాలు కలిగిన జనమంచి శేషాద్రిశర్మతో ఈ నవలకు పీఠికను రాశాడు. 'ఇది దత్తమండలమున జరిగిన కథ గాన దానిం గూర్చి పెంచి వ్రాయనక్కఱయుండదు. దేశమునందు గ్రంథకర్త గారికి గల సద్భావమీ గ్రంథము ద్వారా బోధపడక మానదు. వారి కృషినిరంతరాయముగ దినదాభివృద్ధి నొంది వారికి సత్కర్తిని దేజాలునగుదుగాక! ఇంతకన్న జక్కని శైలిని దత్తమండల పవిత్రస్థల చరిత్రమును ప్రబంధకల్పనగా వ్రాసి యశస్సును దిక్కుల వ్యాపింపజేయుదురని నమ్మెదను" అని చెప్పాడు. రచయితకు దేశభక్తి, సామాజిక సేవ ఉందని జనమంచి చెప్పాడు. కానీ ఇలాంటి చరిత్రల కంటే రాయల సీమలోని పవిత్ర స్థలాన్ని గూర్చి రాయమని చెప్పడం జనమంచికున్న సాంప్రదాయ భావజాలాన్ని వెల్లడిచేస్తుంది. జయ రామారావు తన మూడవ అన్న శేషయామాత్యునికి ఈ నవలను అంకితం చేశాడు. ఈ అంకిత పలుకుల్లో తన నలుగురు అన్నదమ్ముల ప్రశంసను పేర్కొన్నాడు.

రాయలసీమలో మంచినీటి బానలకంటే కల్లునీళ్ళ బానలే మనకు అధికంగా కనిపిస్తాయని రచయిత ఒకచోట రాశారు. 'అచట ప్రయాణీకులకై యుదకముతో నింపిన మట్టిపాత్రము లు లేకుండెను గాని సమీపముననే కల్లు దుకాణమొకటి కనుపడెను" ఈ కల్లు దుకాణాల వద్ద మత్తులో మునిగిన వ్యక్తులు తూగుతూ, ఒకరిపై ఒకరు నిందలు వేసుకొని కొట్టుకొనే వాళ్ళు. మనిషిని ఇంత దారుణంగా దిగజార్చే మద్యపానాన్ని భారతదేశంలో పూర్తిగా నిషేధించాలని కల్వటాల వివరించారు. "ఔరా! భారతీయుల తెలివి లేమికై యేమి జేయవలయును? కల్లు దుకాణములు మొదలంటగా కూలిపోవువఱకు భారతీయులకు సుఖజీవనము లేదుగదా!" అంటూ మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

జయరామారావు ముస్లిం పాలన పట్ల, స్థానిక ముస్లిముల పట్ల కొంత విముఖతా భావాన్నీ కనబరిచాడు. కడపలో నాటకాలు ప్రదర్శనలు జరిగే సమయంలో వారు రాళ్ళు రువ్వి, నాటకాలను ఆపించే ప్రయత్నాలు చేసేవారని వివరించా డు."అంతటి అన్యాయమునకు సర్కారువారు పాల్పడుదురా? న్యాయాన్యాయములను బరిశీలింపరా? అయులజేయుటకు మహ్మదీయ పాలనముగాదు కదా?'' అని మరోచోట వ్యాఖ్యానించారు.

ఆంగ్లేయ పాలనలోని కలెక్టర్‌ను దొర అని, ఆయన భార్యను దొరసాని అనడం స్వాతంత్ర్యానికి పూర్వం ఉండే సాంప్రదాయం. దొరసాని వేషధారణ భారతీయ స్త్రీ వేషధారణకు భిన్నంగా ఉండేది. రచయిత దొరసాని వేషధారణను చూసి విదేశీ వస్త్రాలను ఎగతాళి చేస్తాడు. "ఆమె పాదములకు గూడ తెల్లని బూడ్సులను వేసుకొని, కంఠము నుండి మోకాళ్ళవఱకు తెల్లని పావడ మాత్రము దొడగి కంటియద్దముల జోడును, తలపై వెడల్పగు బుట్టటోపీని బెట్టుకొని యుండెను. అట్టివారు బజారున బోవునపుడు సుడిగాలి వీచిన ప్రమాదము గదా! స్త్రీలకు మానమే కదా ప్రాణము! మానమునకై ప్రాణముల గోల్పోయిన యువతీ లలామలుండ వీరు పెనుగాలి వీచిన పైకెగయు పావడలేల గట్టుదురో తెలియకున్నదే!' అని పేర్కొన్నాడు.

అంటరానితనం, సతీసహగమం, బాల్యవివాహాలు లాంటి సాంఘిక దురాచారాలను రూపుమాపటానికి బెంగాల్‌లో రాజా రామమోహన్‌రాయ్, తెలుగులో కందుకూరి వీరేశలింగం లాంటి సంస్కర్తలు ముందుకొచ్చారు. ఈ దురాచారాలను నిర్మూలించ డానికి జయరామారావు తన వంతు సాహిత్యాన్ని సీమకు అందించారు. 1923లో రాసిన 'సువర్ణకేసరీ కృష్ణసేన' నవలలో సాంఘిక దురాచారాలను అక్కడక్కడా వివరించి వాటికి పరిష్కార మార్గాలను చూపించాడు. 'రేనాటి వీరుడు' నవలలో కూడా దురాచారాలను రూపుమాపాలనే ప్రయత్నం చేశాడు. 'సంఘ విషయములజర్చించు గ్రంథము నొకదానికి రచించి యాంధ్రదేశమున బడవైచినందునను, దాని నందఱు బఠించి యుందరను నమ్మకము చేతను, ప్రస్తుతము విపులముగ వ్రాయుటబూనితిమి." అంటూ తన సాహిత్యం ద్వారా దురాచారాలను నిర్మూలించడానికి కంకణము కట్టుకొన్నానని వివరించాడు రచయిత. 'రేనాటివీరుడు' నవలలో అనేక సాంఘిక విషయాలను వివరించాడు. సంక్రాంతి, జాతర విశేషాలు వివరించి వాటివల్ల సమాజానికి కలిగే నష్టాలను చిత్రించాడు. సమకాలీన సామాజిక విషయాలెన్నింటిలో వర్ణించాడు. ■

## కటుకోఝ్వల ఆనందాచారికి వాసిరెడ్డి భాస్కరరావు స్మారక పురస్కారం

**ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2022 సంవత్సరానికి గానూ కటుకోజ్వల ఆనందాచారి 'ఇక ఇప్పుడు' కవితా సంపుటి ఎంపికైంది. నవంబర్ 27న హన్మకొండలో అరసం వరంగల్ శాఖ పురస్కారాన్ని ప్రదానం చేసింది.**

## సాహిత్య ప్రస్థానం అక్టోబరు 2022 పురస్కారాలు

**ఇస్త్రీ అమ్మాయి**
కవితకు రూ.500
కవి : మందవరపు హైమవతి

**పోగొట్టుకున్న గాలిపటం**
కథకు రూ.500
రచయిత : శ్రీనివాసమూర్తి

■■■

కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం
కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

---

## చివరి నవ్వు



**అ**తను మళ్ళీ చెప్పాడు
బిగబట్టి వుంచిన పెదాలను
నెమ్మదిగా కదిల్చి..
తాను వెళ్లిపోతున్నట్లు
ఆమె తల దించుకుని
కాలి మువ్వలను సవరించుకుంటోంది

ఆమెలో ఇదివరకటి ఆనందం లేదు
అతను మళ్ళీ వస్తాడన్న ఆశ లేదు
దూరంగా ఎక్కడో మంచుకు తడుస్తున్న పక్షి వొకటి
వెచ్చదనం కోసం పాకులాడుతున్న నిశ్శబ్దం
గోడమీద నల్లటి నీడలు
అలల్లా ఊగుతున్నాయి!

అతను జవాబు కోసం
ఆమెలో వెతుకుతున్నాడు
ఒకరి గుండె చప్పుడు
ఒకరికి వినపడుతున్నా..
కొన్ని వేలమైళ్ల దూరం వారిద్దరి మధ్యన
వీడ్కోలు పలికేందుకు
సిద్ధంగా లేని ఆమె కళ్లు
బరువుగా వాలి వున్నాయి
గుండె మూలన ఓ అపురూప రహస్యం
అసహనంగా కదులుతోంది
పూలతేనె సేవించిన తుమ్మెద
పూత రెక్కల పాన్పుపై వెచ్చగా నిద్రపోతుంది!

ఆమె దిండు కింద
సగం రాసిన ఉత్తరం
ప్రశ్నార్థకంగా నలుగుతోంది
ఆమె ..అతని వెనుక
గుమ్మం దాకా నడిచింది

గుండె చెమర్చిన తడిని
మునిపంట నొక్కిపట్టి
అతన్ని చూస్తూ.. చివరిసారి నవ్వింది
అతను నవ్వలేదు
ఆమె నవ్వు మాటున దాగిన
వెలుగు నీడల్ని సమీక్షించుకుంటూ..
నిశ్శబ్దంగా.. అతను వెళ్లిపోయాడు..!

**- సునీత గంగవరపు**
**94940 84576**

## వారు పాడుతుంటే ...

- కంచరాన భుజంగరావు
94415 89602



ఈ నేల
ఎప్పటికప్పుడు
తనకు తాను బహుమతిగా ఇచ్చుకునే
స్వతంత్ర కళాజాలికులు వాళ్ళు
సుందర స్వప్నాల నిర్మాతలు వాళ్ళు
ఒక్కొక్క స్తబ్ధతలోంచి ఒక్కో చలనమై ఉరికే
ప్రవాహ చైతన్యపు పరవళ్ళు
చీకటి ప్రపంచాలను చూపించే తెల్లని కళ్ళు
నిరంతరం గొంతెత్తే అస్తిత్వపు ఉనికలు
కన్నీటి గుట్టల్ని దాటించే వెన్నెల కిరణాలు
మట్టి కుటీరాలకు మిద్దెనందించే వెలుతురు మెట్లు
పుడమి ఎముకల నుండి మొలిచిన పూలచెట్లు!

అక్షరాల్లోని వెలుగునూ వేడినీ
ఆయుధాలుగా ధరించేవారు..
మోసపు మాటల వంకర వాడిని చప్పున పీల్చి
పుక్కిట పట్టుకోగలవారు..
అన్యాయపు జ్వర తీవ్రతను భరించలేక
ఆవేశంతో ఉబ్బీ ఉబికే పదాలను
సాలోచనగా పుక్కిలించేవారు..
లోకపు మైకాన్ని పదునుగా కత్తిరించే కలానికి
చిటికెన వేలు తోడిచ్చేవారు..
కునికిపాట్లు పడే సమయ సందర్భాలకు
కనె్రప్పలు తెరిచిపట్టి కావలుండేవారు!

భజన మత్తులోనో భక్తి పారవశ్యంలోనో
తీరికంటూ లేని లోకం తెరిచివున్న కళ్లతో
గాఢ నిద్రపడి జోగుతున్నపుడు
నడి రాతిరిలో విజిల్ ఊదుకుంటూ
దొంగ చీకట్లను తరిమే గూర్ఖాలా వాళ్ళొస్తారు
ఒకే దేశం ఒకే తెర మీద దానీబానీ జాదూగర్ లాంటి
తెర వెనుక బాగోతాలను విడమరిచి చెప్తారు
నిత్యమూ యుద్ధాన్ని వెంటేసుకు తిరుగుతారు
వాళ్ళు భేరీలు మోగించేంత వరకూ
యుద్ధభూమి సైతం నిర్నిద్రంగా వేచి చూస్తుంది!

ఖైదులో వుంచి కళ్ళు పెరికినా
ప్రాణాలను పెళ్లగించినా
గద్దించే గద్దె మోతలకు అదిరిపోరు బెదిరిపోరు
ప్రశ్నల మేకుల్ని సూటిగానో నర్మగర్భంగానో
అధికారపుటడ్డుగోడల మీద దిగ్గొడతారు
చీకటికి చితిపేర్చి కాంతిపుంజాల్లా కంపిస్తారు
చెమట కాలవల్లో దేవుకొచ్చిన
పెద్దచేప వెన్నుముళ్ళు సూదిబెజ్జానికి
ఖద్దరు దారాన్ని పడుగు పేకలుగా కూర్చి
పంచీ గావంచా పచ్చంచు కోకల్ని కొత్తగా నేస్తారు
చిరుగులైన బతుకు బట్టలకు మాసికలేస్తారు

అవ్యక్తీకరణలెన్నింటినో
అలవోకగా పదచిత్రాల్లో చూపిస్తారు
కళ్ల ముందరి ప్రపంచానికి ఆవల
కలల లోకాన్ని సృజిస్తారు
మట్టిబెడ్డల్లాంటి బిడ్డల గాయాలను మాన్పే
మందేదో వారి చేతిలో వుంది
వారు పాడుతుంటే
ప్రజలు ప్రవహిస్తుంటారు!

■



# కావిలి

- రజిత కొండసాని

99492 95459

“ఇంగా సంగటిచారే సేత్తాండావా? సేన్లోకి కూలోల్లు వచ్చే యాలైంది బిరిగ్గా కానీ” అన్యాడు నాయిన.

పసుపూ కుంకుమ, ఆకూవక్కా సున్నం, పూలు, ఓ మూడు సేర్లు బియ్యం సరిపడా బెల్లము, తపెలా, మూత కొన్ని విస్తరాకులు గంపలో పెట్టి “మే ఇంటికాడుండి యేంసేత్తావు బాయికాడికి పోదాం రా” అని బింది నిండా నీళ్ళు తెచ్చి నా ముందరపెట్యా.

ఒగతే ఇంటికాడుండి సేతేదేం ల్యా అందుకే నాయినా అమ్మతో ఎల్లబారిన్నా. సేనుకాడికి పొయ్యే తొవ్వలో చెరువు మలుపు కాడ ఈరప్పసామి గుడి కాడ ఆగినాం. మాయమ్మ కట్టే పుల్లలన్నీ పోగేసి ఎసరు పెట్టినాది. గుడికడిగి ఈరప్ప సామికి సున్నం కలిపి నిలువు నామాల మధ్యలో కుంకుమ తిలకం పెట్టి నైవేద్యంగా ఆకులో కాసిన్ని బీము, రోంత బెల్లం పెట్నాడు నాయిన. నాకు అబ్బరమేసినాది. “ఇదేందీ నాయినా.. పసుపు కుంకుమ పాలికి సున్నం బొట్లు బెల్లం బువ్వ పాలికి బీము బెల్లం పెట్నావు” అని అడిగితి.

“ఈ సామీ బాపనోరంట. మనం చేసిపెడితే తినరంట. కాయిల్సినవని ఇస్తే సేసుకుతింటారని మా పెద్దోళ్ళు సెప్పినారు అబ్బుటి నుండి ఇదే ఆచారముండాది. సాగుబడి సేసేముందల ఈ సామికి నైయేద్యం పెట్టి సాగుబడి సేస్తే పంట బాగా చేతికొస్తాదంట. అదే ఈ ఊరి ఆనవాయితీ. మేం కూడా అదే పాటిత్తాన్నం” అనె నాయిన.

“ఇగో తొందరగా నైయేద్యం సేసుకుని సేనుకాడికి రాండి తలా ఓ ముద్ద పెడుదురు గానీ.. నేను కూల్లోల్లను పిలుసుకు పోయి ఇత్తనం పెట్టేకి నాంది సేత్తా” అని పోయినాడు.

“అట్నే” అని బాణం కుండ కిందకి నిప్పులెగదోసింది.

నాయిన ముందే పోయి మొక్కజొన్న విత్తనాలు పూడిపిత్తాండాడు. నేను అమ్మ పోతాండాం దారెంబడి.

“ఆ పొద్దు సెప్పితివి కదమ్మా.. మొక్కజొన్న విత్తులం పూడ్చేసినామని” అనడిగినాను.

“పూడ్చిన విత్తనాల్ని ఆ మొదలార్చిన ఉడతలుండ్లే అయి తినేత్తాండాయమ్మ.. ఏటిసేయాలో పాలుపోలే.. మల్లా పూడిపిత్తాండాడు మీ నాయిన” అనందమ్మ.

“ అట్నా అయ్యో మొలకెత్తుతాయో లేదో” అంటా కూసంత బాధపన్నా. పోతావుంటే లచ్చుమ్మవ్వ ఎదురొచ్చినాది.

“ఏం లచ్చుమ్మత్త.. ఇత్తనాలు పూడ్చడం ఐపోయిందా” అనడిగింది అమ్మ.

“యాడైపోయిందిలే. అంతా అట్లే వుండాది. పూడుత్తాం డారు. యాళపొద్దు బువ్వతెచ్చేకి ఇంటికి పోతాండా. మా అయ్య ఉడతలకు ఉర్లేసే ఎంకటసామి కోసం పోయినాడు” అనంది లచ్చుమ్మవ్వ.

“ఆళ్ళు అంత బిరగ్గా సిక్కుతారా.. సిక్కరు. ఆళ్ళు సుట్టుకారం తిరిగితేగాని రారు” అందమ్మ.

“నా కొడుక్కూడా పోయొచ్చినాడు పొద్దున. ఆళ్ళు సిక్కలేదంట. ఐనా పగలంతా డబ్బాలోకి రాళ్ళేసి గిలకరించినా సందకాడ సీకటేళకు వచ్చి తినేత్తాండాయి లచ్చుమ్మత్త.. పగలు కావిలుండచ్చు చీకట్లో వుండలేం కదా” అంది అమ్మ.

“ఔను.. మా నాయిన సేద్యం చేసే కాలంలో మడి గనాలెంబడి సేను సెలకలెంబడి తిరిగి కలుగుల్లో దాక్కున్న ఎర్రెలకల్ని, మాను కొమ్మల్లోను, పొదల చాటుల్లోను, సెలకల సుట్టూ సైనికుల్లా నిలబడిన టెంకాయ మాన్లుకి ఉర్లు కట్టి ఎలకల్ని ఏటాడేవాళ్ళు. ముంగిసలు, అడవి పిల్లలు కూడా కనపడ్డ ఉడత పిల్లల్ని పట్టి తినేసేవి. అప్పుడు వేటే వృత్తిగా జీవనం చేసేటోళ్ళ కాలం మారింది. వృత్తులన్నీ కనుమరుగై

పోయినాయి. పట్నం నుంచి ఒకటో రెండో పల్లెకు వలసొచ్చి ఆరుబయట ఆసనమేసుకుని కూసుండాయి. పంట పెద్దా మంటే పనికొచ్చే కూలీలే కరువై పోయిరి నానా తంటాలు పడి ముసలి ముతకల్ని పట్టుకుని పంటపెడితే వేసిన మరసనాడే పంటల్ని ఉడతలు ఎలుకలు చీమలు తినేత్తాం డాయి. తినగా ఒకటో రెండో మొలిత్తే దానికి నానారకమైన రోగాలు మందులు మాకులకే సగం దుడ్లు సరిపోతాంది. “నానా కష్టాలు పడి పంట చేతికొచ్చిందని సంబరపడితే పందులు మందల మందలొచ్చి పంటను నాశనం చేసి పోతాయి “ అంది అమ్మ.

“ఇట్టైతే ఇంగేం మిగులుతాదమ్మా “ అని అమ్మనడిగితి.

“నా సిన్నప్పుడు ఒకమాటన్నట్టు ఇప్పటికీ గుర్తు. రైతుకు ఏడుమంది శత్రువులు వుంటారంట. ఆ ఏడుమందికి పోను మిగిలింది రైతు కడుపుకు “ అనంది అమ్మ .

నాకు ఆశ్చర్యమేసినాది.

“ఎవరమ్మా ఆ ఏడుమంది” అనడిగినాను.

అమ్మ తిన్నగా నవ్వి “చెప్తాను రాజు సైనికుడు వాన ఎండ క్రిమి కీటకాలు వ్యాపారి దళారి” అంది. అమ్మ ఇట్లా మాట్లాడుకుంటా సేనుకాడికి పోయినాము పోతే కూలోళ్ళు మునాలెంబడి మొక్కజొన్నలు పూడుత్తాండారు ముందర గింజ పెడ్తాంటే ఎనకాలే గుంపులు గుంపులుగా ఉడతలొచ్చి తోడి పెట్టిన గింజనెల్లా తినేత్తాండాయి నాయన నీళ్ళు కట్టేందుకు మునాలెగెత్తాండాడు. నీళ్ళు మల్లించేలోపల మునాల్లో గింజలు ఎలకలే తినేసినాయి ఇది చూసి అమ్మ “ ఏం సేయాల్రా దేవుడా” అంటా సానా బాధపడినాది పాత చీరల్ని చింపి సెలక సుట్టూరా నాటిన కట్లకు సుట్టినాం అక్కడక్కడా నాయన పాత అంగీల్ని బెదుర్లుగా పెట్టినాం.పాత టేపురికార్డు క్యాసెట్ రీలు ఊడదీసి చుట్టూ చుట్టినాం గాలికి అది చేసే శబ్ధానికి ఉ డతలు బెదిరి పారిపోతాయని.

ఆ పూటకి ఉడతలు రాలేదు వారం దినాలు నేను అమ్మ నాయన సేనుకాడే వుండి ఉడతల్ని పంటలోకి దిగనీయకుండా బెదరగొట్టినాం. పదో రోజున గింజలు మొలకెత్తి మోసులు బయటికొచ్చినాయి. అక్కడక్కడా గాలికి తెగిపడిన క్యాసెట్ రీలు సందుల్లోంచి ఉడతలు పంటలోకి చొరబడినాయి మొలకెత్తిన మోసుల్ని కొరికేయబట్నాయి. ఏటి సేయాలో పాలుపోక నాయన బాధ పడ్తాన్నాడు. మరోపక్క పెట్టిన పంట రెండోసారి ఏమైపోతాదోనని మాయమ్మని దిగులు మేఘం కమ్మేసినాది.

ఏదో యోచన చేత్తా వంట పనిలో మునిగిపోయిండాది. అంతలోనే మజ్జిగ కోసం పక్కింటి సరోజా పిన్ని వచ్చిండాది “ అక్కా కాసిన్ని మజ్జిగుంటే పోత్తావా “ అంది పిన్ని. ఈ మాటతో ఈ లోకంలోకి వచ్చిండాది “ మొలకలు బాగా మొలిసినాయా “ అని సరోజా పిన్ని మాయమ్మని అడిగినాది “ఆ.. బాగా మొలిసినాయిగానీ.. ఏంచేద్దామక్కా.. ఆ ముదనష్టపు ఎలుకలు మామీద పగబట్నాయి నాశనం చేత్తాండాయి “ అంటా సరోజా పిన్ని తెచ్చిన చెంబులోకి మజ్జిగ ఒంపినాదమ్మ.

“ఔనా మాక్కూడా ఉడతల పోరు ఎక్కువైనాది దాన్ల దాడి తట్టుకోలేక నా మొగుడు మా తాత యోచన చేసి శెనగ దబ్బలు బెల్లాన్ని దంచి దాంట్లో విషపు మందు కలిపి పెట్నారు “ అంది సరోజా పిన్ని.

“ఆ పెడితే “ అని అడిగినాది అమ్మ.

“ఏడవాడ సచ్చిపోయినాయి “ అంది సరోజా పిన్ని.

ఆ మాటే మా నాయన చెవిన వేసింది. అమ్మ నాయనకు అట్లా సంపడం ఇట్టం లేదు.

“ వద్దులే “ అనన్నాడు నాయన. మాకేమీ పాలుపోలేదు. సరోజా పిన్ని సెప్పింది అచ్చరాలా నిజమే నాయన ససేమిరా అంటన్నాడు నాయన మనసులో ఏముందో కనుక్కోవాల .

“మరి ఎట్టా చేద్దాం “ అంది అమ్మ నాయన పక్కనసేరి.

“అట్టా సంపడం నాకిట్టం లేదే “ అంటా దొడ్లోకి అడుగేసినాడు.

“యోచన చేసేదాంట్లోనే పంట పోతాది “ అనుకుంటా అంగలార్చింది అమ్మ.

“పోనీ ఒగపని చేద్దాం కరెంటు తీగలు సుట్టూరా అల్లితే ముందు ముందుకీ పందులు రాకుండా వుంటాయి “ అంటా సలహా ఇచ్చింది నాయనకు అమ్మ.

“ఇప్పుడు జరిగేది చూడు ఎప్పుడో జరిగేది కాదే “ అంటా బెంగుళూరులో వున్న తమ్మునికి ఫోను కలిపినాడు నాయన.

“పెద్ద దోమతెర తీసుకురా “ అని నాయన అంటాంటే ఆశ్చర్యపోయినా.

“అదేంటికి నాయిన “ అంటా అడిగినా.

“ఉడతలకి “ అంటా చక్కాబోయాడు నాయిన.

మరుసటి దినమే తమ్ముడు పెద్ద దోమతెర ఉండ తెచ్చి ఇంట్లో పెట్టినాడు. అది తీసుకుని సేనుకాడికి అమ్మ నాయిన పోతాంటే ఎనకమాలే నేను తమ్ముడు పోయినాం. అక్కడక్కడా చేను చుట్టుకారం గుంజలు నాటి నాయిన ఇంకో కూలి మనిషి దోమతెర చుడతా వత్తాండారు నాకేమీ పాలుపోలే దోమతెరకు ఉడతలకి సంబంధం ఏంటని ఆలోచిత్తా నిలబడినా “ ఇది కడితే ఉడతలుగానీ కీటకాలు గానీ లోపలికి చొరబడవు. బయటనే వుండిపోతాయి.ఎండ వేడి పెద్దగా తగలదు.మోసులు

ఎండకుండా వుంటాయి. ఇదే మేలు " అని అమ్మతో నాయన సెప్తాంటే అప్పుడు తెలిసినాది.

"హమ్మయ్య " అనుకుని ఇంటికి పోయి ఆ రాత్రి బాగా నిద్రపోయినాము.

కోడి కూసే యాళకు లేచి నాయిన సేనుకాడికి పోయినాడు అన్నం పొద్దైనా ఇంటికి రాలే " మీ నాయిన్ని పిలుచుకు రాపోండి " అని అమ్మ గజమాయిస్తే సేనుకాడికి నేను తమ్ముడు నడుచుకుంటా పోయినాం. నాయిన ఆత్రంగా బాధగా ఎదురొచ్చినాడు. నాయిన ముఖంలో మునుపటి కళ లేదు.

"ఏమైనాది నాయినా " అంటా అడిగితిని.

నాయినకు నోరు పెగల్లేదు. తిరగా సేనుకాడికి మళ్ళినాడు నాయిన. ముందర నడుత్తాంటే మేమిద్దరం ఎనకమాలే నడిచినాం.

సీదా సేనుకాడికి పోయోసరికి గుండె సెరువైనాది. అందుకే నాయిన ముఖంలో బాధ కొట్టొచ్చినట్టు కానొచ్చినాది. రాత్రి పందుల దాడిలో దోమతెర చిరిగిపోయినాది. అక్కడక్కడా బొక్కలు పడి పనికిరాకుండా పోయినాది. ఈ ఇసయం అమ్మకు తెలిసి " అయ్యో ఎంత నష్టం జరిగిందబ్బా " అంటా బాధ పడినాది. బాగా యోచించినారు ఈసారి రెండేసి సుట్లు సుట్టేసినారు.

పంట పెరిగింది.

ఉడతల దాడి కాయింత తగ్గినాది. పంట ఏపుగా పెరిగినాక కంకులు బాగా కాసినాయి.

నాయిన సంతోషం అంతా ఇంతా కాదు.

దినాలు గడిసిపోతాండాయి ఆరోజు " మీ సేను రాత్రి పందులు గుద్దేసినాయి " అని ఎవరో సెప్తే సేనుకాడికి పోయి సూసినాం. పందులు పంటను దొబ్బేసినాయి దోమతెర చింపేసి నాశనం చేసినాయి. ఇలా ఐతే కాదని నాయిన గట్టిగా అనుకున్నాడు విషపు గుళికలు తెచ్చి పెడదామని పట్నం ఎళ్ళబారి పోయినాడు నాయిన. ■


## సాహిత్య ప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చురండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**


## నయా దేశభక్తి!

**సొం**త సంపద పెంచుమన్నా
మంచిగా జనాలతో మాట్లాడమన్నా
శుష్క వాగ్దానాలు చెప్పవోయ్
శూన్య ఆచరణ చెప్పబోకోయ్
కొంగ మాటలు చెప్పి
ఓట్లు పొర్లే దారిలో నువ్వు అడుగు వేయవలెనోయ్
దండిగా దోచిపెడితే
అగ్ర సింహాసనం నీదేనోయి

దారిద్ర్య దిగువున మనుషులుంటేనే
ఏలికల జాతి బాగుపడునోయ్?
సర్దుకొని సంపదలెల్ల దోచుకుని
పరదేశాలకు తరలింపవోయ్

అన్ని దేశాలలో మనసొమ్మే కుమ్మవలనోయి
విదేశీ సరుకులు ఇచ్చట తెగ నమ్మవలనోయి
డబ్బు దోచిపెట్టె నాయకుల చెంతకే
పదవి, ప్రతిఫలాలు చేరునోయ్

వెనుక చేసిన ఘనము లేదోయ్
వ్యక్తిగతము కొంచమేనోయ్
మందు తాగి నువ్వు చిందులెయ్యవోయ్
వినాయకుల వెనుక బలమదేనోయ్

జనాభిమానము నాకు కద్దని
ఒట్టి గొప్పలే చెప్పవలనోయి
పూని ఏదైనా సొంతమేల్
చూసుకొను వాడే ఘనుడోయ్
స్వలాభమే నంతా చూసుకొని
పొరుగు వాడికి హామీలి వ్వవలెనోయ్
దేశమంటే ప్రగతి కాదోయ్
దేశమంతా మా మనుషులే యేలవలెనోయ్

మతములెన్నివున్నా నేమినోయ్
స్వమతస్తులే అధికారమునందు నుండవలెనోయ్
స్వజాతి నన్నది పెరిగి
లోకమంతా వెలగవలినోయ్!

**- డాక్టర్ జీవీఎస్ జయపాల రావు**



మాట్లాడుతున్న తెలకపల్లి రవి, వేదికపై డాక్టర్ శంకరశర్మ, పత్తి ఓబులయ్య తదితరులు

# సమాజానికి దిక్సూచి గురజాడ

## సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి

**నేటి** సమాజానికి మహాకవి గురజాడ దిక్సూచి అని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి పేర్కొన్నారు. కర్నూలు లలిత కళా సమితిలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సాహితీ స్రవంతి, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో 30.11.2022వ తేదీన నిర్వహించిన గురజాడ వర్ధంతి సభలో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. మూఢత్వం, సాంఘిక దురాచారాల మీద పోరాడిన సంఘ సంస్కర్త గురజాడ అని, నేటికీ ఆయన స్ఫూర్తినిస్తూనే ఉన్నారని చెప్పారు. మతసామరస్యం కోరుకునే వారికి దేవునితో పేచీ కాదని, దేవుని పేరుతో దోపిడీ చేసే వారితో పేచీ అని తెలిపారు. బాల్య వివాహాలు, వేశవృత్తి మీద ఎక్కుపెట్టిన నాటకం కన్యాశుల్కం అని చెప్పారు. గిడుగు, వీరేశలింగం, గురజాడ హేతువాదానికి, సమాజ పురోగమనానికి ప్రతీకలుగా ఉన్నారని అన్నారు. సమాజాన్ని వెనక్కి తీసుకెళ్లేవాళ్లు, మహిళలను గౌరవించని వాళ్ళు, మతాల మధ్య మంటలు పెట్టేవాళ్ళు ఎప్పుడూ సమాజ హితులు కాలేరని తెలిపారు. దేశానికి స్వావలంబన, లౌకికతత్వం అవసరం అని కోరుకుంటే గురజాడ ఔన్నత్యం బోధపడుతుందని అన్నారు. ప్రజలకు నిజం తెలియకుండా చేసే నేటి పరిస్థితుల్లో సత్యం కోసం గురజాడ మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గురజాడకు ఇంట్లోనే ప్రతిఘటన ఉండేదని, అలాంటి రోజుల్లోనూ సంఘసంస్కర్తగా అభ్యుదయ వాదిగా పేరుపొందారని కొనియాడారు. అభ్యుదయ వాదులకు, హేతువాదులకు తన వంతు సహకారం అందిస్తానని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ తెలిపారు. దేశమును ప్రేమించుమన్నా అని గురజాడ అన్నారని, ఇప్పుడు ప్రపంచాన్ని మానవజాతిని ప్రేమించమని అనాల్సి వస్తోందని తెలిపారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్ శేషయ్య, ప్రజానాట్యమండలి నాయకులు బసవరాజు, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ శర్మ, కవి చంద్రశేఖర్ కల్కూర పాల్గొన్నారు.

**అలరించిన ఆట, పాట**

గురజాడ వర్ధంతి సభలో నిర్వహించిన ఆట పాట అలరించాయి. ప్రజానాట్యమండలి పాడిన పాటలు, వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆలోచింపజేసాయి. గాయకుడు ఆశన్న 'తూరుపు తెల్లవారుతుంది ప్రతి దినం... కాలం గతి మారుతుంది క్షణం.' అని, 'గాలిది ఏ కులము ఈ నేలది ఏ కులము' అని నాగ సుంకన్న, 'విన్నాను అమ్మ ఒడిలో కమ్మనైన తెలుగు ప్రసరించెను విజ్ఞానపు వెలుగు' అంటూ సుబ్బరాయుడు పాడిన గేయాలు వీనుల విందుగా సాగాయి. ప్రజానాట్యమండలి కళాకారులు లోకేష్ దర్శకత్వంలో రూపొందించిన దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా' నృత్య రూపకంలో గురజాడ వేషధారణలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.రాజు జీవం పోశారు. బతుకన్న, నోమేశ్వరి, కొరియో గ్రాఫర్లుగా వ్యవహరించారు. నగరంలోని హమాలీలు, ఇందిరాగాంధీ నగర్, ముజఫర్ నగర్లలోని విద్యార్థులు నృత్య రూపకం ప్రదర్శించారు. రవీంద్ర పాఠశాల విద్యార్థులు మయూరి సినిమాలోని అభ్యుదయ గీతాన్ని నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.



విజయవాడ సభలో మాట్లాడుతున్న సెర్ప్ ఎండి ఇంతియాజ్ అహ్మద్; వేదికపై శాంతిశ్రీ, అనిల్ డ్యానీ, గోళ్ల నారాయణరావు, అరసవిల్లి కృష్ణ

# మహాకవి గురజాడ బాటలో నడవాలి

## పలుచోట్ల వర్ధంతి సభలు
## చాగంటికి అవార్డు పట్ల అభ్యంతరం
## విజయనగరంలో గౌరవ యాత్ర

**మహాకవి గురజాడ అప్పారావు** అభ్యుదయ దార్శనికుడని, ఆయన భావాలను ముందుకు తీసుకెళ్లే వారికే గురజాడ విశిష్ట పురస్కారం ఇవ్వాలని సాహితీవేత్తలు, కవులు, కళాకారులు డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ విశిష్ట పురస్కారం ప్రకటించడాన్ని నిరసిస్తూ సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు రాష్ట్ర పలుచోట్ల సభలు జరిపారు. 27.11.2022 ఆదివారం గురజాడ గౌరవ యాత్ర పేరిట విజయనగరంలో ర్యాలీ చేట్టారు. గురజాడ విగ్రహానికి అసమ్మతిపత్రం సమర్పించారు.

**గురజాడ రచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

మహాకవి గురజాడ అప్పారావు 107 వర్ధంతి సభ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో 30.1.2022 సాయంత్రం జరిగింది. సభకు జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి అనిల్ డ్యానీ అధ్యక్షత వహించారు. ముందుగా దేశమును ప్రేమించుమన్నా... గీతంపై విద్యార్థులు వేసిన 36 ఆర్ట్స్ గ్యాలరీని ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అడిషనల్ చీఫ్ కమిషనర్ కమ్ సెక్రటరీ, సిసిఎల్ఎ అండ్ సిఇఒ, సెర్ప్ ఎండి ఇంతియాజ్ అహ్మద్ ప్రారంభించారు. ఎంతో అద్భుతంగా విద్యార్థులు గీశారని, గురజాడ భావాలు ఇంకా ఆశాకిరణంగా ఉన్నాయనే ఆలోచన తనకు కలుగుతుందని ఇంతియాజ్ పేర్కొన్నారు. సభలో మాట్లాడుతూ... సమాజగమనానికి ఉపయోగపడే మహాకవి గురజాడ సాహిత్యాన్ని, ఆయన కవితలను, గేయాలను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాల్సి ఉందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ మాట్లాడుతూ... గురజాడ రచనల్లో స్త్రీ అభ్యున్నతి గురించి, సమాజాభివృద్ధిలో ఆమె పాత్ర గురించి ఎంతో అభ్యుదయకరంగా చెప్పారని అన్నారు. అలాంటి మహాకవి అవార్డును ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం బాధాకరమన్నారు. ప్రముఖ కవి, రచయిత అరసవల్లి కృష్ణ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి కార్యదర్శి గోళ్ల నారాయణరావుమాట్లాడుతూ... సమసమాజ స్థాపన కోసం కృషి చేయడమే గురజాడకు మనందరం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. గుండు నారాయణరావు, సునీల్‌కుమార్, పరుచూరి ఆజయ్, కొల్లూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**ఆధునిక యుగకర్త గురజాడ**

గురజాడ పూర్ణమ్మ కథను చదివితే ఒక మహాకావ్యం చదివిన అనుభూతి కలుగుతుందని, ఒక్క దేశభక్తి గీతం చాలు, ఆయన మహాకవిగా లెక్కించటానికి అని సాహితీ స్రవంతి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. ఆయన ఆధునిక యుగకర్త అని పేర్కొన్నారు. మరొక వక్త అద్దేపల్లి ప్రభు గురజాడ కథలను విశ్లేషించారు. కాకినాడ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి సందర్భంగా నవంబరు 27 ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షత వహించారు. సాహితీస్రవంతి సభ్యులు సలాది సాయి సత్యనారాయణ వక్తలకు ఆహ్వానం పలికారు. గురజాడ పురస్కారాన్ని ప్రవచన కర్తను ఇవ్వటాన్ని సభ నిరసించింది. తరువాత జరిగిన కవి సమ్మేళనంలో మార్ని జానకిరామ చౌదరి, గరికపాటి మాస్టారు, అవధానుల మణిబాబు, తాడికొండ నరసింహారావు, ఇంద్రగంటి నరసింహమూర్తి, గిడుగు వేంకటా చలపతి, తంత్రవహి శ్రీరామ్మూర్తి, సలాది సాయి సత్య నారాయణ, శిరీష, అవధానుల సాలంకృత, మురళీ కుమారి తదితరులు పాల్గొని, కవితలను వినిపించారు. చింతపల్లి సుబ్బారావు, మోహనరావు, పద్మావతి వందన సమర్పణతో సభ ముగిసింది.

**నంద్యాలలో ...**

తన సాహిత్యం ద్వారా విశ్వ మానవతావాదాన్ని లోకానికి చాటిన మహాకవి గురజాడ అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గురజాడ 107 వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక, ఐద్వా ఆధ్వర్యంలో నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో *గురజాడ రచనలు దేశభక్తి* అనే అంశంపై సదస్సు



నిర్వహించారు. ముఖ్యఅతిథి, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అన్న గురజాడ బాటలో ప్రతి ఒక్కరూ దేశ ప్రగతికి పాటుపడాలని అన్నారు. డాక్టర్ వైష్ణవ వెంకట రమణమూర్తి మాట్లాడుతూ.. గురజాడ సాహిత్యం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని గురజాడ ఆ రోజుల్లోనే పేర్కొన్నారని మహిళా సంఘ అధ్యక్షురాలు నిర్మల అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రసాద్ రచించిన 'గురజాడ అప్పారావులో మానవతావాదం' కరపత్రాన్ని ఆవిష్కరించారు. గురజాడ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు డాక్టర్ రామకఅష్ణారెడ్డి బహుమతులు అందించారు. తరువాత విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమములో సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు, గోపాల్, మణి శేఖర్ రెడ్డి, నాగేంద్రుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నరేంద్ర, నీలం వెంకటేశ్వర్లు, కిషోర్, హుస్సేన్ రెడ్డి, మాబుబాష తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలులో ...**

కర్నూలులో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి, ఐద్వా ఆధ్వర్యంలో నిన్న పాటల, నృత్య పోటీలు జరిగాయి. సంఘాల నాయకులు అలివేలమ్మ, అరుణమ్మ, సుజాతమ్మ, జె.ఎన్ శేషయ్య, రంగస్వామి, బసవరాజు, బసయ్య, కెంగార మోహన్ , జంధ్యాల రఘుబాబు, పార్వతయ్య, అయ్యన్న, రంగస్వామి మొదలైన వారు పాల్గన్నారు. గుంటూరులో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సాహితీస్రవంతి, జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి సభ నిర్వహించారు.

**గురజాడ పురస్కారం చాగంటికి తగదు**

గురజాడ పురస్కారం చాగంటికి ఇవ్వడం తగదని సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల బసప్ప అన్నారు. గురజాడ అప్పారావు 107వ వర్ధంతి సభ కర్నూలు యూటియఫ్ కార్యాలయంలో జరిపారు. విశ్రాంత తహశీల్దార్ షేక్ షావలి మాట్లాడుతూ గురజాడ దార్శనికుడని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని సమాజంలోని మూఢ విశ్వాసాల్ని పారదోలాడన్నారు. ఇంకా జంగం స్వయంప్రభ, నల్లారెడ్డి మాట్లాడారు. రంగన్న, గాది లింగప్ప, నారాయణ, సుబ్బన్న, రఘురాం పాల్గొన్నారు.

**తిరుపతిలో...**

గురజాడ 107వ వర్ధంతి తిరుపతి జూనియర్ కాలేజీలో ఐద్వా, సాహితీ స్రవంతి, డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జరిగింది. జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రావు గురజాడ దేశభక్తి గీతాన్ని విద్యార్థినులతో పాడించారు. తెలుగు భాషోద్యమ అధ్యక్షులు శ్రీదేవి, ఐద్వా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి మాట్లాడారు. 'ఆధునిక మహిళలు చరిత్రను తిరగరాస్తారు' అన్న వ్యాఖ్య అర్థం ఏమి? మీరు ఆధునికులా?కారా అన్న ప్రశ్నతో విద్యార్థులు ఉత్సాహంగా స్పందించారు. గురజాడ ఆలోచనలను విని ఆశ్చర్య ఆనందాలు ప్రకటించారు. భర్త స్నానం చేసిన తరువాత వాడిన వస్త్రాలను భార్య పిండి ఆరేయాలని చెప్పిన ప్రవచనకారుడు చాగంటికి గురజాడ అవార్డు ఇవ్వడం తప్పా ఒప్పా అని అడిగితే 1500 పైచిలుకు విద్యార్థినుల గొంతులు తప్పు అని నిరసన తెలిపారు.

**విశాఖపట్నంలోని** కంచరపాలెంలో ప్రభుత్వ వృత్తి శిక్షణా కేంద్రం, కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ, వాగ్దేవి విద్యాసంస్థల్లోనూ, ఐటిఐ హాస్టళ్లలో, జివిఎంసి ఉన్నత పాఠశాలలోనూ గురజాడ వర్ధంతి సభలు, కార్యక్రమాలు జరిగాయి. బిఎన్ఆర్ ఫౌండేషన్, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీలాపన పోటీలు నిర్వహించారు. సాహితీ స్రవంతి కన్వీనర్ పెంటకోట రామారావు పర్యవేక్షించారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పురస్కారం ఇవ్వటాన్ని నిరసిస్తూ అల్లూరి విజ్ఞానకేంద్రంలో అరసం, సాహితీ స్రవంతి, విశాఖ రచయితల సంఘం, ఆవాజ్, ప్రజానాట్యమండలి, ఐద్వా, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

**విజయవాడలో** జాషువా సాంస్కృతిక వేదిక నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు చాగంటికి గురజాడ అవార్డు ఇవ్వటాన్ని నిరసించారు. బాలోత్సవ్ భవన్‌లో నవంబరు 27న జరిగిన కార్యక్రమానికి జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఎ సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. 18 సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ వాణి వినిపించారు. సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ... ఆనాడు సమాజంలో వేళ్లూనుకున్న అజ్ఞానాన్ని పారద్రోలడానికి గురజాడ గొప్ప రచనలు చేశారన్నారు. ఆధునిక మహిళలు ఎలా ఉండాలనే దిశగా ఎంతో ముందు చూపుతో ఆయన రచనలు గావించారన్నారు. మనుషులందరూ కలిసి ఉండాలని చెప్పిన గొప్ప కవి పేరుతో ఉన్న అవార్డును ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడమంటే అవార్డును అవహేళన చేయడమేనని అన్నారు. సినీ దర్శకులు సి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...గురజాడ వారి పేరిట అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ మనోహర్ మాట్లాడుతూ...ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనే గురజాడ వారి అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ప్రకటించారని అర్థం చేసుకోవాల్సి ఉంటుందని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఇంకా ప్రజానాట్యమండలి (పిఎన్ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, అరసం జిల్లా కార్యదర్శి అజయ్, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య, ప్రోగ్రెసివ్ ఫోరమ్-సంగమం నాయకులు తాజారావు, హేతువాదసంఘం నాయకులు లక్ష్మినారాయణ, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ నిర్వాహకులు డివి రాజు, స్వరలయ వేదిక నిర్వాహకులు కొప్పుల అశోక్, జెవివి నాయకులు శ్రీనివాసరావు, ఎంబివికె బాధ్యులు క్రాంతి కుమార్, డివైఎఫ్ఐ పూర్వ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి అప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, బిఎస్ఎన్ఎల్ నాయకులు చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ■



# ఇది గురజాడను గౌరవించడమా?

- గంటేడ గౌరునాయుడు

**"చాందసత్వపు చీకటులు తొలగించి,**
**లోకపు రీతి మార్చగ**
**ఆధునిక భావాలదివ్వెల**
**వెలుగులందించి**
**అభ్యుదయ పథమందు జాతిని**
**నడుపగా చేబూని కలమును**
**ఆయుధముగా ప్రయోగించిన**
**కవీ, జోహారు"**

**27.11.2022**వ తేదీన గురజాడ కార్యరంగమూ, సాహిత్య క్షేత్రమూ అయిన విజయనగరంలో 'గురజాడ గౌరవయాత్ర' పేరుతో ఆ మహాకవి ఇంటినుంచి గురజాడ విగ్రహం దాకా గురజాడ అభిమానులు కాలినడకన వెళ్ళి గురజాడ వర్ధంతి రోజు (30/ 11) 'గురజాడ సమాఖ్య' గురజాడ పురస్కారాన్ని చాగంటి వారికి ఇవ్వడం పట్ల తమ అసమ్మతిని తెలియజేసే కార్యక్రమం చేపట్టేరు. (ఇటువంటి యాత్ర జరపాల్సి రావడం దురదృష్టకరం). గత కొద్ది రోజులుగా ఈ విషయంలో ఫేస్‌బుక్‌లోనూ, వాట్సాప్ గ్రూపుల్లోనూ చర్చలూ, వాదనలూ జరుగుతున్నాయి. ఖండన మండనలు సాగుతున్నాయి. వ్యవహారిక భాషోద్యమ కాలంలో గురజాడ అసమ్మతి పత్రం ప్రకటించేడు. వందేళ్ళు దాటేక ఇప్పుడు గురజాడ కోసం గురజాడ సాహిత్యాభిమానులు ప్రకటిస్తున్నారు అసమ్మతి పత్రం.

ఒక మహనీయుని పేరుతో పురస్కారం ప్రకటించాలంటే ఆ మహనీయుని భావజాలానికి అనుగుణ్యమైన వారినే ఎంపిక చేయడం సమంజసం. ఒక మహోన్నతమైన వ్యక్తి పేరుతో పురస్కారం ఏర్పాటు చేయడమెందుకంటే వారి ఆశయాల్ని కొనసాగించడానికీ, వాటిని ప్రజల్లో వ్యాపింపజేయడానికీ. కానీ గురజాడ భావజాలానికీ, ఆలోచనలకీ వారి సంస్కరణ భావాలకూ వ్యతిరేకమైనవారిని, ఎంపిక చేయడం గురజాడ అభిమానులను సహజంగానే బాధ కలిగించింది. గతంలోనూ ఇలా ఎంపిక చేయడాన్ని వ్యతిరేకిస్తూ పత్రికా ముఖంగా తమ అసమ్మతిని తెలియజేస్తూ వచ్చేరు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. ఐనా పురస్కార ప్రదాతలు తమ చర్యల్ని సమర్థించుకోడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

వారి సమర్థింపుల కోసం గురజాడ దైవ భక్తుడనీ, సంప్రదాయ వాదనీ చెప్పుకొచ్చేరు. అందుకు ఆధారం కన్యాశు ల్కంలోని చివరి అంకంలో సౌజన్యారావు పంతులు చేతిలోని భగవద్గీత. గురజాడ ఇంట తులసికోట. తులసికోట వుంటేనో, దేవుడి పటం ఉంటేనో ఆ వ్యక్తి ఆస్థికుడని , భక్తుడని నిర్ణయం చేసేడమేనా? కథలోనో, నాటకంలోనో, నవలలోనో సృజనకారుడు ఎన్నో పాత్రల్ని సృష్టిస్తాడు. ఆ పాత్రల అభిప్రాయాలు రచయిత అభిప్రాయాలుగా భావించడం సరైందేనా? ఒక పాత్ర హంతకుడైతే రచయితని హంతకుడని నిర్ధారణ చేసేస్తారా? .. ఆయా పాత్రల సామాజిక స్థాయిననుసరించి సంభాషణల ద్వారా తాను నమ్మిన సత్యాన్ని ఆవిష్కరిస్తాడు. అంతవరకే. కన్యాశుల్కం నాటకంలో 'గిరీశం గురజాడే' అన్నవాళ్ళున్నారు. 'గురజాడే సౌజన్యారావు పంతుల'న్నవాళ్ళూ ఉన్నారు. ఇలా ఎవరికి తోచినట్టు వారు

నిర్ణయాలు చేస్సేరు. 'మధుర వాణి' ఆడవేషం వేసుకున్న గురజాడే అని అనీలేదు, రక్షించేరు!

గురజాడ జీవించినన్నాళ్ళూ ఛాందసుల విమర్శల్ని ఎదుర్కొంటూనే వచ్చేడు. గ్రాంథిక వాదుల అవహేళనల్ని, వెటకారాల్ని, వారి వికారాల్ని సహిస్తూనే తన ఉద్యమాన్ని కొనసాగించి విజయగర్వంతో తలెత్తి నిలబడ్డాడు. తాను భౌతికంగా లేనప్పుడూ వదల్లేదాయనను కొందరు. 'గురజాడ మరణించాకే జీవించడం ప్రారంభించేర'ని కృష్ణశాస్త్రి గారంటే ... అలా గురజాడ జీవించడం ఇష్టం లేని, అతని భావజాలంతో ఏకీభవించలేని కొందరు తమ పాండిత్యమంతా రంగరించి కుస్తీలు పట్టి జబ్బునత్తువకొద్దీ సంగతి వ్యాసాలు లోకమ్మీదకొదిలిన సంగతి ఇప్పటి గురజాడ సాంస్కృతిక సమాఖ్య వారికి తెలీదా? ఆ వ్యాసాలకు ధీటుగా సమాధానం చెప్పే ప్రయత్నం చేసేరా ఎవరైనా? అయినా అతడు గురజాడ. ఆ గురుజాడ ఎవరూ చెరపలేనిది.

■■■

గురజాడ ఆస్థికుడని చెప్తున్న వారు ఈ గురజాడ మాటల్ని చదివితే ఏమంటారో! "అందరు దేవుళ్ళూ వక్కరే అయితే ఆ పీనుగుల్ని అందరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూజ తగలెట్టరాదా?" (దేవుళ్ళారా మీ పేరేమిటి?)

"కార్యకారణ సంబంధ జ్ఞానం శూన్యమైనప్పుడు ఏది జరిగినా అది కాకతాళీయం, వేళావిశేషం, విధికృతం, యాదృచ్ఛికం అని వ్యక్తులు ఊహించి సంతృప్తి పడతారు. ఆలోచనకు చోటివ్వరు."

"అంధవిశ్వాసాలు ప్రమాదకరమైనవి. ప్రశ్నించే స్వభావం లేనప్పుడు గుడ్డి నమ్మకాలు కలుగుతుంటాయి. మనల్ని ఛాందసత్వం ప్రశ్నించనీయదు"

"క్షుద్రదేవతారాధన, ఉపాసన అనే మూఢ విశ్వాసాలను కలిగించి కొందరు దొంగ వేదాంతులు చేసే ఘోర కృత్యాలకు లెక్క లేదు. 'వేదాంతులస్తున్నారు, చెంబులూ ముంతలూ జాగ్రత్త' అన్న సామెత ఊరికే పుట్టలేదు."

**(గురజాడ 'తనలో తాను' శీర్షిక నుండి)**

"చంద్రవంశపు పట్టమహిషలను పుండాకోరులైన బ్రాహ్మణులకు బాహాటంగానే తార్చినట్లు కనిపిస్తుంది. బాహాటంగా జరిగినవే ఇలా వుంటున్నప్పుడు ఇంక రహస్యంగా ఎన్ని దుర్మార్గాలు, అవినీతి చర్యలు, దోషాలు జరిగాయో కదా? మీ ఇతిహాసాలను, పురాణాలను వొక్కసారి చదివి చూద్దూ."

**(మునిసుబ్రహ్మణ్యం గారికి 21.5.1909న ఉదకమండలం నుంచి గురజాడ రాసిన ఉత్తరం నుండి)**

"వివాహసంస్థ పురోగతికి దోహదం చేసిన మాట నిజమే, ఐతే వివాహబంధాన్ని తెంచుకోరాదనే నియమం చెప్పనలవిగాని కన్నీటి గాథలకు కారణం. ఈ సత్యాన్ని మనమెవరమూ విస్మరించలేము."

"మగవాళ్ళ అధికారం కింద, పెత్తనం కింద బానిసలుగా ఆడవాళ్ళు ఎలా పడివున్నారో, ఎంత మగ్గిపోతున్నారో నేనూహించుకోగలను."

**(మునిసుబ్రహ్మణ్యం గారికి ఉదకమండలం నుండి 2.6.1909 న రాసిన ఉత్తరం నుంచి)**

పైన ఉదహరించిన వాక్యాలు చదివాక కూడా గురజాడ ఆస్థికుడనే అంటారా?

"పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు ననుభవమ్ముల
తత్వమెరుగక శుకములగుదురు
వొట్టి శాస్త్రజ్ఞుల్.."

"వెర్రి పురాణగాథలు నమ్మజెల్లునె పండితుల్" అని గాలిపోగేసే మాటల్లని నమ్మొద్దంటున్నాడు గురజాడ. గురజాడను అభిమానించేవారయితే, అనుసరించే వారయితే తప్పకుండా ఆలోచించేవారు. గతంలో పురస్కారాలు పొందే వారి జాబితాలో చాలా పేర్లు ఉండే అవకాశమే లేదు. ఇప్పుడీ అసమ్మతి పత్రమూ, గౌరవయాత్రా అవసరమయ్యేదే కాదు!

చాగంటి కోటేశ్వరరావు గారు పండితులు, పురాణాల్ని ఆపోసన పట్టినవారు. గొప్ప ధారణాశక్తి గలవారు. ఆ శక్తి ఎవరికి ఉపయోగమనుకుంటే వారు స్వీకరిస్తారు. అతని ప్రతిభకు తగ్గట్టు, ఆ భావజాలానికి అనుగుణ్యమైన అపూర్వమైన గొప్ప పురస్కారం ఇచ్చి, గౌరవిస్తే ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండేదికాదు గదా.. సంతోషించేవారు కూడా. 'గురజాడ' పురస్కారం అన్నారు గనకనే ఇదంతా.

**'ఆధునిక కవితా వధూటికి
అందచందములద్ది, వన్నెలు
దిద్ది ముత్యాల్ సరములమరగ
జేసి వాడుక భాషలో
ప్రజల మాటను ప్రాణసమముగ
నెంచి, మూఢత్వమును దృంచగ
జనం కోసము ఉద్యమించిన
కవీ జోహారు.."**

■

**13-11-2022 :** కథానిలయం వ్యవస్థాపకుడు కాళీపట్నం రామారావు (కారా) మాస్టారి 98వ జయంతి సభను శ్రీకాకుళంలో నిర్వహించారు. అట్టాడ అప్పల నాయుడు, వీక్షణం వేణుగోపాల్, గంటేడ గౌరు నాయుడు, చీకటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.





**26-11-2022 :** ఉపాధ్యాయ ఉద్యమ నేత, సాహితీ స్రవంతి నాయకుడు, అనువాదకులు కె. కేశవరెడ్డి స్మారక పురస్కార ప్రదాన సభ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ ఏడాది స్మారక పురస్కారాన్ని ప్రముఖ విద్యావేత్త ఎస్ఆర్ పరిమికి అందచేశారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, అరవింద విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఇంద్రాణి, చైల్డ్‌లేబర్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. అంజనేయరెడ్డి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ జిఎం కె లక్ష్మయ్య, సమన్విత కన్వీనర్ డాక్టర్ శమంతకమణి పాల్గొన్నారు.



**18-11-2022 :** ఉద్యమ కవి రెడ్డి శంకరరావు కవితా సంపుటి "కాలం ఒడిలో" విజయనగరంలో ఆవిష్కరించారు. ప్రముఖ కవి సుంకర గోపాల్ సమీక్ష జరిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, అట్టాడ అప్పల నాయుడు, గంటేడ గౌరు నాయుడు సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 3 ▪ KRISHNA ▪ December 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.11.2022

